# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# LEGISLATIVE ASSEMBLY DEBATES

## అధికార నివేదిక

## OFFICIAL REPORT

**శుక్రవారం, జనవరి 10, 2014**

**13 వ శా. స. XII – III సమావేశం, వాల్యూం -- VI నంబరు -- 7**

**శక సంవత్సరం – 1935, పుష్యం – 20**

**FRIDAY, THE 10th JANUARY, 2014**

**13 L.A. XII - III SESSION, VOL— VI No. - 7**

**20 - Paush, 1935 - S.E.**

#


శాసన సభ సచివాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాదు – 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

## ఆంధ్రప్రదేశ్  శాసన సభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ నాదెండ్ల మనోహర్ |
| ఉప సభాపతి | : | శ్రీ మల్లు భట్టి విక్రమార్క |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ పి. కిష్టా రెడ్డి<br>శ్రీ జి. వెంకట శేషు<br>శ్రీమతి ఎ. ఉమా మాధవ రెడ్డి<br>శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్ |
| కార్యదర్శి | : | శ్రీ ఎస్. రాజ సదారామ్ |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణ రావు<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ వి. నరసింహాచార్యులు<br>శ్రీమతి టి. సుశీల<br>శ్రీ ఎం. విజయ రాజు<br>శ్రీ వి. రమేష్ కుమార్ |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి<br>శ్రీ టి. బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ కె. రాజ్ కుమార్<br>శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి ఎ. చంద్రభాగ<br>శ్రీమతి వి.ఎన్. ప్రసన్న కుమారి<br>శ్రీమతి ఆర్. వనితా రాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా.( శ్రీమతి) వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవ రావు<br>శ్రీ కె. వెంటేశ్వర రావు<br>శ్రీ డి. జగన్ మోహన్ రావు<br>శ్రీ బి. ప్రభాకర రావు<br>శ్రీమతి కె. భారతి<br>శ్రీమతి డి. విజయ కుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ పి. శ్రీనివాస్ |

------------

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ చర్చలు

## అధికార నివేదిక

**( 13వ శాసన సభ )**

**(12వ సమావేశపు మూడవ సమావేశము : పదమూడవ రోజు)**

**శుక్రవారము, జనవరి 10, 2014**

**సభ ఉ. గం.9.00 లకు ప్రారంభమైనది**

**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

----------

## విషయ సూచిక

1. సభా కార్యక్రమము

2. సభా కార్యక్రమము

వాయిదా తీర్మానాల అనుమతి గురించి

3. భారత రాజ్యాంగంలోని 3వ పరిచ్ఛేదం క్రింద గౌరవ భారత రాష్ట్రపతి నిర్దేశించిన విధంగా 2013, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ (మూడవ రోజు) (కొనసాగింపు)

-------

**ఆంధ్రప్రదేశ్ శాసనసభ**

**శుక్రవారం, జనవరి 10, 2014**

* * *

(ఉదయం 9.00 గంటలకు సభ సమావేశమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

## సభా కార్యక్రమము

## వాయిదా తీర్మానాల అనుమతి గురించి

(సభ ప్రారంభమైన వెంటనే వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సభ్యులు 'సేవ్ ఆంధ్రప్రదేశ్' 'సమైక్య ఆంధ్రప్రదేశ్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలి' 'మన ఆంధ్రప్రదేశ్‌ను సమైక్యంగా ఉంచాలి' అని వ్రాసి ఉన్న ప్లకార్డులను అధ్యక్ష స్థానంవైపు ప్రదర్శిస్తూ పోడియం వద్దకు చేరి 'జై సమైక్యాంధ్ర', 'వోటింగ్ పై హామీ ఇవ్వాలి', 'వుయ్ వాన్ట్ వోటింగ్', 'సీమాంధ్ర ద్రోహుల్లారా' 'జై సమైక్యాంధ్ర' 'జై జై సమైక్యాంధ్ర' అంటూ నినాదాలు చేయసాగారు)

మిస్టర్ స్పీకర్ : రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని కోరుతూ శాసన సభలో తీర్మానం చేయడం గురించి శ్రీమతి వై.ఎస్.విజయమ్మగారు ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరించడమైనది.

(వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సభ్యులు 'జై సమైక్యాంధ్ర' 'జై జై సమైక్యాంధ్ర' అంటూ నినాదాలు చేయసాగారు)

బి.ఎ.సి.లో తీసుకున్న నిర్ణయాలు మీకు స్పష్టంగా వివరించాను. మీ అభిప్రాయాలు, మీ అనుమానాలు, మీకు ఎటువంటి సమస్యలున్నా వాటిని తొలగించడానికి గత ఐదు రోజులుగా ప్రయత్నిస్తున్నాను. సభను మాత్రం మీరు దయచేసి అడ్డుకోవద్దు. దయచేసి సహకరించండి. మీకున్న అవకాశాలు, మీకున్న వెసులుబాటు, ఏ విధంగా మీరు ఉపయోగించుకోవచ్చో, అలాగే ఒక సభ్యుడికి ఉన్న హక్కుల గురించి కూడా మేము మీకు వివరించాం. ఇంతకన్నా స్పష్టంగా మీకు వివరించలేము. చర్చలో పాల్గొనండి. మీ హక్కులను, అవకాశాలను ఉపయోగించుకోండి.

('We want voting on the Bill' అంటూ వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సభ్యులు పదే పదే నినాదాలు చేయసాగారు.)

Smt. Y.S.Vijayamma garu, please request your Members to come back to their seats. Please participate in the debate. విజయమ్మగారూ, దయచేసి మీ సభ్యులను వారి స్థానాల్లో కూర్చోమని చెప్పండి. మేము ఏ విధంగా సమాచారం అందజేసామో! బి.ఎ.సి. మీటింగ్‌లో పాల్గొన్న మీ సభ్యులను అడగండి

('వోటింగ్ పై హామీ ఇవ్వాలి' అని పదే పదే వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సభ్యులు నినాదాలు చేయసాగారు)

అందరికీ స్పష్టత ఉన్నప్పుడు, ఎందుకు మీకు స్పష్టత లేదో చెప్పండి? చర్చలో పాల్గొనండీ, ఇది మీకు కూడా ఒక మంచి అవకాశం.

('జై సమైక్యాంధ్రా', 'వోటింగ్ పై హామీ ఇవ్వాలి' అంటూ వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సభ్యులు నినాదాలను పదే పదే కొనసాగించారు. 'మేము వోటింగ్ అడిగాము సార్', వోటింగ్ వుందో లేదో చెప్పండి సార్' అని అనసాగారు. అదే సమయంలో కొందరు సభ్యులు 'సమైక్య ద్రోహులారా... ' అంటూ నినాదాలు చేయసాగారు.)

(సభకు తీవ్ర అంతరాయం)

The House is adjourned for half-an- hour.

**(The House then adjourned at 9.04 A.M for half-an-hour)**

ఉ.10.30

(విరామానంతరం సభ తిరిగి ఉదయం గం. 10.30 నిమిషాలకు సమావేశమైనది.)
(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

## సభా కార్యక్రమము

మిస్టర్ స్పీకర్: పదే పదే మీకందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. అందరం కలిసికట్టుగా బీఏసీలో నిర్ణయాలు తీసుకున్నాం. బీఏసీ తీర్మానం మేరకు మనం సభను జరుపుకుంటాం. బీఏసీ నిర్ణయాలు సభ్యులందరకూ బాగా తెలుసు. సభలో ఏ విధమైన విధానాన్ని అవలంబించాలో బీఏసీలో చర్చించుకున్నాం.

(ఈ సందర్భంలో వైఎస్సార్‌సీపికి చెందిన కొందరు సభ్యులు 'జై సమైక్యాంధ్ర' 'సేవ్ ఆంధ్రప్రదేశ్' 'మన ఆంధ్రప్రదేశ్‌ని సమైక్యంగా ఉంచాలి' అని రాసి ఉన్న ప్లకార్డులు చేబూని స్పీకర్ పోడియం వద్దకు చేరుకుని 'జై సమైక్యాంధ్ర' 'జై జై సమైక్యాంధ్ర' అంటూ నినాదాలు చేయసాగారు.)

(అంతరాయం)

విజయమ్మ గారికి మాట్లాడడానికి అవకాశమిస్తాను, please go back to your seats. No posters, Don't bring placards in the house, don't do that, కూర్చోండి, దయచేసి సహకరించండి. ఎవరి స్థానాలో వారు కూర్చోండి.

('జై సమైక్యాంధ్ర' అంటూ నినాదాలు చేస్తూ వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సభ్యులు వారి వారి స్థానాలకు తిరిగి వెళ్ళారు)

Please go back to your seat, yes Vijayamma garu. . . . .

శ్రీమతి వై.ఎస్.విజయ లక్ష్మి (పులివెందుల): అధ్యక్షా, ఈ అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదములు. నిన్న సభలో తెలియజేసిన ఓటింగ్ విషయంపై మాకు ఎటువంటి హామీ ఇవ్వలేదు, కాబట్టి ఈ రోజు సభ నుంచి వాకౌట్ చేయాలనుకుంటున్నాము. మేము ఎందుకు వాకౌట్ చేయదలచుకున్నామో చెప్పదలచుకున్నాను. రాష్ట్రాన్ని విభజన చేయడానికి వ్యతిరేకంగా అత్యధిక ప్రజలు, నాయకులు కోరుకుంటున్నారు. ఆర్టికల్ 3 ప్రకారం సంబంధిత రాష్ట్ర తీర్మానం చేయాలని ఉన్నా దానిని చేయనందుకు నిరసనగా, ఉత్తరాఖండ్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్ మాదిరిగా, కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు అనుకూలంగా ఆర్టికల్ 3 ప్రకారం చేయనందుకు రాష్ట్ర విభజనకు వ్యతిరేకిస్తున్నాను. శ్రీ కృష్ణ కమిటీ నివేదికను న్యాయపరమైన నివేదికగా ఆ కమిటీ పేర్కొన్నా, దానిని పరిగణనలోకి తీసుకోనన్నందున, రాజ్యాంగ సంప్రదాయాలు, సమైక్య స్ఫూర్తిని పరిగణలోకి తీసుకోనందున, ఈ రోజు మనకు సర్కారియా కమీషన్, పూంఛ్

కమీషన్లు చెప్పిన విషయాలను పట్టించుకోనందున, విభజన నిర్ణయం తీసుకున్నందున నిరసన ప్రకటిస్తూ వాకౌట్ చేస్తున్నాం. అంతేకాకుండా 2001 అగస్టులో ఆనాటి హోం శాఖ మంత్రి రాష్ట్రాల పునర్విభజన రెండవ ఎస్సార్సీ ఏర్పాటు చేసి చేయాలని చెప్పినా, మీరా కుమార్ ఆధ్వర్యంలో భోపాల్‌లో జరిగిన ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో రెండవ ఎస్సార్సీ ప్రకారంమే రాష్ట్రాల విభజన చేయాలని తీర్మానించినా, అప్పట్లో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు కూడా రెండవ ఎస్సార్సీనే ప్రతిపాదించినా, ఇవన్నీ పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర విభజనకు పూనుకుంటున్నారు. ఏ లక్ష్యంతో ఆర్టికల్ 371డి రాజ్యాంగంలో చేర్చాలో ఆ లక్ష్యం సాధించకుండా విభజన బిల్లు పెట్టడంపై నిరసన ప్రకటిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లు 2013 ఉద్దేశాలు, కారణాలు చెప్పకుండా, అనేక ప్రధానాంశాలకు సమాచారం ఇవ్వనందుకు నిరసన ప్రదర్శిస్తున్నాం. శాసనసభ, శాసన పరిషత్తు అభిప్రాయాలకు, సీనియర్ నాయకులకు ఎలాంటి గౌరవం ఇవ్వకుండా, వారి అభిప్రాయం ప్రకారం ఓటింగ్ పెట్టనందున కూడా నిరసన తెలియజేస్తున్నాం.

(తమకు అవకాశం ఇవ్వాల్సిందిగా తెలుగుదేశం సభ్యులు శ్రీ డి. నరేంద్ర కుమార్, శ్రీ పయ్యావుల కేశవ్ అభ్యర్థించసాగారు)

(అంతరాయం)

అధ్యక్షా, వీటన్నిటికీ అధికార కాంగ్రెస్ నాలుగేళ్ల , మూడు నెలల దుష్ట పరిపాలనలో రెండు ప్రాంతాల్లో పార్లమెంట్ సీట్లు రావని, సెంటిమెంట్‌ని రెచ్చగొట్టి ఒక ప్రాంతంలోని కోట్లమంది ప్రయోజనాలకు వ్యతిరేకంగా మరో ప్రాంతం వారిని రెచ్చగొట్టి రాజకీయాలు చేస్తున్న యు.పి.ఎ. ప్రభుత్వం పట్ల మా నిరసనను వ్యక్తం చేస్తున్నాము.

(అంతరాయం)

ఒకటే అధ్యక్షా, ఎవరు విభజనకు వ్యతిరేకం, అనుకూలమని తేల్చేది అసెంబ్లీ మాత్రమే. ఓటింగ్ ఉండదని నిన్న, ఈరోజు శ్రీ దిగ్విజయ్‌సింగ్ గారు చెప్పారు. ఓటింగ్ ఉండదని నేను నిన్న మాట్లాడిన తరువాత ఆయా ప్రాంత నాయకులందరూ లేవటం, వీటన్నిటి గురించి మా పార్టీకి అనుమానాలు, భయాలున్నాయి. వీటికి ఈ రోజు సభలో గౌరవ ముఖ్యమంత్రిగారు ఏమైనా హామీ ఇవ్వగలుగుతారా? వారి ద్వారా మీరేమైనా హామీ ఇప్పించగలుగుతారా అధ్యక్షా. మొదటినుంచీ వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం సమైక్యంగా ఉండాలని పోరాటం చేసింది. మా పార్టీ అధ్యక్షుడు శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు దేశంలో అన్ని రాష్ట్రాల నాయకుల్ని కలిసి రాష్ట్రం సమైక్యంగా ఉంచేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈరోజు మా వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ తరపున ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన బిల్లు మీద అన్ని క్లాజులను వ్యతిరేకిస్తూ సవరణలను అందజేస్తున్నాము. ముఖ్యంగా మా పార్టీ తరపున రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలి అని కోరుతున్నాం. ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని మరోసారి మీ ద్వారా కోరుతూ నాయకులందరికీ కూడా విజ్ఞప్తి చేస్తూ ఈరోజుకి సభ నుండి వాకౌట్ చేస్తున్నాము.

MR.SPEAKER: Please give them to the Secretary.

(వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సభ్యులందరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన బిల్లు మీద అన్ని క్లాజులను వ్యతిరేకిస్తూ అమెండ్‌మెంట్స్‌ను శాసన సభ కార్యదర్శికి అందజేసి సభ నుంచి వాకౌట్ చేశారు.)

**ఉ.10.40**

SRI P. ASHOK GAJAPATHI RAJU (VIZIANAGARAM): Sir, unfortunately there is confusion. Right or wrong the Business Advisory Committee has met and we have discussed. The rights of the Members ought to be protected…...

(INTERRUPTIONS)

You were kind enough to inform us. Sir, even if single Member requests for division, it should be carried out. That is our understanding. Their understanding is that it is totally discretionary power. Under whatever head it may be i.e., head count or hand count or voting, our voting might not be decisive but it will definitely reflect our opinions. So, if the Chair can just clarify the Rule position, it will set everything in order. This is my submission to the Chair. Please clarify otherwise this is taking wrong information to the people.

(తెలంగాణా రాష్ట్ర సమితి పార్టీ సభ్యులు శ్రీ ఈటెల రాజేందర్ మరియు తెలుగు దేశం పార్టీ సభ్యులు శ్రీ డి.నరేంద్ర కుమార్ గారలచే అంతరాయం )

మిస్టర్ స్పీకర్: నరేంద్ర కుమార్ గారూ, మీ పార్టీ తరఫున అశోక్ గజపతి రాజు గారు మాట్లాడారు. దయచేసి మీరు కూర్చోండి. ఇటువంటి అనుమానాలు కాని, ఇటువంటి అభిప్రాయాలు కాని గత ఐదు రోజుల నుంచి మనం అనేక సందర్భాలలో వివిధ గౌరవ సభ్యులతో మాట్లాడడమే కాకుండా బిఎసిలో కూడా చర్చించుకున్నాం. ఎవరికీ ఎటువంటి అనుమానాలు రాకుండా వారు లేవనెత్తిన అంశాలపైన మనం సమాధానమిచ్చుకుంటూ ఎటువంటి ప్రొసీజర్ మనం ఫాలో అవుతున్నామన్న విషయం మనం స్పష్టంగా అందరికీ చెప్పడం జరిగింది. ఆనాటి బిఎసి సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ తరఫున ఆ పార్టీ అధ్యక్షురాలు విజయమ్మ గారితో పాటు మరో ముగ్గురు సభ్యులు కూడా పాల్గొన్నారు. ఇది అందరికీ తెలిసిన సమాచారమే. ఇందులో మనం కొత్తగా చెప్పాల్సిందేమీ లేదు. ఈ సెషన్‌లో పార్టిసిపేట్ చేసినాక గౌరవ సభ్యులకున్న అవకాశాలను వారికున్న వెసులుబాట్లను, వారి హక్కులను ఈ సభ ఎప్పుడూ గౌరవిస్తుంది. అంతే కాని చర్చనే జరగకుండా ముందుగానే ఓటింగ్ పెట్టమని వారడగడం అనేది మన సభ సంప్రదాయాలకు విరుద్ధంగా వుంటుంది. అది పద్ధతి కూడా కాదు. అయినా ఈ అంశం గురించి వారికి ప్రతిసారీ చెప్పడం జరుగుతున్నది. అయినా వారికి స్పష్టత రాకపోవడం వల్ల they wanted to protest and walkout.

(తెలంగాణా రాష్ట్ర సమితి పార్టీ సభ్యులు శ్రీ టి.హరీశ్ రావు తదితరులచే అంతరాయం )

## భారత రాజ్యాంగంలోని 3వ పరిచ్ఛేదం క్రింద గౌరవ భారత రాష్ట్రపతి నిర్దేశించిన విధంగా 2013, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ (మూడవ రోజు) (కొనసాగింపు)

శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డి (ప్రభుత్వ ప్రధాన సచేతక్)ః అధ్యక్షా, చర్చను నిన్న నేను ప్రారంభించడం జరిగింది. సభ వాయిదా పడిన తరువాత మళ్లీ ఈ రోజు నాకు మాట్లాడడానికి అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ రోజు రాష్ట్రంలో ఏర్పడిన కొన్ని ప్రత్యేకమైన పరిస్థితుల్లో, 56 సంవత్సరాల కలయికలో తెలంగాణా ప్రాంత ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం అనేక సంప్రదింపులు చేసిన పిదప, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకున్న తరువాత తెలంగాణా రాష్ట్రాన్ని రాజ్యాంగబద్ధంగా, రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలకనుగుణంగా ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ఈరోజు తీసుకోవడం జరిగింది. ఈ రోజు సభలో వున్న ప్రతిఒక్కరూ ఎలాంటి చర్చ లేకుండా ఈ తెలంగాణా ఏర్పాటుకు సంబంధించిన అంశంపై సహకరించాలని కోరుతున్నాను. ఎందుకంటే ఈ రోజు మన రాష్ట్రంలో వున్న ప్రధాన రాజకీయ పార్టీలన్నీ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలమని అనేక సందర్భాలలో చెబుతూ వచ్చాయి. దానికనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం అందరితో సంప్రదింపులు పూర్తిచేసిన తరువాత ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిది. అయితే ఈ రోజు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగవిరుద్ధమని, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని గౌరవ మంత్రి గారే చెప్పడం అభ్యంతరకరమని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఎందుకంటే రాజ్యాంగబద్ధంగా తీసుకున్న నిర్ణయాన్ని వారు వ్యక్తిగతంగా వ్యతిరేకించవచ్చు కాని మనమందరం శాసనసభ్యులుగా రాజ్యాంగం మీద ప్రమాణం చేసి రాజ్యాంగానికి అనుగుణంగా పని చేస్తామని చెప్పడం జరిగింది. ఈ బిల్లుకూడా అలాంటి రాజ్యాంగానికి అనుగుణంగానే వచ్చినటువంటిది. ఈ రోజు వరకు 56 సంవత్సరాలుగా తెలంగాణా ఆంధ్ర రాష్ట్రం కలిసివుండడం జరిగింది. కాని 1956లో విశాలాంధ్ర ఏర్పడిన తరువాత దాదాపు 13 సంవత్సరాల కాలం తరువాత 1969లో మాకు కలిసివుండడం ఇష్టం లేదు, మేం విడిపోతామని ఒక ఉద్యమం జరిగింది. ఆ ఉద్యమంలోఉజ్వల భవిష్యత్తు కలిగిన అనేక మంది యువకులు వీరమరణం చెందిన విషయాన్ని గుర్తు చేస్తున్నాను. ఆనాడు 1969లో జరిగిన ఉద్యమం నేపథ్యం తరువాత కొన్ని ఒప్పందాలు జరిగాయి. కాని ఆ ఒప్పందాలను ఆనాటి పాలకులు చిత్తశుద్ధితో అమలు చేయలేదు కాబట్టి మళ్లీ మరొక ఉద్యమం వచ్చింది. అది జై ఆంధ్ర ఉద్యమం. జై ఆంధ్ర ఉద్యమం వచ్చిన తరువాత స్వర్గీయ ఇందిరాగాంధి గారు రాష్ట్రం సమైక్యంగా ఉడాలని చెప్పినట్లుగా ఇవ్వాళ కొంతమంది సభ్యులు చెబుతున్నారు. ఆనాడు ఒక ప్రయత్నం చేద్దామన్న ఉద్దేశంతో ఆ ఆలోచన చేసినా ఆనాటి పాలకులు దానిని చిత్తశుద్ధితో నిర్వర్తించలేదన్న దానికి అనేక నిదర్శనాలున్నాయి. అయితే ఆనాడు ఇందిరా గాంధి గారు తీసుకున్న నిర్ణయానికి కూడా ఒక అర్థమున్నది. ఆనాటి ప్రజలు నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం కావాలని, రాచరిక వ్యవస్థనుంచి విముక్తి కావాలని ఉద్యమం చేసిన నేపథ్యంలో 1948 సెప్టెంబర్ 17 నాడు తెలంగాణా ప్రాంత విమోచన జరిగింది. ఆనాటి పరిస్థితుల్లో నిజాం పాలకులు కూడా భారతదేశంలో కలిసినప్పటికీ వారికున్న ఒక దేశాన్ని

అక్రమంగా భారతదేశంలో విలీనం చేసుకున్నారు కాబట్టి ఆ విషయంపై ఐక్య రాజ్య సమితి ఇంటర్‌ఫియర్ కావాలని వారు పిటిషన్ వేయడం జరిగింది. అప్పటికి ఆ పిటిషన్ పెండింగ్‌లో వుంది కనుక నిర్ణయం తీసుకోలేదు తప్ప వేరే కారణం లేదు. ఆ కారణాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక ఒప్పందాలు చేయడం జరిగింది. ఆ ఒప్పందాలలో ఆంధ్ర ప్రాంతానికి ముఖ్యమంత్రి వుంటే తెలంగాణా ప్రాంతానికి ఉప ముఖ్యమంత్రి ఉండాలన్న కనీస సూత్రాన్ని 1956లో అనాటి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి గారు మొట్టమొదటి ఉల్లంఘన చేయడం జరిగింది. ఆవిధంగా వారు విఫలమయ్యారు. విఫలమవడమే కాదు ఉప ముఖ్యమంత్రి పదవి అన్నది ఆరో వేలిగా వుంటుంది తప్ప దాని వల్ల ప్రయోజనం లేదనే విధంగా కనీసం ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వమంటే కూడా ఆ రోజు ఇవ్వలేదు. అంటే ఆ విధంగా మాట్లాడిన అనాటి పాలకుల ఉదార స్వభావాన్ని గుర్తు చేస్తున్నాను. ఉప ముఖ్యమంత్రి పదవిని పక్కన పెడితే ఆ రోజున తెలంగాణా ప్రాంతంలో భూములు కొనాలనుకున్నా, వ్యవసాయం చేయాలనుకున్నా తెలంగాణా రీజనల్ కమిటీ పర్మిషన్ తీసుకొని చేయాలన్న నిబంధనను కూడా అమలు చేయకుండా ఈ రోజున హైదరాబాదు చుట్టుపక్కల వున్న భూములను ఎక్కడికక్కడ ఎవరికంటే వారికి కట్టబెడుతూ రాజ్యాంగాన్ని, ఒప్పందాలను ఉల్లంఘన చేయడం జరిగింది. కాబట్టి ఈ రోజు తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు అన్నది ఏదో ఆవేశంగా పుట్టుకొచ్చింది కాదు. ప్రతి చోటా వివక్షకు గురి అవుతున్న కారణంగా పుట్టుకొచ్చిందని గుర్తు చేస్తున్నాను. కేవలం ఉప ముఖ్యమంత్రి పదవినివ్వడానికే మనసు రాని వీళ్ల ఈ 56 సంవత్సరాల కాలంలో తెలంగాణా ప్రాంతం వారికి ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన సందర్భాలు కేవలం నామమాత్రమేనని చెప్పవచ్చు. 1978లో తెలంగాణా ప్రాంతం నుండి శ్రీ పి.వి.నరసింహా రావు గారు మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి అయినప్పుడు కేవలం కొద్ది నెలలు మాత్రమే పని చేసిన తరువాత కుట్రలు పన్ని ఆయనను పదవి నుంచి దిగిపోయేవిధంగా ప్రయత్నం చేయడం జరిగింది.

ఉ.10.50

వారు ముఖ్యమంత్రిగా బాగా చేయలేకపోయినా భారత ప్రధానమంత్రిగా సక్సెస్‌ఫుల్‌గా పని చేయగలిగారు. దేశం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పుడు తెలంగాణా ప్రాంతానికి చెందిన వ్యక్తి భారత దేశానికి ప్రధానమంత్రి కాగలిగాడు. దేశాన్ని సమర్థవంతంగా నడిపించగలిగాడు.

1978వ సంవత్సరంలో స్వర్గీయ మర్రి చెన్నారెడ్డిగారు ఒక క్లిష్ట సమయంలో దేశం మొత్తంలో వేరే ప్రభంజనం ఉన్నప్పటికీ ఆ రోజు పార్టీ అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు స్వీకరించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేశారు. వారిని కూడా కేవలం ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం అధికారంలో ఉండనివ్వలేదు. 1989వ సంవత్సరంలో ప్రజల్లో మంచి పేరున్న ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి. రామారావుగారు ఆ రోజు ఉన్న పరిస్థితులను ప్రజలకు చక్కగా వివరించి నాయకత్వాన్ని సమన్వయం చేసి 1989లో ముఖ్యమంత్రి పదవికి అవకాశం వచ్చినా వారిని కూడా ఒక సంవత్సరం పాటు అధికారంలో ఉండనివ్వలేదు. దానికి కారణం తెలంగాణా ప్రాంతంలో ప్రజా ప్రతినిధులు తక్కువగా ఉండడం, వేరే ప్రాంతానికి చెందిన ప్రజా ప్రతినిధులు ఎక్కువగా ఉండడం వల్ల అలా జరిగింది. ఈ ప్రాంతం వాళ్లను సెకండ్ గ్రేడ్ సిటిజన్స్‌గా చూడాలనే

దురాశ, దురాలోచన వల్ల ఆ విధంగా జరిగింది. ప్రతి చోట తెలంగాణా ప్రాంతం వారంటే వివక్షత కొనసాగింది. ఈ యాభై ఏళ్ల సమైక్య ఆంధ్ర రాష్ట్రంలో తెలంగాణా వారు ప్రతి రంగంలో వివక్షతకు గురైన విషయాన్ని ఈనాడు గుర్తు చేస్తున్నాను.

ఈ రోజు అనేక చట్టాలు శాసన సభలో చేశాము, అనేక చట్టాలు భారత పార్లమెంట్‌లో చేశాము. ఈరోజు జరిగినటువంటి ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ముసాయిదా బిల్లు తెలంగాణా ప్రజల యొక్క ఆకాంక్ష. కొంతమంది శాసనసభ్యులు మాట్లాడుతూ ఇది రాజ్యాంగ విరుద్ధమని చెబుతున్నారు. దీనిని కొంతమంది వ్యక్తులు మాత్రమే కోరుకుంటున్నారనే మాట చాలా సత్యదూరం . మా ప్రాంతంలో పుట్టిన ప్రతి పిల్లవాడు నుండి రేపో మాపో కాటికి పోయే వ్యక్తి సైతం తెలంగాణా రాష్ట్రం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. దానికనుగుణంగా గతంలో అందరూ ఈ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు సహకరిస్తామని చెప్పారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి మొదలుకొని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడుగారు, వైఎస్ఆర్‌సిపి పార్టీకి చెందిన విజయమ్మగారు కూడా ఏదో ఒక సందర్భంలో తాము తెలంగాణాకు అనుకూలమని చెప్పిన మాట వాస్తవము. కాని ఈ రోజు వారు ప్రవర్తించిన తీరు చూస్తే చాలా బాధాకరంగా ఉంది. నిజంగా వాళ్లు మాట్లాడిన మాటలు ఓట్ల కొరకు, సీట్ల కొరకు మాట్లాడారని అర్థమవుతుంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల మాటలు, మ్యానిఫెస్టోలో పెట్టిన వాటిని ప్రజలు ఒక భగవద్గీతలా, బైబిల్‌లా, ఖురాన్‌లా భావిస్తారు. ఈ రోజు అవకాశం వచ్చినప్పుడు ఒకలాగా, అవసరం లేనప్పుడు మరొక రకంగా మాట్లాడడం తెలంగాణా ప్రజలు జీర్ణం చేసుకోలేక పోతున్నారు. 2009లో ఆనాటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు గారు శాసనసభలో మాట్లాడుతూ చాలా ఆవేశంగా చాలా సుధీర్ఘమైన మాటలు చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణాపై తీర్మానం పెడితే మా పార్టీ ఎలాంటి చర్చ లేకుండా అనుమతిస్తుందని, దానిని స్వాగతిస్తామని చెప్పిన మాట వాస్తవం కాదా? ఆ పార్టీ 2009 ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విషయం కూడా ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. అంతేకాక ప్రణబ్ ముఖర్జీ కమిటీకి తన అభిప్రాయాన్ని లేఖ రూపంలో ఇప్పటికే తెలియ చేయడం జరిగింది. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణా రాష్ట్రానికి అవసరమైన రాజకీయ, చట్ట పరమైన చర్యలు తీసుకుంటుందని వారి ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టడం జరిగింది.

2008 అక్టోబర్ 18వ తేది నాడు ఆనాటి కేంద్ర హోమ్ మంత్రి ప్రణబ్ ముఖర్జీకి లేఖ ద్వారా తెలియ చేయడం జరిగింది. అంటే వారు చెప్పిన మాటలు, ఈ రోజు వారు మాట్లాడే మాటలు చూస్తుంటే నాకు చాలా బాధ కలుగుతోంది. మీకు మానవత్వం ఉంటే ఎలాంటి చర్చ లేకుండానే తెలంగాణా బిల్లును మొత్తం ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ ఎలాంటి చర్చ లేకుండా త్వరగా పార్లమెంట్‌కు పంపించాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. వైఎస్ఆర్‌సిపికి చెందిన గౌరవ అధ్యక్షురాలు ఈ మధ్య కాలంలో మా జిల్లాలో జరిగిన ఉప ఎన్నికల సమయంలో వచ్చినప్పుడు, తమ పార్టీ తెలంగాణా రాష్ట్రానికి అనుకూలమని, తమకెలాంటి అభ్యంతరం లేదని వారు చాలా

సవివరంగా చెప్పడం జరిగింది. అదేవిధంగా వై.ఎస్. విజయమ్మగారు రాజశేఖర్ రెడ్డిగారి సమాధి వద్ద ప్రజల యొక్క ఫీలింగ్సును గౌరవిస్తామనే మాట చెప్పడం జరిగింది.

సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సోదర సమానులైన కిరణ్ కుమార్ రెడ్డిగారు కూడా అనేక సందర్భాలలో తెలంగాణా ప్రాంతంలో పర్యటిస్తున్నప్పుడు కూడా చెప్పడం జరిగింది. వారు ఇదే సభలో మార్చి 15, 2013వ తేదిన హరీష్‌రావుగారు సభలో మాట్లాడుతున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అమలు చేస్తామని ముఖ్యమంత్రిగారు చెప్పడం జరిగింది. ఈ ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు కూడా తెలంగాణా ప్రాంతంలో ఉండే ప్రజలు మిగతా రాజకీయ పార్టీలు కూడా మా మీద ఒత్తిడి తేవడం జరిగింది. మీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తే తెలంగాణా రాష్ట్రం త్వరగా వస్తుందనే మాట అనడం జరిగింది. నిబద్ధత గల కాంగ్రెస్ పార్టీ నాయకులుగా మా ముఖ్యమంత్రిగారు మా మాట మీద పూర్తి విశ్వాసాన్ని పెట్టి మా పార్టీ నాయకత్వం మీద పూర్తి విశ్వాసం పెట్టి ఈ రోజు ఎలాంటి ఒత్తిడులున్నా, ఆ ఒత్తిడులకు లోను కాకుండా ప్రభుత్వానికి, పార్టీకి బాసటగా నిలబడి నిజమైన సైనికులుగా నిలబడ్డ వారెవరంటే తెలంగాణా ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ శాసన సభ్యులని చెప్పడానికి గర్వపడుతున్నాను. ఇంత జరిగిన తరువాత కేంద్ర ప్రభుత్వం ఇంత మంచి నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఈరోజు అందరూ తప్పు పట్టే ప్రయత్నం చేస్తున్నారు.

2004లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టిఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకున్నది. దాని సారాంశం ఏమైనప్పటికీ 2004లో కాంగ్రెస్ పార్టీ వారితో పొత్తు పెట్టుకుంది. అప్పటికే 2004లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం స్పష్టంగా కనపడింది. అధికారంలోకి వస్తే ఖచ్చితంగా తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తుందనే భావన కలిగింది. సోనియా గాంధీగారు కరీంనగర్ వచ్చినప్పుడు మాట్లాడుతూ నాకు తెలుసు మీ మనసులో ఏమి ఉందో అనే మాట చెప్పారు. ఆ రోజే మేమందరం భావించాము. దానికనుగుణంగా 2004లో కాంగ్రెస్ పార్టీ భారత పార్లమెంట్‌లో భారత రాష్ట్రపతి చేసిన ప్రసంగంలో, కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో కూడా ఈ అంశాన్ని చేర్చడం జరిగింది. అదే విధంగా ప్రతి విషయంలో తెలంగాణా రాష్ట్రానికి సుముఖంగా ఉన్న పరిస్థితి ఏర్పడింది. 2008వ సంవత్సరంలో ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిగారు కూడా తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేశారు. సాంకేతిక కారణాల వల్ల ఆ రోజు వారు ఆ నిర్ణయం తీసుకోలేదు. కాబట్టి ఫిబ్రవరి నెలలో ఇదే శాసనసభలో రాజశేఖర్ రెడ్డిగారు నిండు సభలో ఒక ప్రకటన చేయడం జరిగింది. ప్రభుత్వానికి కొన్ని అభ్యంతరాలున్నాయని, ఆ అభ్యంతరాలను నివృత్తి చేయడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, దానికనుగుణంగా సీనియర్ మంత్రిగా ఉన్న రోశయ్యగారి అధ్యక్షతన ఒక కమిటీ వేయడం జరిగింది. కమిటీ అన్ని విషయాలను పరిశీలించిన తరువాత తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకుంటామనే మాట కూడా వారు చెప్పడం జరిగింది. నేను సభలో మాట్లాడినప్పుడు కూడా వారు చెప్పడం జరిగింది. మా ప్రభుత్వం తప్పకుండా

2009లో  అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని చెప్పడం జరిగింది. ప్రజలకు మేము ఇచ్చిన మాటను  అమలు చేయడం  కోసం 2009వ సంవత్సరం నుండి నేటి వరకు  ప్రజా స్వామ్య బద్ధంగా  తెలంగాణా సాధించే  ప్రయత్నం చేయడం జరిగింది.   ఆ ప్రయత్నం ఈ రోజు సఫలీకృతం అయ్యే సందర్భంలో  అందరూ అభినందించాలి తప్ప  దానికి ఎలాంటి అవాంతరాలు సృష్టించకూడదు.

ఉ.11. 00

తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు విషయంలో రాజకీయ పార్టీల మాటలను ప్రజలు విశ్వసిస్తారు. అధికార పక్షం, ప్రతి పక్ష పార్టీలలో సిపిఐ పార్టీ మినహా, ఎం.ఐ.ఎం  పార్టీ కూడా కొన్ని షరతులతో ఉన్నా, మనసు మార్చుకొని  తెలంగాణా బిల్లుకు సహకరించే ప్రయత్నం చేస్తున్నారు.  భారత రాష్ట్రపతి నుండి వచ్చిన బిల్లును, రాజ్యాంగం మీద  గౌరవం ఉండే వ్యక్తులు తప్పకుండా సహకరించాలి.  హైదరాబాద్ గురించి మాట్లాడారు.  హైదరాబాద్ నగరాన్ని మేము బాగా అభివృద్ధి చేసాము, ఇది మాది అని హైదరాబాద్ నగరంలో మాట్లాడుతున్నారు. నేను నిండు సభలో చెబుతున్నాను. హైదరాబాద్ నగరంపై, ఈ రాష్ట్రంలో, ఈ ప్రాంతంలో పుట్టిన ప్రతి ఒక్కరికి హక్కు ఉంది. భారతదేశంలో అనేక మంది తెలుగు వారు ఢిల్లీలో, కర్నాటకలో, మద్రాసులో ఉన్నారు. వాళ్లకు కూడా  గౌరవం, మర్యాద ఈ ప్రాంతంలో దొరుకుతుందని తెలియజేస్తున్నాను. హైదరాబాద్ ఖచ్చితంగా  తెలంగాణాలో అంతర్భాగంగా ఉన్నా మీరు జీవించే విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదు.  కేవలం హైదరాబాద్ గురించి ఎందుకు ఇబ్బంది పడుతున్నారో తెలియడం లేదు.   నా నియోజవర్గంలో ఆంధ్రా ప్రాంతం నుండి వచ్చిన ఎంతో మంది నివశిస్తున్నారు.  మాతో కలిసి సహజీవనం కొనసాగిస్తున్నారు. వారు మా కుటుంబసభ్యుల వలే ఉన్నారు. నా నియోజవర్గంలో గుంటూరు పల్లె వారు, బెజవాడ పల్లె వారు  ఉన్నారు.  మంగపేట, గోవిందరావు పేటలలో అనేక మంది ఆంధ్రా ప్రాంతం నుండి వలస వచ్చిన వారున్నారు.  వారు కూడా ప్రత్యేక తెలంగాణా కావాలని నిండు మనసుతో కోరుకుంటున్నప్పుడు   మీకు ఎందుకు అభ్యంతరం  అని అడుగుతున్నాను. హైదరాబాద్‌ను కొత్తగా అభివృద్ధి చేసామనే మాట అవాస్తవం. 1956 కంటే ముందు భారతదేశంలో అతి పెద్ద మహానగరాలలోనే 5వ స్థానంలో హైదరాబాద్ ఉంది. అదే స్థానం ఇప్పటికీ కొనసాగుతుంది. అధికారం కోసం ఈ రాష్ట్రాన్ని విభజిస్తున్నారని కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్నారు.  అది సత్యదూరం.  రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు అధికారంలోకి రావాలనే ఆలోచనతో  నిర్ణయం తీసుకోవచ్చు కాని, కాంగ్రెస్ పార్టీ  ప్రజల యొక్క ఆకాంక్ష మేరకు, ప్రజలు ఏమి కోరుకుంటున్నారో ఆలోచించి ముందుకు వెళ్తోందని తెలియజేస్తున్నాను.  ఎవరినో ప్రధాన మంత్రిని చేయడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారని మాట్లాడుతున్నారు.  ఈ దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం వారిది.  ఇందిరా గాంధీ గారు దేశం కోసం ప్రాణాలర్పించారు. దేశంలో మార్పు తీసుకురావడం కోసం రాజీవ్ గాంధీ గారు ప్రాణాలర్పించారు.  2004 లో ప్రజలందరూ మ్యాన్‌డేట్ ఇచ్చి  భారత ప్రధాన మంత్రి పదవికి అవకాశం ఇచ్చినా, సోనియా గాంధీ గారు పదవిని పక్కన పెట్టారు.   అటువంటి చరిత్ర కాంగ్రెస్ పార్టీది.   రాహుల్ గాంధీ గారి గురించి

మాట్లాడుతున్నారు. పదవి కోసం ఎవరు ఎదురుచూస్తున్నారో అందరికీ తెలుసు. ఒక్క సంవత్సరం అధికారం లేకపోతే ఏ రకంగా ఇబ్బంది పడుతున్నారో ప్రజలు చూస్తున్నారు. 2004లో కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకుంది కాబట్టి అధికారంలోకి వచ్చారు 2009లో మేము ఎందుకు పొత్తు పెట్టుకోకూడదని తెలుగుదేశం పార్టీ టిఆర్ఎస్ పార్టీతో పొత్తుపెట్టుకుంది. పులిని చూసి నక్క వాత పెట్టుకుంది అన్నట్టు ఉంది. కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి మహాకూటమిగా ఏర్పడి ప్రత్యేక తెలంగాణాకు అనుకూలమని ఈరోజు కొత్త ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం మీద వ్యామోహం లేదు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రిని చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని చెప్పడం సత్యదూరం. ప్రధాని కావాలంటే 2004లోనే అయ్యేవారు, 2009లోనే అయ్యేవారు, ఇప్పటికిప్పుడు అనుకున్నా కాగలరు. ప్రజల ఏమి కోరుకుంటున్నారో ప్రజల యొక్క ఆకాంక్ష మేరకు ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేసింది. భారతదేశంలో కొత్త చట్టాలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కింది. భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. మీరందరూ పెద్ద మనసుతో సహకరించాలని తెలియజేస్తున్నాను. కొంతమంది వ్యక్తులకు ఎందుకు ఇబ్బంది కలుగుతుందో నాకు అర్థం కావడం లేదు. హైదరాబాదు మీకెందుకు అని అంటున్నారు? మా గోవిందరావుపేట గురించి మీకు ఎందుకు ఇబ్బంది లేదు? నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలలో అనేక మంది వలసలు వచ్చి ఉన్నారు. వారి గురించి మీకు బాధ లేదు. ఎంతసేపూ హైదరాబాద్ పైనే! ఆ రోజు నిబంధనలకు వ్యతిరేకంగా వేల ఎకరాల భూమిని హైదరాబాద్ చుట్టూ కొనుగోలు చేశారు, ఆ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని బాధ కలిగి అడ్డుచెబుతున్నారు. వారికి అలాంటి ఇబ్బంది ఏమీ ఉండదు. అలాంటి విషయాలపై కూర్చొని మాట్లాడే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీలో నిర్ణయం తీసుకుంటే, ఇంత పెద్ద నిర్ణయాన్ని ఏ రకంగా తప్పుబడుతున్నారని అడుగుతున్నాను. ఆ రోజు ఉమ్మడి రాష్ట్రంలో, మద్రాసులో కొనసాగుతున్నప్పుడు, ఇదే కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ నిర్ణయానికి అనుగుణంగానే విశాలాంధ్ర ఏర్పడిందా లేదా? ఆరోజు ఈ రాష్ట్రం ఏర్పడడానికి కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది కాబట్టే ఆనాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు గారు ఆ రోజు విభజనకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి అనుగుణంగానే నిర్ణయం తీసుకున్న మాట వాస్తవమా కాదా? ఆరోజు నిర్ణయం తీసుకుంటే వాస్తవం, ఈరోజు నిర్ణయం తీసుకుంటే తప్పుపడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకునే ముందు ఒకటికి రెండు సార్లు అనేక సంప్రదింపులు జరిపిన తరువాతే నిర్ణయం తీసుకుంటుంది. కాబట్టి ఆ నిర్ణయాన్ని అందరూ గౌరవించి ఈ రాష్ట్ర విభజనకు సహకరించడం తప్ప ప్రత్యామ్నాయం లేదు. తెలంగాణా వస్తుందో లేదో అని ఈ రాష్ట్రంలో ఏదో మూల ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తెలంగాణా ఉద్యమకారులు దాదాగిరీ చేయాలని, ఇబ్బంది పెట్టాలని ప్రయత్నం చేయలేదు. వారికి వారుగా ఆత్మహత్యలు, ఆత్మబలిదానాలు చేసుకున్నారు. ఆర్టికల్ 3 గురించి అనువాదం చేస్తున్నారు. ఆర్టికల్ 3 లేకపోతే ఈ రాష్ట్రంలో ఇన్ని

కొత్త రాష్ట్రాలు వచ్చేవా అని అడుగుతున్నాను. తెలుగు భాష మాట్లాడే రాష్ట్రాలు రెండు ఎందుకని మాట్లాడుతున్నారు. హిందీ మాట్లాడే రాష్ట్రాలు భారతదేశంలో చాలా ఉన్నప్పుడు తెలుగుమాట్లాడే రాష్ట్రాలు రెండు ఉంటే తప్పు ఏమిటని డైరెక్ట్‌గా అడుగుతున్నాను. ఆ విధంగా ఉండడం వల్ల తెలుగు వారికి మేలు జరుగుతుంది, న్యాయం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

ఉ.11-10

అదే విధంగా మాట్లాడే సందర్భంలో కొంతమంది మమ్మల్ని అడుగుతున్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే కరెంట్ ఎలా, మీ బతుకు ఎలా అని అడుగుతున్నారు. మా మీద ఎలాంటి సానుభూతి మీ నుంచి అవసరం లేదు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తరవాత తప్పకుండా మా అవసరాలను పూర్తి చేసేందుకు మేం ప్రయత్నం చేస్తాం. తెలంగాణ ప్రాంతంలో సహజసంపద అయిన బొగ్గు నిల్వలు అపారంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో బొగ్గు నిల్వలు అపారంగా ఉన్నాయి కాబట్టి థర్మల్ కేంద్రాలు ఏర్పాటుచేసే ప్రయత్నం ఇప్పటివరకు ఎందుకు చేయలేదని అడుగుతున్నాను. తెలంగాణ ప్రాంతం నుంచి బొగ్గును రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత ఇక్కడున్న బొగ్గు నిల్వలతో థర్మల్ కేంద్రాలు స్థాపించి కరెంట్ ఉత్పత్తి చేసుకోగలం.

అదే విధంగా నీటి వనరుల గురించి కొందరు మాట్లాడుతున్నారు. వారు మాట్లాడడం చూస్తుంటే నీటిని కూడా దోచుకోవడానికి వారు ప్రయత్నిస్తున్నారనే అనుమానం మా ప్రాంత ప్రజలకు కలుగుతుంది. ఆ అనుమానాన్ని నివృత్తి చేయాల్సిన బాధ్యత కూడా ఉంది. 56 సంవత్సరాల సమైక్యాంధ్ర రాష్ట్రంలో కొత్తగా ప్రాజెక్టులు నిర్మించడంలో ఎందుకు విఫలమయ్యారని అడుగుతున్నాను. మీరు చిత్తశుద్ధిగా ప్రయత్నం చేయలేదనేది వాస్తవం. కేవలం 2009వ సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన తరవాత మాత్రమే ఆ విధమైన ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఏమైనప్పటికీ నీటి విషయంలో చూస్తే కృష్ణా నది పరివాహక ప్రాంతంలో నీటిని ఎగువ రాష్ట్రాలు ఎక్కడికక్కడ నిల్వ చేసి దిగువకు రాకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే కృష్ణా నీటిని రాష్ట్రంలోని దిగువ ప్రాంతాలకు తీసుకువెళ్లలేమనే భయం, భావన కలిగి ఆ విధంగా మాట్లాడినట్లుగా అర్థమవుతున్నది. నదీ జలాల వివాదాలను పరిష్కరించడానికి మనకు అన్ని అవకాశాలున్నాయి. నీటి విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేవు కాబట్టి భయం చెందాల్సిన అవసరం లేదు.

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో నీటి లభ్యత ఎక్కువగా ఉంది. ఆ నీటిని సద్వినియోగం చేసే ప్రయత్నం గత ప్రభుత్వాలు చేయలేదు. తెలంగాణ ప్రాంతంలో ప్రాణహిత-చేవెళ్ల చేపట్టి తాగునీటి, సాగునీటి అవసరాల తీర్చాలనే ఉద్దేశంతో శంకుస్థాపన చేశారు. తెలంగాణ ప్రజల కోరిక అయిన ఆ ప్రాజెక్టు కార్యరూపం దాల్చాలి. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని కోరుతున్నాను. పోలవరం ప్రాజెక్టు నిర్మించడానికి ఈ ప్రాంత ప్రజలు ఎలాంటి

అభ్యంతరాలు వ్యక్తం చేయడంలేదు. మా అవసరాలు పూర్తి చేయాల్సిన అవసరముందని మాత్రమే కోరుతున్నారు. వరంగల్ జిల్లాలోని దేవాదుల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. దాని మీద రిజర్వాయర్ కట్టాలని మా జిల్లా ప్రజలు ఎప్పటినుంచో కోరుతున్నా ఇప్పటివరకు దానిని నెరవేర్చే ప్రయత్నం జరగలేదు.

ఏది ఏమైనప్పటికీ 56 సంవత్సరాల సమైక్యాంధ్ర రాష్ట్రంలో అన్ని రంగాలలో తెలంగాణ ప్రాంతం వివక్షకు గురైనది. దానికి ప్రధాన కారణం తెలంగాణేతరులు ఎక్కువ కాలం రాష్ట్రాన్ని పరిపాలించారు. వారి పాలన కాలంలో మా ప్రాంతం పట్ల సమదృష్టితో పాలన చేయలేదు కాబట్టే ఈ రోజు విభజన అనివార్యమైనదని గుర్తు చేస్తున్నాను. విభజన వల్ల రెండు ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ప్రజలు కోరుకుంటున్నందునే విభజన అనివార్యమైందని కచ్చితంగా తెలియజేస్తున్నాను. 56 సంవత్సరాల కాలంలో జరిగిన విషయాలు చూస్తే అనేక రంగాలలో ఈరోజు........

(అంతరాయం)

ఈ 56 సంవత్సరాల కాలంలో మమ్మల్ని ఎపుడూ కూడా కేవలం మనుషులుగా, మీ మోచేతి నీళ్లు తాగడానికి పెట్టుకున్నారు తప్ప మా ప్రాంతానికి ఎటువంటి ప్రయోజనాలు కల్పించలేదు. మా ప్రాంతంలో సమర్థవంతమైన నాయకులున్నారు. భారతదేశానికి సక్సెస్‌ఫుల్ ప్రధానమంత్రిగా శ్రీ పి.వి.నరసింహారావు పని చేశారు తప్ప ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా మీరు వారిని చూడలేదు. అది మీ నైజం. మర్రి చెన్నారెడ్డి గారి లాంటి సీనియర్ నాయకుడు ఈ రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేస్తే, మొదటిసారి ఒకటిన్నర సంవత్సరం, రెండో సారి ఒక సంవత్సరానికే పదవి నుంచి దించారు. మీది అంత పెద్ద మనసని చెప్పడానికిని ఇది నిదర్శనం అవుతుంది. ఈ సందర్భంలో వాస్తవాలు మాట్లాడకపోతే ఇంకెపుడు మాట్లాడతాం.

రాష్ట్ర శాసనసభకు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు వచ్చిన తరవాత కుట్రలు, కుతంత్రాలు చేసి బిల్లును అడ్డుకోవాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ విషయాలను చేధించాల్సిన బాధ్యత మా మీద ఉంది కాబట్టి ఇవన్నీ మాట్లాడుతున్నాను. నిజంగా మీకు ప్రజాస్వామ్యం మీద విలువ ఉంటే, ప్రజాస్వామ్య పార్టీలు ఎన్నికలకోసం మేనిఫెస్టోలు విడుదల చేయడం నిజమైతే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఎలాంటి చర్చ లేకుండా ఏకగ్రీవంగా ఈ బిల్లు పంపినందుకు భారత ప్రభుత్వాన్ని అభినందిస్తూ ఇక్కడ నుంచి తీర్మానం చేసి పంపించాలి తప్ప దీని మీద ఎలాంటి చర్చ పెట్టాల్సిన అవసరంలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు ఇప్పటివరకు 1100 మంది యువకులు ఆత్మబలిదానం చేశారు. ఈ బిల్లును వారికే అంకితం చేయాలి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకొరకు సాహసోపేతమైన నిర్ణయం మా ప్రియతమ నాయకురాలు శ్రీమతి సోనియా గాంధీ గారు తీసుకొంటే మీరు దుస్సాహసంతో నిలువరించే ప్రయత్నం చేస్తున్నారు. సభ్య సమాజం తలదించుకొనే విధంగా బతికున్న వ్యక్తికి సమాధులు కడుతున్నారు. బతికున్నవారికి సమాధులు కట్టే సంప్రదాయం ఈ దేశంలో ఉందా? తెలంగాణ ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకొని సోనియా

గాంధీ గారు నాయకురాలిగా ఆ ప్రయత్నం చేశారు. ఏ సందర్భంలో అయినా మీకు ఎన్నికలు, ఓట్లు, సీట్లు, అధికారం కావాలి. కానీ మా నాయకురాలు రాజనీతిజ్ఞురాలిగా నిజాయతీ, నిబద్ధతతో గొప్ప నిర్ణయం తీసుకున్నారు. మీరు మీ ప్రాంతంలో సోనియాగాంధీ గారికి సమాధులు కడితే, తెలంగాణ ప్రజలు మంచి చేసినవారిని అభినందిస్తారని తెలియజేస్తున్నాను. కాబట్టి శాసనసభ్యుడిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ముసాయిదా బిల్లుపై జరిగే చర్చలో పాల్గొనడం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే శుభసందర్భంలో ఈ సభలో ఉన్నందుకు నేను గర్వపడుతున్నాను. మా కోరిక నెరవేరి కొత్త రాష్ట్రం ఏర్పడబోతున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు భారత ప్రధానమంత్రి డా.మన్మోహన్ సింగ్ గారిని, భారత రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ గారిని, మా నాయకురాలు సోనియాగాంధీ గారిని అభినందిస్తున్నాను. ఈ బిల్లుపై ఎలాంటి చర్చ లేకుండా ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపించి తెలంగాణలోని 4.5కోట్ల ప్రజల ఆకాంక్ష అర్థమయ్యేలా వివరించాలి. బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించేలా సభ్యులందరూ సహకరించాలని కోరుతున్నాను. ఈ బిల్లుపై మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. జై తెలంగాణ.

శ్రీ ఈటెల రాజేందర్ (హుజూరాబాద్): అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లు 2013ను భారత రాష్ట్రపతి గారు రాష్ట్రానికి పంపిస్తే, శాసనసభలో ప్రవేశపెట్టి సభ్యుల అభిప్రాయాలు కోరుతున్నందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల పక్షాన వారి గొంతుకై ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన పార్టీగా, జిమ్మేదారీ కగిలిన, భాధ్యత కలిగిన వ్యక్తిగా ఈ బిల్లును సంపూర్ణంగా, సమగ్రంగా, సంబరంగా తెలంగాణ రాష్ట్ర సమితి శాసనసభ పక్షం నుంచి ఆమోదిస్తున్నాం. అరవై సంవత్సరాల నిరీక్షణ ఇది. ఈ ఘడియలకోసం తెలంగాణ జాతి ఉత్కంఠగా ఎదురుచూస్తున్నది. ఆ కోరిక నెరవేరినందుకు, కల సాకారమైనందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాను. నిన్న గౌరవ మంత్రిగారు సభలో ఒక మాట చెప్పారు. మనం ఇరు ప్రాంతాల ప్రజల మనస్సును దోచుకొనే ప్రయత్నం చేయాలి తప్ప విరగకొట్టకూడదని మాట్లాడారు. నేను దానికి కట్టుబడి ఉంటాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరంవాత 56 సంవత్సరాలుగా మనం అన్నదమ్ములుగా కలిసి ఉన్నాం. రేపు రెండు రాష్ట్రాలుగా విడిపోయినా అన్నదమ్ములలాగే కలిసి ఉండే వాతావరణానికి సహకరించుకుందాం, పునాదులు వేద్దామని తెలంగాణ రాష్ట్ర సమితి పక్షాన మనవి చేస్తున్నాను. 294 మంది శాసనసభ్యులు ఈ సభలో ఉన్నా రాష్ట్ర ప్రజలకు అర్థం చేయించాల్సిన బాధ్యత, దీని ద్వారా వచ్చే పరిణామాలను మనం గుర్తు చేయాల్సిన అవసరముంది. ఇప్పటికే తెలంగాణ ప్రాంత ప్రజలు నూటికి నూరుశాతం తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష కోసం మగ్గుతున్న విషయం మీకు తెలుసు.

ఉ.11.20

అంతేకాదూ, ఆంధ్ర ప్రాంతంలో కూడా ఆకలైన వాళ్లు, దుఃఖం ఉన్న వాళ్లు, అభివృద్ధికి నోచుకోని అనేక వర్గాల ప్రజానీకం కూడా సమైక్య రాష్ట్రం ఉన్నా, రాష్ట్రం విడిపోయినా పెద్ద ఒరిగేదేమీ

లేదనే పద్ధతుల్లో ఇవేళ అనేక మంది తెలంగాణా ఉద్యమానికి మద్దతిస్తున్న విషయం మీకు తెలుసు. కొన్ని వర్గాల ప్రజానీకం ఇప్పటికీ అర్థం కాక అటూ, ఇటూ కాకుండా వుండవచ్చు గాక. ఇంకొక రకం అర్థమై కూడా అర్థం కానట్లు నటించి ఇవాళ గుడ్డి ద్వేషంతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. గుడ్డి ద్వేషంతో అడ్డుకునే వాళ్లను పక్కకు పెడితే కనీసం అర్థం కాకుండా ఉన్న ప్రజానీకానికి ఈ రాజకీయ పార్టీలు సృష్టించిన గందరగోళాన్ని దూరం చేసి ఒక శాస్త్రీయమైన పద్ధతిలో, ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్రం విడిపోవడం వలన ఖచ్చితంగా అభివృద్ధి చెందుతుందనే విషయాన్ని అర్థం చేయించే ప్రయత్నంలో మాత్రమే నేను మాట్లాడటానికి సాహసిస్తున్నానని మీద్వారా గుర్తు చేస్తున్నాను.

అధ్యక్షా, నిన్న మా మిత్రులు వట్టి వసంత కుమార్ గారు మాట్లాడారు. గురజాడ అప్పారావు గారు "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని గొప్ప మాట చెప్పారు. ఇవాళ మీ ప్రేమ ఈ భూముల మీద తప్ప 57 సంవత్సరాల సమైక్య రాష్ట్రంలో ఏనాడూ మా మనసులను గెలుచుకునే ప్రయత్నం చేయలేదు. ఏనాడూ మా అభివృద్ధిని కాంక్షించ లేదు. ఏనాడూ మా కన్నీళ్లను, మా దుఃఖాన్ని, మా కష్టాన్ని దూరం చేసే ప్రయత్నం చేయలేదు. అందుకే వట్టి వసంత కుమార్ గారిని దేశమంటే మనుషులోయ్ వారి కోసం గట్టిమేలు తలపెట్టమని కోరుతున్నాను. రెండవ మాట మా కేశవ్ గారు సభలో ఉన్నారో లేరో నాకు తెలియదు గానీ మాకు చట్టాల గురించి తక్కువ తెలుసు. కెసిఆర్ గారు మాకు నేర్పింది ఉద్యమాలు చేయడం, ఈ జాతి విముక్తి కోసం, తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం మాకు పాఠాలు నేర్పారు తప్ప చట్టాల గురించి నేర్చుకునే అవకాశం మాకు కలగలేదు. ఈ పది సంవత్సరాల కాలంలో ఏనాడూ ఆ పుస్తకాల జోలికి పోలేదు. కాబట్టి మేము ఎవర్నో వ్యతిరేకించడం, ఎవరి మనస్సులనో నొప్పించే ఉద్దేశం కాదు. మేము కేవలం ఈ సభలో బాధ్యత కలిగిన రాజకీయ పార్టీలుగా ఈ ప్రజల యొక్క అభిప్రాయాలకు ప్రతిబింబంగా నిలిచే పార్టీలుగా మీరు ఏయే సందర్భాల్లో ఏమేమి మాట్లాడారు, ఏమేమి నిర్ణయాలు తీసుకున్నారు, ఏమేమి రాసుకున్నారో వాటిని మాత్రమే గుర్తు చేసే ప్రయత్నం చేస్తున్నాను తప్ప మిమ్మల్ని వ్యక్తిగతంగా నిందించే పనిలో మేము లేము.

అధ్యక్షా, సభ్యులు పల్లె రఘునాథ రెడ్డి గారు నిన్న మాట్లాడుతూ "సోనియా గాంధీ గారు రాహుల్ గాంధీ గారిని ప్రధాన మంత్రిని చేయడం కోసం రాష్ట్ర విభజన చేస్తున్నారు" అని అన్నారు. కావచ్చు. రాజకీయ అవసరాలు – నేను వాటి జోలికి పోను గానీ, ఈ ఉద్యమం అంత చిన్నది కాదు, అంత సంకుచితమైనది కాదు. ఈ ఉద్యమం కెసిఆర్ గారు ప్రారంభించింది కాదు. ఈ ఉద్యమం ఈ రాష్ట్రం ఏర్పడిన నాడు అంటే ఈ సమైక్య రాష్ట్రం ఏర్పడిన నాడు 1952వ సంవత్సరంలోనే ఇడ్లీ, సాంబార్ గోబ్యాక్ ఉద్యమం జరిగిన చరిత్ర చార్మినార్ సాక్షిగా రోడ్ల మీద ఉంది అధ్యక్షా. ఆనాడు మా విద్యార్థి లోకం ఇడ్లీ, సాంబార్ గోబ్యాక్ అని ఉద్యమం చేస్తే, ఆ ఉద్యమంలో తుపాకీ తూటాలు పేలితే ఏడు మంది విద్యార్థులు ఆ రక్తపు మడుగులో గిలగిల కొట్టుకుని జై తెలంగాణా అని నినాదాలు 1952వ సంవత్సరంలోనే చేశారు. ఈ రాష్ట్రం 1956వ సంవత్సరంలో ఏర్పడితే సమైక్య రాష్ట్రం ఏర్పడక ముందే మా హక్కులు కాపాడుకోవాలని మొట్ట మొదటిసారిగా రక్తం చిందించిందనే చరిత్ర

ఈ జాతికి ఉందనే విషయాన్ని మనం మరచి పోవద్దు. అందుకే ఇవాళ అంత సంకుచితమైన, అంత రాజకీయ కోణంలో మా ఉద్యమాన్ని చూసే ప్రయత్నం చేసారు కాబట్టే చేయి కాల్చుకున్నారనే విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి.

అధ్యక్షా, జయశంకర్ గారు మా తెలంగాణా వైతాళికులు. మా తెలంగాణా సిద్ధాంత కర్త. వారు ఈరోజు జీవించి వుంటే చాలా సంతోషపడే వారు. ఆయన విద్యార్థి దశలో ఉన్ననాడు ఇడ్లీ సాంబార్ గోబ్యాక్ ఉద్యమానికి వరంగల్ నుంచి బస్సు వేసుకుని వస్తుంటే ఆ బస్సు ఖరాబై ఆయన ఆ ఉద్యమంలో పాల్గొన లేకపోయారు. ఆయన అన్న మాట ఎప్పుడూ గుర్తుకు వస్తుంది. "నేను ఆ ఉద్యమంలో పాల్గొని ఉంటే నేను కూడా ఆ తుపాకీ తూటాలకు నేలకొరిగే వాణ్ణి. నేను కూడా అమరత్వం పొంది ఉంటే ఇన్ని సంవత్సరాల దుఃఖాన్ని చూసే అవకాశం లేకుండేదేమో" అని ఆయన బాధపడిన సందర్భం గుర్తు వస్తోంది. ఈ ఉద్యమం మా జయశంకర్ గారు, మా తాత నడిపారు. 1969వ సంవత్సరంలో మా నాన్న నడిపారు. ఇవాళ్టి ఈ ఉద్యమాన్ని మేము, మా కొడుకులు నడుపుతున్నారు. ఈ ఉద్యమం మూడు తరాల ఉద్యమం. ఈ ఉద్యమం బతుకు ఉద్యమం, ఈ ఉద్యమం విముక్తి ఉద్యమం అనే విషయాన్ని మరచి పోవద్దు.

అధ్యక్షా, ఈ బిల్లును తిరస్కరించాలని మాట్లాడుతున్నారు. మాకు బాధ లేదు. కానీ ఈ బిల్లును తగలబెట్టారు. ఈ బిల్లును చించేసారు. నేనొక్కటే అడుగుతున్నాను. ఇవాళ క్రైస్తవులకు బైబిల్ ఎంత పవిత్రమైనదో, హిందువులకు భగవద్గీత ఎంత పవిత్రమైనదో, ముస్లిమ్‌లకు ఖురాన్ ఎంత పవిత్రమైనదో ఈ బిల్లు తెలంగాణా ప్రజానీకానికి అంత పవిత్రమైనది. అలాంటి బిల్లును మీరు చింపడం ద్వారా మీరు కుసంస్కారానికి ఒడిగట్టారు తప్ప, మీ గుడ్డి ద్వేషాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేసారు తప్ప 57 సంవత్సరాల తరువాత మానవ సంబంధాలను ఆవిష్కరించేటు వంటి ఒక broad perspective viewని ఇప్పటికి కూడా అర్థం చేసుకోకుండా ఇంత సంకుచితంగా వ్యవహరిస్తున్న మీ పార్టీలను తెలంగాణా ప్రజలు ఛీ కొడుతున్నారు. ఇదేనా మీ సంస్కారం, ఇదేనా మీ సభ్యత అని అడుగుతున్నాను. అక్కడికే పరిమితంగా కాలేదు. గతంలో ఇదే ముఖ్యమంత్రి గారు కూడా స్పీకర్‌గా పని చేస్తున్నప్పుడు మేము సంతోషపడి ఒక మాట చెప్పాము. "అయ్యా స్పీకర్ గారూ మీరు ఆంధ్రా ప్రాంత బిడ్డైనా తెలంగాణా ప్రాంతంలో చదువుకున్నారు. కనీసం ఆ రుణం తీర్చుకునే ప్రయత్నం చేయండి" అని చెప్పాము. కానీ వారు ఇవాళ బయట ఏమి మాట్లాడుతున్నారు, ఇక్కడేమి మాట్లాడుతున్నారు. చిలుక పలుకులు మాట్లాడటం కాదు అధ్యక్షా, సభలో ఏమి హామీ ఇచ్చారో దానికి కట్టుబడే ఉండే సాంప్రదాయాలను నిలబెట్టాలి. సంకుచితంగా ఈ వ్యవస్థను నడపుతున్న ఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ముఖ్యమంత్రికి అట్లాంటి వివాద శైలి మంచిది కాదని తెలియచేస్తున్నాను.

(ఈ సందర్భంలో అధికార పార్టీకి చెందిన కొంత మంది సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాస్(మైకు లేకుండా): అధ్యక్షా,

MR. SPEAKER: I will not permit any interruptions. Let the Member continue I will give another opportunity. No interruptions when any Member is speaking.

(శ్రీ ద్రోణంరాజు శ్రీనివాస్ చే అంతరాయం)

శ్రీ ఈటెల రాజేందర్‌: అయ్యా శ్రీనివాస్ గారూ మీరు తరువాత రెండు గంటలు మాట్లాడండి.

MR.SPEAKER: Rajender garu, address the Chair. No interruptions please.

శ్రీ ఈటెల రాజేందర్‌: అధ్యక్షా, స్పీకర్ గారికి ఈ సభా గౌరవాన్ని, సభా సాంప్రదాయాలను, మర్యాదలను రాజ్యాంగ హక్కులను, సభ్యుల హక్కులను కాపాడవలసిన బాధ్యత ఉంది. ఒకసారి స్పీకర్ ఛైర్‌లో కూర్చున్న తరువాత పార్టీలకు గానీ, ప్రాంతాలకు గానీ సంబంధం లేని వ్యక్తి స్పీకర్. అలాంటి స్పీకర్ గారు ఈ దేశ రాజ్యాంగ పరిరక్షకులు, ప్రెసిడెంట్ గారు పంపించిన ఆ బిల్లును ఈ సభలో ప్రవేశ పెట్టాలని – ఈ సభలో అంత కంటే ప్రాముఖ్యతతో కూడుకున్న బిజినెస్ ఉండకూడదు కాబట్టి మనం ఆ రోజు బిజినెస్ అడ్వయిజరీ కమిటీలో ఒకవేళ ఆ బిల్లు గనుక వస్తే అన్ని రకాల బిజినెస్‌ను పక్కకు పెట్టి ఆ బిల్లును టేకప్ చేయాలని నిర్ణయించాం. దాని ప్రకారంగా మీరు ఆ బిల్లును సభలో ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తే అధ్యక్షా, మీ దిష్టిబొమ్మను కూడా తగులబెట్టే కుసంస్కారం ఉంటే దీనిని ఎవరు కాపాడతారు అధ్యక్షా? నేనడుగుతున్నాను, శాసన సభ్యులం కావచ్చు, స్పీకర్ గారి ఛైర్ కావచ్చు, ముఖ్యమంత్రి పదవి కావచ్చు, ఇవన్నీ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులనే విషయాన్ని మనం మరచి పోవద్దు. మనం వ్యక్తులమే కావచ్చు గాక కానీ మనకు ఒక బాధ్యత ఉందనే విషయాన్ని మరచి పోవద్దు. బయటి వాళ్లలాగా బిహేవ్ చేసే సంకుచిత మనస్తత్వానికి ఒడిగట్ట వద్దని మాత్రమే నేను గుర్తు చేస్తున్నాను.

అధ్యక్షా, మేము రాష్ట్రం కోరితే విచ్ఛిన్నవాదం, మేము రాష్ట్రం కోరితే ఇవాళ సంఘ విద్రోహం. మేము రాష్ట్రం కోరుకుంటే దేశద్రోహం. అధ్యక్షా, నేను మా మిత్రులను అడుగుతున్నాను, మీరు కూడా ఒకనాడు మాలాగే మద్రాసు రాష్ట్రంలో ఉన్నవాళ్లు కాదా? ఆనాడు మద్రాసు రాష్ట్రంలో అయ్యదేవర కాళేశ్వరరావు గారు అన్న చాలా మాటల్ని కోట్ చేయాలనుకున్నాను. కానీ ఒక్క విషయం మాత్రం చెబుతాను. 45 శాతం జనాభా కలిగివున్న వాళ్లం, 50 శాతం భూభాగం కలిగివున్న వాళ్లం. కానీ ఇవాళ బాపట్లలో చూసినా, విశాఖపట్టణంలో చూసినా, విజయవాడలో చూసినా అందరూ జడ్జిలు వాళ్లే వున్నారు. మొత్తం ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ అన్నీ వాళ్లవే ఉన్నాయి. సివిల్ సర్వెంట్స్ కూడా వాళ్లే ఉన్నారు. తమిళ రాష్ట్రంలో ఆంధ్ర ప్రజానీకం రెండవ తరగతి పౌరులుగా జీవించే దౌర్భాగ్య పరిస్థితులున్నాయి. ఆ దౌర్భాగ్య పరిస్థితులు పోవాలంటే తమిళనాడు నుంచి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు మాత్రమే దానికి పరిష్కారమని నేను (ఈటెల రాజేందర్) చెప్పడం లేదు. ఈ రాష్ట్రానికి ప్రథమ స్పీకర్‌గా పనిచేసిన అయ్యదేవర కాళేశ్వరరావు గారు చెప్పిన మాటలు

అవి. ఇలాంటి విషయాలు అనేకమున్నాయి. దాని కోసమే 1912వ సంవత్సరంలో మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోవాలని ఉద్యమం మొదలు పెట్టి 1953 అక్టోబర్ 1వ తేదీ నాడు ఏ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందో ఆ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడేంత వరకూ ఆ ప్రాంతంలో ఉద్యమాలు చేసిన చరిత్రను మనం మరచి పోకూడదు. మాకు స్ఫూర్తి, మాకు ఆదర్శప్రాయుడు పొట్టి శ్రీరాములు గారు అని సగర్వంగా ప్రకటించదలచుకున్నాను.

ఉ.11.30

పొట్టి శ్రీరాములు గారు చిన్న రాష్ట్రాల ఏర్పాటు కోసం పోరాడారు. ఆనాడు మద్రాసు ప్రెసిడెన్సీ నుండి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం వారు పోరాడారు. 1953 నవంబరు, 13 వ తేదీ నాడు వారు ఆమరణ నిరాహారదీక్ష మొదలుపెట్టారు. 57 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. నెహ్రూ గారు దానికి స్పందించి, రాష్ట్ర ఏర్పాటు కోసం మేం సిద్ధంగా ఉన్నామని పార్లమెంటులో ప్రకటించిన తరువాత కూడా, ఇవాళ హైదరాబాదు గురించి ఎలాగైతే పట్టుపడుతున్నారో, ఆ రోజున కూడా అదే పద్ధతుల్లో మద్రాసులో సగం మాకు కావాలని పట్టుబట్టిన చరిత్రను మర్చిపోవద్దు. ఆ రోజున మద్రాసు రాజధాని కావాలని చెప్పి, నిరాహారదీక్షలో కొనసాగి, 57 వ రోజు అమరత్వం పొందిన గొప్ప మహనీయుడు, గొప్ప త్యాగశీలి, ఆ రాష్ట్ర ఏర్పాటుకు తన తనువును బలి చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు. అందుకే వారు మాకు ఆదర్శం. వారి చిన్న రాష్ట్రాల కాన్సెప్టే మా ఉద్యమానికి కూడా ప్రేరణగా ఉందే తప్ప, మీరు చెబుతున్నట్లుగా ఆంధ్రప్రదేశ్ అవతరణకు, పొట్టి శ్రీరాములు గారికి సంబంధం లేదనే విషయాన్ని నేను చెప్పదల్చుకున్నాను.

(ఈ సందర్భంలో గౌరవ ఉప సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాస రావు (ప్రభుత్వ సచేతక్)ః అధ్యక్షా, చరిత్రను తప్పుగా చెబుతున్నప్పుడు, సరిదిద్దాల్సిన అవసరముంది. (మైకు లేకుండా)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః ప్లీజ్ సిట్ డౌన్..

శ్రీ ఇ. రాజేందర్ః రెండు గంటలు చెప్పు (శ్రీ ద్రోణంరాజు శ్రీనివాస రావుని ఉద్దేశించి). కూర్చోండి.. కూర్చోండి.

(శ్రీ ద్రోణంరాజు శ్రీనివాస రావుచే అంతరాయం)

అధ్యక్షా, మేం మాట్లాడిన తరువాత వారికి ఒక గంట పాటు టైమివ్వండి. ఇవాళ తెలంగాణా రాష్ట్ర సమితి పక్షాన వెయ్యి పువ్వులు పూయాలి.....

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాస రావుః(మైకులేకుండా) అధ్యక్షా, ఇప్పుడే వీళ్లు ఇంత దౌర్జన్యం చేస్తే, రేపు మమల్నిక్కడ ఉండనిస్తారా? చరిత్రను తప్పుగా చెబుతున్నారు. రేప్పొద్దున మమ్మల్ని ఉండనిస్తారా వాళ్లు? హైదరాబాదులో ప్రజలకు రక్షణ కల్పిస్తారా? వీళ్లు కల్పించలేరు. చరిత్రను తప్పు చెబుతున్నప్పుడు, మేం దాన్ని వివరిస్తామన్నప్పుడు మాకు అవకాశం ఇవ్వాలి. చెప్పవలసిన బాధ్యత మాపై ఉంది.

శ్రీ ఇ. రాజేందర్ః అధ్యక్షా, పొట్టి శ్రీరాములు గారు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరుడయ్యాడని చెబుతున్నాను. కాదూ అనంటే – మరి మీరు దేనికంటే దానికి సిద్ధం. ఫజల్ అలీ కమిటీ అనేది రాష్ట్రాల పునర్విభజన కొరకు ఈ దేశంలో వేయబడిన మొట్టమొదటి కమిటీ. దాంట్లో ముగ్గురు సభ్యులున్నారు. కుంజుర్ గారు, ఫణిక్కర్ గారు ఉన్నారు. ఫణిక్కర్ గారు ఏమన్నారంటే – ఆంధ్రా ప్రాంత ప్రజలు మాత్రమే కోరుకున్నట్లుగా ఐక్యతకి భాష మాత్రమే ప్రాతిపదిక కాకూడదు అని అన్నారు. అది ఒక్కటి మాత్రమే క్రైటీరియా కాకూడదని వారు చెప్పారు.

అదే ఫజల్ అలీ గారు తెలంగాణా ప్రాంత ప్రజానీకం ఆంధ్ర ప్రాంతంతో విలీనానికి, విశాలాంధ్రకు వ్యతిరేకంగా ఉన్న మాట వాస్తవమని ఆ రోజు రిపోర్టు ఇచ్చారు. కానీ, ఆ రోజున ఒకవేళ విలీనం జరిగితే ఆంధ్రా ప్రాంత ప్రజలతో తెలంగాణా ప్రాంత ప్రజానీకం తట్టుకునే ఆస్కారం లేదు. ఆ సత్తా సంతరించుకుని తెలంగాణా జాతి.. ఇక్కడ చదువుకున్న వాళ్లు తక్కువ సంఖ్యలో ఉండొచ్చు గాక. కానీ, ఇక్కడ ఉద్యోగాలు కొల్లగొట్టడానికి ఆస్కారం ఉంది. ఇక్కడ నిధులను కొల్లగొట్టుకుపోయే ఆస్కారమున్నది. ఇక్కడ అనేక రకాలుగా ఇబ్బందులుపడే ఆస్కారమున్నదనే విషయాన్ని ఆ రోజు ఫజల్ అలీ గారు చెప్పి, ఆ రోజు నెహ్రూ గారికి రిపోర్టు ఇవ్వడం జరిగింది. ఆ రోజున సర్దార్ వల్లభాయ్ పటేల్, నెహ్రూ గారు కమిటీలో ఉండి ఫజల్ అలీ కమిటీ ఇచ్చిన రిపోర్టును ఆ రోజు పక్కకు పెడితే, అనేక రకాలుగా ప్రయత్నించి ఆ రోజున కూడా ఈ తెలంగాణా ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంలో కలుపుకోవాలని కుటిల యత్నాలు ఏవైతే చేశారో, వాటి జోలికి నేను పోను.

ఆ రోజు నెహ్రూ గారి మాటల్లో చెప్పాలంటే – ఆవేళ విశాలాంధ్ర రాష్ట్ర ఏర్పాటు వెనుక, ఇవాళ సమైక్యాంధ్ర రాష్ట్రం కోరుకోవడం వెనుక ఒక దురుద్దేశం దాగి ఉంది. సామ్రాజ్యవాద విస్తరణ కాంక్ష దాగి ఉంది. ఇవాళ ఒక అమాయకపు తెలంగాణాతో, ఒక గడసరి ఆంధ్రా ప్రాంతం మిలాఖత్ అయితే, దాన్ని గనుక కలిపే ప్రయత్నం చేస్తే, రేపు తీవ్రమైన పరిణామాలుండే ఆస్కారముందనే మాట నేను చెప్పలేదు. ఈ దేశ తొలి ప్రధానమంత్రి నెహ్రూ గారే చెప్పారు. కానీ, అవన్నీ కూడా తుంగలో తొక్కి చివరికి విశాలాంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఆ విశాలాంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత, మద్దతిచ్చిన కమ్యూనిస్టులు గానీ, గౌతు లచ్చన్న లాంటి పెద్దలు, రావి నారాయణ రెడ్డి లాంటి పెద్దలు, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి పెద్దలు 1969 ఉద్యమం సందర్భంగా చేసిన కామెంట్స్ చూస్తే, ఇవాళ .....

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావుః(మైకు లేదు) అధ్యక్షా, నెహ్రూ గారు ఏం చెప్పారో చెబుతాను.

శ్రీ ఇ. రాజేందర్ ః అధ్యక్షా, ఆ రోజు పుచ్చల పల్లి సుందరయ్య గారి లాంటి మహనీయులు, రావినారాయణ రెడ్డి వంటి పెద్దలు, గౌతు లచ్చన్న లాంటి వాళ్లు చెప్పిన మాటలేమిటంటే – తియ్యటి మాటలు తెలంగాణా ప్రాంతానికి కడుపు నింపవు. మనం ఏ హామీలైతే ఇచ్చి రాష్ట్రాన్ని కలుపుకున్నామో వాటి అమలు సక్రమంగా లేదని చెప్పి మొట్టమొదటిసారిగా వ్యతిరేకించిన వాళ్లు ఆనాడు విశాలాంధ్రను కోరినవాళ్లే. అంతేకాదు అధ్యక్షా. ఆ రోజు merger itself కండీషన్లతో కూడుకున్నది. ఇవాళ తెలంగాణా ప్రాంత ప్రజలు కోరుతున్నది కొత్త రాష్ట్రం కాదనే విషయం అర్థం చేసుకోండి. తెలంగాణా ప్రాంత ప్రజలు కోరుకున్నది ఆనాడు 1956లో ఏ తెలంగాణా ప్రాంతమైతే ఆంధ్రా ప్రాంతంలో అంటే విశాలాంధ్రలో మెర్జ్ అయ్యిందో, దాన్ని మాత్రమే తిరిగి కలపాలని కోరుతున్న విషయాన్ని మర్చిపోవద్దని కోరుతున్నాను. We are seeking de-merging. అధ్యక్షా, ఆ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా పెద్ద మనుషుల ఒప్పందం జరిగింది.

శ్రీ డి. మాణిక్య వరప్రసాద రావు (గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి)ః అధ్యక్షా, ఈటెల రాజేందర్ గారు చాలా బాగా మాట్లాడుతున్నారు. చరిత్రలోకి వెళ్లి చాలా సందర్భాల్లో పెద్ద పెద్ద మహానుభావుల పేర్లను కోట్ చేస్తున్నారు. చాలా సంతోషం. వారు చిన్నప్పటి నుండి అనేక ఉద్యమాల్లో ఉండటం వల్ల ఆ ఉద్యమాల బ్యాక్‌గ్రౌండ్ నుండి చాలా విషయాలు చెబుతున్నారు. సంతోషం. టిఆర్ఎస్ పార్టీ స్టాండ్ ఏమిటంటే – 1956 కు ముందు ఏదైతే తెలంగాణా ఉందో అదే కావాలంటున్నారు. కానీ, భద్రాచలం అప్పుడు లేదు. మరి దాని మీద మీ స్టాండ్ ఏమిటో అది కూడా చెబితే బాగుంటుంది. సావధానంగా 1956 కు ముందున్న తెలంగాణాను తీసుకున్నట్లయితే, భద్రాచలం ఆంధ్రాకు ఇవ్వడానికి మీకు అంగీకారమేనా? భద్రాచలం అప్పుడు ఎరస్ట్‌వైల్ ఆంధ్రప్రదేశ్‌లో వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్‌లో ఉంది. కాబట్టి, ఇప్పుడు భద్రాచలంను ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడానికి మీకు అంగీకారమేనా? ఈ విషయం తెలియజేయాలని నేను కోరుతున్నాను.

శ్రీ ఇ. రాజేందర్ః అధ్యక్షా, మంత్రి గారు చెప్పినదాంట్లో .. నా దగ్గర పేపరుంది చూపిస్తాను. భద్రాచలం గుడికి నిజాం నవాబే ముత్యాల తలంబ్రాలు పంపిన సాంప్రదాయాన్ని మర్చిపోవద్దు. చరిత్రను మరవకండి. నా దగ్గర పేపరుంది. పైగా అధ్యక్షా.. ఆ భద్రాచలం గుడిని కట్టించిన వారే గోపాల్‌రావ్ అనే విషయాన్ని.....

(ఈ సందర్భంలో 'గోపన్న' అని కొందరు సభ్యులు గుర్తు చేశారు)

గోపన్న అనే విషయాన్ని మర్చిపోవద్దు. ఆయన తానీషా పాలనలో గోల్కొండ జైల్లో ఉన్న విషయాన్ని మర్చిపోవద్దు. ఖచ్చితంగా ముమ్మాటికీ భద్రాచలం గుడి కట్టించింది తెలంగాణా

ఎమ్మార్వో గోపన్న. ఖచ్చితంగా ఆ గుడికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు పంపే సాంప్రదాయం నిజాం నవాబుకు ఉంది. ఆ చరిత్రను మర్చిపోవద్దు.

ఉ.11.40

పెద్ద మనుషుల ఒప్పందంలో ఏమి రాసుకున్నామంటే, ఈ ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలు ఈ ప్రాంత బిడ్డలకే చెందాలి, ఇవ్వాళ ఆంధ్ర ప్రాంతం నుండి ముఖ్యమంత్రిగా ఉంటే, తెలంగాణా ప్రాంతానికి ఉప ముఖ్యమంత్రి ఉండాలి. జనాభా నిష్పత్తికి లోబడి మంత్రి వర్గంలో స్థానాలు ఉండాలి. ఈ ప్రాంతంలో ఉన్న ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్‌లో ఈ ప్రాంతం వారికే ఖచ్చితంగా అవకాశాలు ఉండాలి. ఇక్కడ వస్తున్న ఆదాయాన్ని ఈ ప్రాంత అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలి. ఇక్కడ తెలంగాణ రీజనల్ బోర్డును ఏర్పాటు చేసి, ఒక వేళ ఎవరైనా భూములను కొనాలనుకుంటే ఆ రీజనల్ బోర్డు పర్మిషన్ లేకుండా భూములను కొనే వీలులేనటువంటి ఇలాంటి పది డిమాండ్లతో ఆ మర్జ్ అయిన సందర్భంలో అగ్రిమెంట్ రాసుకోవడం జరిగింది. ఆ అగ్రిమెంటులో అటువైపు నుంచి బెజవాడ గోపాల్‌రెడ్డి గారు, నీలం సంజీవ రెడ్డి గారు, ప్రకాశం పంతులు గారు సంతకాలను చేయగా ఇటువైపు నుంచి చెన్నారెడ్డి గారు, బూర్గుల రామకృష్ణరావు గారు వంటి ఎనిమిది మంది పెద్దల సమక్షంలో ప్రెస్టేజియస్ హౌస్ అయిన హైదరాబాద్ హౌస్‌లో సంతకాలను చేయడం జరిగింది.

ఆ రోజు ఢిల్లీ నుంచి ఫ్లైట్‌లో తెలంగాణకు రాకముందే మొట్టమొదటి ఉల్లంఘన జరిగిపోయింది. ఆరోజు ఏ పేరు పెట్టాలనుకున్నారంటే, ''తెలంగాణ ఆంధ్రరాష్ట్రం'' అని పేరు పెట్టాలనుకున్నాము. ఫ్లైట్ నుంచి దిగకముందే సిరా ఆరకముందే మొట్టమొదటి ఉల్లంఘన జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడిన రోజే పేరులో ఉన్న తెలంగాణ పదాన్ని తీసివేసి, ఈ ఉనికిని గుర్తు చేయకుండా ఉండటం కోసం, తెలంగాణ అనే పదం లేకుండా చేయడం, మళ్లీ ఉద్యమాలు రావడానికి ఆస్కారం ఉంటుందేమోనని మొట్టమొదటసారి గుర్తించి కుట్రపూరితంగా తెలంగాణ పదాన్ని నిషేధించి ఈ తెలంగాణా ప్రజల కళ్లల్లో తొలిసారి మట్టి కొట్టిన సందర్భాన్ని మనం మర్చిపోవద్దు.

నీలం సంజీవరెడ్డి గారు ఆంధ్ర రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ ఆంధ్రప్రదేశ్‌కి ఉప ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి సమైక్య రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి అయ్యారు. నేను అడుగుతున్నాను, ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత పెద్ద మనుషుల ఒప్పందంలో భాగంగా ఎందుకు ఉప ముఖ్యమంత్రి పదవిని తెలంగాణా ప్రాంతానికి ఇవ్వలేకపోయారు? ఆ పెద్ద మనుషుల ఒప్పందం..

(సీమాంధ్ర కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యులు అభ్యంతరాలను వ్యక్తం చేయసాగారు)

మూడవ ఉల్లంఘన అనేది భూముల విషయంలోనూ, ఉద్యోగాల విషయంలోనూ, విద్య విషయంలోనూ జరిగింది. మీరు ఉల్లంఘనలకు పాల్పడిన ఫలితంగానే ఆనాడు 1969లో ఉద్యమం వచ్చిందనే విషయాన్ని మర్చిపోకూడదు. ఆనాడు 1969లో ఉద్యమం వచ్చినప్పుడు శ్రీ కాసు బ్రంహ్మానందరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ రోజు శ్రీ కాసు బ్రంహ్మానందరెడ్డి గారు ఒక కమిటీని వెసి, తేల్చి నిజమే తెలంగాణా ప్రాంత ఉద్యోగులు కోరుతున్నట్లుగా, తెలంగాణా ప్రాంత విద్యార్థులు కోరుతున్నట్లుగా, తెలంగాణా ప్రాంత ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నట్లుగా అన్యాయం జరిగిన మాట వాస్తవమే అని, 22400 తెలంగాణ బిడ్డల ఉద్యోగాలను ఆంధ్ర ప్రాంతం వాళ్లు ఆక్రమించుకున్న మాట వాస్తవమే అని, జీఓ నెం.36ను ఇచ్చిన మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. ఆ జీఓ నెం.36ను అమలు చేసిన పాపాన పోలేదు.

(Interruptions)

ఈ విషయాలను నేను చెప్పడం లేదు. ఇదంతా కూడా on record, రికార్డ్స్‌లో ఉంది. ఆ రోజు ఆంధ్ర ప్రాంత నుండి గౌతు లచ్చన్న గారి లాంటి పెద్దలు మాట్లాడారు.

(అంతరాయం)

ఆ ఉద్యమం సందర్భంగా గౌతు లచ్చన్నగారు మాట్లాడిన మాట ఏమంటే – అయ్యా 13 సంవత్సరాలు గడిచినా ఈ రాష్ట్రంలో ఎమోషనల్ పందాలు ఏర్పడలేదు. ఈ రాష్ట్రంలో ప్రజల సంస్కృతి విషయంలో, సాంప్రదాయాల విషయంలో ఒకరిని ఒకరు అర్థం చేసుకునే విషయంలో ఈ రాష్ట్రంలో ఆ విధానం ఎస్టాబ్లిష్ కాలేదు. కాబట్టి ఉద్యమం రావడం సమంజసమే అని మాట్లాడటమే కాకుండా, మన ప్రక్క రాష్ట్రాల్లో తమిళం మాట్లాడే వారికి రెండు రాష్ట్రాలు ఉండగా, తెలుగు మాట్లాడే వారికి రెండు రాష్ట్రాలు ఉంటే తప్పు లేదని ఆ రోజు ఈ సభలో గౌతు లచ్చన్నగారు మాట్లాడారు. రావి నారాయణరెడ్డి గారు పుచ్చలంపల్లి సుందరయ్య గారు మాట్లాడిన మాట ఏమంటే ' అధ్యక్షా మేము విశాలాంధ్రను కోరిన మాట వాస్తవమే. కానీ ఇంత అన్యాయం జరుగుతుందని, ఇన్ని నిధులను తరలించుకుపోతారని, ఇన్ని ఉద్యోగాలను కొల్లగొడతారని ఈ ప్రాంత అభివృద్ధిని విస్మరిస్తారని మేము కూడా నమ్మలేకపోతున్నామని' అన్నారు.

(సీమాంధ్ర కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యులు అభ్యంతరాలను వ్యక్తం చేయసాగారు)

(తమకు అవకాశం కల్పించాల్సిందిగా సభ్యులు శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు గారు గౌరవ ఉప సభాపతిని కోరసాగారు)

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు : అధ్యక్షా గౌరవ సభ్యులు ఈటల రాజేందర్ గారు ఉద్యమ నాయకులును, ఆ ఉద్యమాల్లో ప్రధానమైన కీలకమైన భూమికను పోషించిన వారు. వెయ్యి మంది

అమాయకులైన విద్యార్థులు ఉద్యమాల్లో రెచ్చగొట్టే ఉపన్యాసాల వల్ల ఆత్మ బలిదానం చేసుకోవడానికి కారకులైన వారిలో వారు కూడా ఒకరు. ఈ రోజు నేను ఒక్క మాటనే అడుగుతున్నాను. అవాస్తవాలను చెబుతున్నప్పుడు ఈ రోజు రాష్ట్రమంతా గమనిస్తూంది.

(ఈ దశలో టిఆర్ఎస్ పార్టీ సభ్యులకు సీమాంధ్ర ప్రాంత కాంగ్రెస్ పార్టీ సభ్యులకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది)

తెలంగాణా రాష్ట్రం ఇస్తున్నామని కేంద్రం ప్రకటిస్తేనే మమ్మల్ని మీరింత ర్యాగింగ్ చేస్తున్నారే, రేపు మీ చేతుల్లో పెడితే ఇక్కడ సీమాంధ్ర ప్రజల భవిష్యత్తు ఏమిటి? మమ్మల్ని మీరు బ్రతకనిస్తారా?

(అంతరాయం)

అధ్యక్షా, తమరి ద్వారా వారికి ఒక మాట చెబుతున్నాను. చరిత్ర గురించి మాట్లాడే ముందు.. (మైక్ కట్ అయ్యింది)

(అంతరాయం)

(ఈ దశలో టిఆర్ఎస్ పార్టీ సభ్యులు శ్రీ కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మరియు శ్రీ సోమారపు సత్యనారాయణ వారి స్థానాల నుండి ట్రెజరీ బెంచీల వైపుకు వెళ్లి సభ్యులు శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు మరియు శ్రీ గాదె వెంకటరెడ్డి తో పాటు మరి కొంత మంది కాంగ్రెస్ పార్టీ సభ్యులతో వాగ్వివాదానికి దిగారు.)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : దయచేసి అందరూ కూర్చోండి. రాజేందర్ గారూ మాట్లాడండి.

(అంతరాయం)

ఉ. 11.50

I appeal to the members also. Please sit down.

శ్రీ ఈటెల రాజేందర్ః అధ్యక్షా, తెలంగాణకు చెందిన బూర్గుల రామకృష్ణారావు గారు హైదరాబాదు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో ఆ రోజు విశాలాంధ్ర కోసం కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేస్తే దానికి అనుగుణంగా వారు సహకరించి చివరికి తన ముఖ్యమంత్రి పదవిని కూడా త్యాగం చేసి విశాలాంధ్ర కోసం ....................

(అధికారపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః రాజేందర్ గారూ, మాట్లాడండి.

(అధికారపక్ష సభ్యులు "జై సమైక్యాంధ్ర, జై జై సమైక్యాంధ్ర" అని నినాదాలు చేయసాగారు)

MR.DY.SPEAKER: Dr.S.Sailajanath Garu, please make an appeal.

DR.S.SAILAJANATH: Speaker sir, I am appealing. I am appealing.

(అధికారపక్ష సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్‌: దయచేసి సభ్యులు ఎవరూ రెచ్చగొట్టే విధంగా మాట్లాడొద్దు. Please sit down. Please resume your seats. Please go back to your seats.

( శ్రీ గాదె వెంకటరెడ్డి గారి నుంచి అంతరాయం )

Gade Venkat Reddy garu, you are a senior member. Please sit down. Sailajanath Garu, please make an appeal.

డా.ఎస్.శైలజానాథ్ (శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి): అధ్యక్షా, మీ ద్వారా సభలోని సభ్యులందరినీ కోరుతున్నాను. ఈరోజు తెలుగు ప్రజల చరిత్రలో అత్యంత సంక్లిష్టమైన రోజు. ఆవేశాలు, భావోద్వేగాలు, బాధలు ఎవరివి వారికున్నాయి. సభ్యులకు ఎవరికైనా అభ్యంతరం ఉంటే మీకు అప్పీల్ చేసుకోవచ్చు. మేం వచ్చినప్పటినుంచి చారిత్రకంగా ఎన్ని అవాస్తవాలు మాట్లాడుతున్నప్పటికీ మీకు అప్పీల్ చేసుకున్నాం కానీ సభకు ఎటువంటి ఆటంకం కలిగించలేదు. కానీ సదరు పార్టీ సభ్యుల గురించి వారి నాయకుడికి చెప్పాల్సి ఉంటుంది. మా టేబుళ్ల దగ్గరికొచ్చి మా సభ్యుల దగ్గరికొచ్చి వార్నింగ్‌లనిస్తూ చొక్కాలు పట్టుకోవడం ఏ విధంగానూ క్షంతవ్యం కాదు. ఇది మంచి పద్ధతి కాదు. ఇది బలాబలాలు పరీక్షించుకునే వేదిక కాదు. కొంత మంది సభ్యులు మనసు మార్చుకొని పార్టీలు మారొచ్చు కానీ ఇందాక తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుల తీరు మాత్రం క్షంతవ్యం కాదు. జరిగిన సంఘటనకు వారు క్షమాపణ చెబితే సంతోషం. అది వారి విజ్ఞతకు వదిలేస్తున్నాం కానీ మీరు మాత్రం వారికి ఒక వార్నింగ్ ఇవ్వాలి. మా టేబుళ్ల దగ్గరికి ఇంకొకసారి వస్తే మాత్రం మా సభ్యుల రక్షణ బాధ్యత కూడా మీదేనని సవినయంగా తెలియజేస్తున్నాను...........

MR.DY.SPEAKER: Sailajanath Garu you are Legislative Affairs Minister. Please sit down.

(శ్రీ కె.కన్నబాబు, శ్రీ రౌతు సూర్యప్రకాశరావు గార్ల నుంచి అంతరాయం )

మిస్టర్ డెప్యూటీ స్పీకర్‌: కన్నబాబు గారూ, రౌతు సూర్యప్రకాశరావు గారూ, దయచేసి కూర్చోండి.

డా.ఎస్.శైలజానాథ్‌: అధ్యక్షా, వాస్తవాలను వాస్తవాలుగా చెప్పమనండి. ఆంధ్రప్రదేశ్ అనే నామకరణాన్ని ఆంధ్రులు బలవంతంగా రుద్దారా, లేదంటే ఎవరు రుద్దారన్నది ఇక్కడ చెప్పాలి. ఈ రాష్ట్రానికి ఏ పేరు పెట్టాలి అనే అంశంపైన ఆనాటి గౌరవసభ్యులు అలంపూర్, గద్వాల్‌కి చెందిన పుల్లారెడ్డి గారు, కొండల్‌రెడ్డి గారు, శ్రీరాములు గార్ల వంటి అనేక మంది చెప్పిన అభిప్రాయం ప్రకారం ఆంధ్రప్రదేశ్ అనే నామకరణం చేశారు, తెలంగాణం అనే పదం ఎక్కడా లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. మన పితామహుడు పద్మవిభూషణ్ మాడపాటి హనుమంతరావు

గారు ఆంధ్రపితామహులుగానే సుప్రసిద్ధులుగా గుర్తింపు పొందారు తప్ప తెలంగాణ పితామహులుగా ఎప్పుడూ పిలవలేదని పుల్లారెడ్డి గారే చెప్పారు. నా అభిప్రాయంలో ఆంధ్రప్రదేశ్ అనే నామకరణమే బాగుంటుంది తప్ప ఆంధ్ర, తెలంగాణ అనే పదం సరిగా లేదని పుల్లారెడ్డి గారు చెబితే మంథని శ్రీరాములు గారు మాట్లాడుతూ వారి చిరకాల కోరిక వాస్తవమౌతోంది, ధన్యవాదాలు అన్నారు. త్రిలింగ అనే పదం నిజాం చెప్పాడు. ఇది సబబైన పదం కాదు. ఆంధ్రప్రదేశ్ అనే పదమే హుందాగా ఉంటుందని శ్రీరాములు గారు చెప్పారు.

కల్వకుర్తికి చెందిన నర్సింగరావు గారు చెప్పిందేమిటంటే నేను ప్రాథమికంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలకు వ్యతిరేకమైనా మారిన పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోదల్చుకున్నాను. నేను కొత్తగా ఏర్పడబోయే రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్ అనే నామకరణంతో పిలవడానికే ఇష్టపడతాను. అంతే కాకుండా ప్రాచీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తర సర్కారులు, రాయలసీమ, తెలంగాణ మరియు ఆంధ్ర ప్రాంతాలు భాగంగా ఉన్నాయి కనుక ఆంధ్రప్రదేశ్ నామకరణమే తగిన విధంగా ఉంటుందని చెప్పారు.

జవహర్‌లాల్ నెహ్రూ గారు ఎప్పుడు వీరితో మాట్లాడారో ఒకసారి మాకు చూపిస్తే బాగుంటుంది. మా పార్టీ ఆఫీసులో వారు మాట్లాడిన అంశాలు రికార్డులను బట్టి నాకు తెలుసు. చారిత్రక అంశాలను దయచేసి వక్రీకరించొద్దని కోరుతున్నాను. ఇటువంటి అసంబద్ధమైన అవాస్తవాలను చెప్పే క్రమంలోనే తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన కొందరు సభ్యులు మా సీట్ల దగ్గరికొచ్చి బెదిరించే కార్యక్రమం ఏ విధంగానూ క్షంతవ్యం కాదు. నాగరిక సమాజానికి వ్యతిరేకం. ఈ శాసనసభకు కూడా అగౌరవం. దానిని మీరు ఖండించడంతోబాటు వారిని హెచ్చరించాలి. నిజంగా వారికి విజ్ఞత ఉంటే వారే స్వయంగా క్షమాపణ కోరుకోవాలని కోరుతున్నాను.

( అధికారపక్ష సభ్యుల నుంచి అంతరాయం )

మ. 12.00

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: దయచేసి కూర్చోండి సూర్యప్రకాశ్ రావు గారు. సభలో మనం చర్చించుకుంటున్నటువంటి బిల్లు పైన వివిధ ప్రాంతాలకు సంబంధించిన శాసన సభ్యులకు రకరకాలైనటువంటి భిన్నాభిప్రాయాలుంటాయి. అదే విధంగా భావోద్రేకాలు ఉంటాయి. అంతమాత్రాన మనం భావోద్రేకాలకు లోనై సభలో మన స్థానాలను వదిలిపెట్టి మరొక శాసనసభ్యుడి స్థానం వద్దకు వెళ్లి ప్రవర్తించడమనేది సభకు ఏ విధంగా ఆమోదయోగ్యం కాదు. ఎవరి అభిప్రాయాలను వారు స్వేచ్ఛగా సభలో చెప్పడానికి వారి భావాలను వ్యక్తపర్చడానికి సమయాన్ని కేటాయించాం. సభలో ఉన్నటువంటి వారందరూ గౌరవ శాసనసభ్యులే. పరస్పరం సహకరించుకుంటూ చర్చను కొనసాగిద్దాం. అలాకాకుండా ఎవరు ఏ రకంగా ప్రవర్తించినా అది సభకు హుందాతనంగా ఉండదు. దయచేసి ఈ సభ హుందాతనాన్ని కాపాడతారని కోరుకుంటూ మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి ఎవరి స్థానాల్లో వారుండి అవకాశం వచ్చినప్పుడు వారు

మాట్లాడవల్సిందిగా మరొకసారి విజ్ఞప్తి చేస్తున్నాను. స్థానాలను వదిలిపెట్టి మిగితా సభ్యుల దగ్గరకు వెళ్లి వేరొక రకంగా ప్రవర్తించినటువంటి వాళ్లు దయచేసి మీ ఆలోచనను, భావాన్ని, జరిగిన సంఘటనను పొరపాటుగా భావించి వ్యక్తపరుస్తారని నేను ఆశిస్తున్నాను. దయచేసి ఆ సంఘటనపైన చర్చిస్తారని నేను భావిస్తున్నాను.

ఈటెల రాజేందర్ గారు మాట్లాడండి.

(ట్రెజరీ బెంచ్ వైపు నుంచి సర్వశ్రీ ఎస్. శేషారెడ్డి, కె. కన్నబాబు తదితరులు వారి స్థానాల్లో నిల్చొని శ్రీ గాదె వెంకట రెడ్డి గారికి మైక్ ఇచ్చి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: నేను శ్రీ గాదె వెంకట రెడ్డి గారికి మాట్లాడే అవకాశం ఇస్తాను. కానీ మొదట రాజేందర్ గారు మాట్లాడుతున్నారు కదా! వారు మాట్లాడిన తరువాత అవకాశం ఇస్తాను. దయచేసి కూర్చోండి. రాజేందర్ గారు జరిగిన సంఘటన గురించి మాట్లాడండి.

శ్రీ ఈటెల రాజేందర్: అధ్యక్షా, నా మొట్టమొదటి పదంలోనే నేను ఒక మాట చెప్పడం జరిగింది. మేం ఒకరిని ఇబ్బంది పెట్టాలనో.........

(ట్రెజరీ బెంచ్ వైపు సభ్యుల నుంచి అంతరాయం)

ఒకరి హృదయాలను గాయపర్చే పద్ధతిలో మాట్లాడమని చెప్పడం జరిగింది. ఆ మాటకు తప్పక మేం కట్టుబడి ఉంటాం. కానీ నేను మాట్లాడిన మాటకు వారి స్పందన వారి హుందాతనానికి సరిపోలేదు. రెండవ విషయం on record, 1969వ సంవత్సరంలో 370 మంది మరణించిన విషయం వాస్తవం కాదా? ఇడ్లీ సాంబార్ గోబ్యాక్ ఉద్యమంలో సమైక్య రాష్ట్రం ఏర్పడని నాడే ఏడు మంది విద్యార్థులు చనిపోయింది వాస్తవం కాదా? ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని క్యాంపస్‌లో శ్రీ యాదయ్య అనే విద్యార్థి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సబంధించిన ఉద్యమంలో ఆ రోజు ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిస్తే మీ సమైక్య రాష్ట్ర పాలకుల కుట్రల వల్ల మీరు పర్మీషన్ ఇవ్వని కారణంగా పెట్రోల్ మంటల్లో కాలి బూడిదైపోయిన మాట వాస్తవం కాదా? నేను మాట్లాడిన మాటల్లో ఏది వాస్తవం కాదండి? ఇవాళ నేను తప్పకుండా ఆనాడు వారు చూపిన అమరత్వం గురించి, ఆ అమరవీరుల గురించి మాట్లాడవల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ, అందుకు విరుద్ధంగా మేమే వారి మరణాలకు కారణమని ఎదురుదాడి చేయడమనేది ఎంతవరకు సమంజసం, సమస్కారం. మొదట ఆ మాటలను రికార్డుల్లో నుంచి తొలగించండి. అదే విధంగా మా పార్టీ సభ్యులు మీ దగ్గరకు రావడమనే అంశం మర్యాద అని మేం అనడం లేదు. వారు వారి స్థానాలను వదిలి ఇంకొకరి స్థానాల దగ్గరకు వెళ్లడం సమంజసం కాదు. ఆ విషయంలో ఇంకొకరికి బాధనిపిస్తే అందుకు తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరఫున చింతిస్తున్నాం. అందుకు "బాజాప్త చింతిస్తున్నాం". కానీ, మీరు పదే పదే మా ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం దయచేసి చేయొద్దు.

మీకు అవకాశం వచ్చినప్పుడు ఎంతసేపైనా మాట్లాడండి. మేం ఓపికగా వింటాం. ప్రసంగాన్ని అడ్డుకునే సంస్కారం, సాంప్రదాయం మంచిది కాదనే విషయాన్ని నేను చెబుతున్నాను. 294 మంది శాసన సభ్యుల చేత సభలో మాట్లాడించమని కోరినాం. ఇదొక చారిత్రాత్మకమైన ఘట్టం. తప్పకుండా ప్రజల తరఫున బాధ్యత వహిస్తున్నటువంటి ఈ ప్రజాప్రతినిధులు వారి వారి ప్రజల యొక్క అంతరాత్మను ఆవిష్కరించే ప్రయత్నం చేయమని కోరింది తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ.

అధ్యక్షా, శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రు గారు ఎప్పుడు చెప్పారనే మాటలను వారు మాట్లాడుతున్నారు. నా దగ్గర ఉన్న పత్రికా కథనాలను మీ దగ్గరకు పంపిస్తాను. పండిట్ జవహర్‌లాల్ నెహ్రు గారు నిజామాబాద్‌లో మాట్లాడినటువంటి ప్రెస్ రిపోర్ట్‌ను ఆనాడు "గోల్లకొండ" అనే పత్రికలో ప్రచురితమైంది. ఆ ప్రెస్ రిపోర్ట్‌ను మీకు పంపుతాను. దయచేసి పరిశీలించండి.

ఇవ్వాళ గౌరవ శాసనసభా వ్యవహారాల శాఖామాత్యులు వారి ప్రసంగంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీకి చరిత్ర తెలియకుండానే, చదువుకోకుండానే, వాస్తవాలు తెలియకుండానే మాట్లాడుతున్నారనే భావనతో మాట్లాడుతున్నారు. కానీ అది మంచి పద్ధతి కాదు. అవును, మేమేది మాట్లాడుతున్నామో వాటన్నింటికి రికార్డులుంటాయి. అన్నింటినీ మేం లిఖితపూర్వకంగా మీకు పంపిస్తాం. దయచేసి అర్థం చేసుకోండి.

అధ్యక్షా, ఎంత గొప్పవాళ్లో, ఎంత నీతిమంతులో వారి గురించి నేను చెబుతాను. ఆనాడు శ్రీ బూర్గుల రామకృష్ణా రావు గారు హైదరాబాద్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఈ విశాలాంధ్ర కోసం వారి పదవిని త్యాగం చేస్తే, ఈ రాష్ట్ర ఏర్పాటు కోసం వారు ఆనాడు సహకరిస్తే వారు మరణించిన అనంతరం కనీసం వారి పార్థివ శరీరాన్ని అధికార లాంచనాలతో అంత్యక్రియలు జరిపే సంస్కారం లేదండి మీకు. మీరు ఇవాళ ఏమి మాట్లాడతారు? రెండు కాగితాలను మీకు పంపిస్తాను. శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రు గారు ఏం మాట్లాడింది ఇందులో ఉంది. "విశాలాంధ్ర ఆశయం పట్ల ప్రధాని నెహ్రు వైముఖ్యం" "విశాలాంధ్ర ఏర్పాటు పట్ల నెహ్రు వైముఖ్యం" అనేటటువంటి పత్రికా శీర్షికలను మీకు పంపిస్తాను.

(ట్రెజరీ బెంచ్ వైపు సభ్యుల నుంచి అంతరాయం. శ్రీ గాదె వెంకట రెడ్డి గారికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని ట్రెజరీ బెంచ్ వైపు సభ్యులు సర్వశ్రీ కె.కన్నబాబు, ద్రోణంరాజు శ్రీనివాసరావు శ్రీమతి పి.నిరజారెడ్డి తదితరులు వారి స్థానాల్లో నిల్చొని సభకు అంతరాయం కల్గించసాగారు)

జరిగిన సంఘటనకు మేం చింతిస్తున్నామని చెప్పిన తరువాత కూడా వారు నా ప్రసంగాన్ని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం సార్. మీరైనా వారిని వారించండి. చింతిస్తున్నామని నేను చెప్పిన తర్వాత కూడా వాళ్లు మాట్లాడొచ్చా అధ్యక్షా? మీకు సభలో చర్చ జరగాలని లేదు, మీ వాదనలో పస లేదు. మీరు చేస్తున్నటువంటి వాదనలో పస లేదు. పస లేదన

తెలిసిపోయిన తరువాతే కేవలం వట్టి ద్వేషంతో ఇరు ప్రాంతాల మధ్య దయచేసి విషం చిమ్మే ప్రయత్నం చేయొద్దు. దయచేసి అర్థం చేసుకోండి.

(ట్రెజరీ బెంచ్ వైపు సభ్యుల నుంచి అంతరాయం. శ్రీ గాదె వెంకట రెడ్డి గారికి మాట్లాడే అవకాశం ఇవ్వాలని ట్రెజరీ బెంచ్ వైపు సభ్యులు సర్వశ్రీ కె.కన్నబాబు, ద్రోణంరాజు శ్రీనివాసరావు శ్రీమతి పి.నిరజారెడ్డి తదితరులు వారి స్థానాల్లో నిల్చొని సభకు అంతరాయం కల్గించసాగారు)

MR. DY. SPEAKER: Please sit down Rajender garu. దయచేసి మీరు కూర్చోండి. నేను శ్రీ గాదె వెంకట రెడ్డి గారికి మాట్లాడే అవకాశం ఇస్తాను. మైక్ ఇస్తాను. దయచేసి ఓపిక పట్టండి. గౌరవ సభ్యులు శ్రీ ఈటెల రాజేందర్ గారు మాట్లాడుతూ జరిగిన సంఘటన పట్ల వారి పార్టీ తరఫున "చింతిస్తున్నాం" అనే మాటను చాల స్పష్టంగా సభ మొత్తానికి తెలియజెప్పారు. దయచేసి సభ సజావుగా జరగడానికి సీనియర్ సభ్యులుగా మీరు కూడా సూచనలిస్తారని నేను ఆశిస్తున్నాను. శ్రీ గాదె వెంకట రెడ్డి గారు మీరు మాట్లాడండి.

శ్రీ గాదె వెంకట రెడ్డి: అధ్యక్షా, ఈ శాసనసభలో 1966వ సంవత్సరం నాటి శాసనసభలో శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తిని నేనొక్కడినే అనే విషయాన్ని మనవి చేస్తున్నాను.

(సభలో చప్పట్లు)

నేను సభలో ప్రసంగించేటప్పుడు ఎప్పుడు పదజాలం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండి మాట్లాడతాను. జరిగిన సంఘటనకు సంబంధించి శ్రీ ఈటెల రాజేందర్ గారు కొన్ని విషయాల గురించి, కొన్ని చారిత్రక సత్యాల గురించి సభను తప్పుడుదోవ పట్టించే రీతిలో మాట్లాడుతున్నారనే విషయాన్ని కూడా నేను మనవి చేస్తున్నాను. వారి ప్రసంగానికి సంబంధించి ప్రభుత్వ విప్ శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ మీరు మాట్లాడేది తప్పు, పద్ధతి కాదనే విషయాన్ని తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులకు చెబుతుంటే, గౌరవ శాసనసభ్యులు సభ్యత, సంస్కారం లేకుండా వారి స్థానాలను వదిలి మాట్లాడే సభ్యుడి దగ్గరకు వచ్చి నిల్చొని ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సభా సాంప్రదాయాలకు అనుకూలమా, విరుద్ధమా, సంస్కృతా, మర్యాదా అని నేను వారిని అడుగుతున్నాను. మీరు ప్రవర్తించిన తీరు మంచిది కాదని నేను చెప్పడానికి వెళ్తే వాళ్లు నా చొక్కా పట్టుకుంటారాండి? ఇదేనా సాంప్రదాయత? ఇదే వారి సంస్కృతా? ఆ సందర్భంలో నా దగ్గరకు వచ్చిన వారి పేర్లు కూడా నాకు తెలియదు. అందుకని మీరు తప్పకుండా జరిగిన సంఘటన పట్ల వారితో క్షమాపణలు చెప్పించాల్సిన అవసరముంది. ఇప్పుడే ఈ సందర్భంలోనే మేం మాట్లాడేప్పుడే వాళ్లు దౌర్జన్యం చేయాలనే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే భవిష్యత్తులో మరిన్ని పెద్ద సమస్యలు ఉత్పన్నమౌతాయనే భయాందోళనలు ప్రజాప్రతినిధులకు,

ప్రజలకు ఉంది. కానీ అదేమి మీ సొంత సొత్తు కాదు. బాగా ఆలోచించుకోమనే విషయాన్ని నేను సభాముఖంగా మనవి చేస్తున్నాను. ఈ విధంగా దౌర్జన్యం చేయడమనేది మీ సొంత సొత్తు కాదు.

(తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు శ్రీ నల్లల ఓదేలు వారి స్థానం నుంచి ప్రసంగించసాగారు)

దయచేసి కూర్చోవయ్యా, ఏం మాట్లాడుతున్నావు? తెలంగాణ రాష్ట్ర సమితి తరఫున శ్రీ ఈటెల రాజేందర్ గారు మరియు శ్రీ టి.హరీష్ రావు గారు సభలో ఉన్నారు. సంస్కారం లేనటువంటి ఆ పార్టీ సభ్యులు మాట్లాడుతుంటే వారిని నియంత్రించాల్సిన అవసరం, బాధ్యత శ్రీ రాజేందర్ గారి పైన, శ్రీ హరీష్ రావు గారిపైన ఉందనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను. ఎవరూ సభలో తెలివితక్కువ వాళ్లు లేరు. అంత వెదవతనంగా మేం లేము. మీరు దౌర్జన్యాలకు పాల్పడితే వాటిని ఎదుర్కొనే శక్తిసామర్థ్యాలు మాకున్నాయనే విషయాన్ని ఒకసారి మీ ద్వారా వారికి తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

(సభలో చప్పట్లు)

(తెలుగు దేశం సభ్యులు శ్రీ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, శ్రీ బల్లి దుర్గా ప్రసాద్ రావు తదితరులు మాట్లాడే అవకాశం మాకు ఇవ్వాలని కోరుతూ పోడియం దగ్గరకు చేరారు)

(సభకు అంతరాయం)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: రాజేందర్ గారు మాట్లాడండి.

శ్రీ ఈటెల రాజేందర్: అధ్యక్షా, పెద్ద మనుషుల ఒప్పందం ఉల్లంఘన తరువాత, 1969వ సంవత్సరంలో ఉద్యమం వచ్చిన తరువాత స్వయంగా ఆనాడు ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ గారు ఈ హైదరాబాద్‌కు వచ్చి అనేక విషయాలు చర్చించి మళ్లీ కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ఒకటి ఆరు సూత్రాల పథకం. మళ్లీ విద్య విషయంలో, ఉద్యోగ వనరుల విషయంలో ఏమైతే అక్రమాలు జరిగాయో వాటన్నింటినీ సరిదిద్దే ప్రయత్నం చేస్తామని 1973, సెప్టెంబర్ 21వ తేదీ నాడు ఆరు సూత్రాల పథకం అమలులోకి వచ్చింది.

(తెలుగు దేశ ం సభ్యులు శ్రీ బల్లి దుర్గాప్రసాద్ రావు, దేవినేని ఉమామహేశ్వర రావు తదితరులు పోడియం దగ్గరకు వస్తూ వారి పార్టీకి మాట్లాడే అవకాశం కల్పించాలని కోరుతూ సభకు అంతరాయం కల్గించసాగారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: దయచేసి వెళ్లి కూర్చోండి. మీకు అవకాశం ఇచ్చినప్పుడు మాట్లాడండి. సభ సజావుగా జరిగేందుకు సహకరించండి.

మ.12.10

శ్రీ ఈటెల రాజేందర్ : ఈ ఆరు సూత్రాల పథకం అమల్లోకి వచ్చిన తరువాత తెలంగాణా ప్రాంత ప్రజానీకానికి అది ఒక డెత్ వారెంట్‌లా మిగిలిపోయింది.

(తమ సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని, పోడియం వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ సభ్యులు సభకు అంతరాయం కలిగించసాగారు)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: గోపాల కృష్ణారెడ్డి గారూ.. మీరు మాట్లాడండి. Please go back to your seats. Please make an appeal to run the House. You are all have to cooperate. మీరందరు సహకరించాలి. నేనొక్కడినే ఈ సభని నడపాలని ప్రయత్నిస్తే ఉపయోగం లేదు. Your member is speaking. Please resume your seats.

(తెలుగుదేశం పార్టీ సభ్యులచే సభకు అంతరాయం)

శ్రీ బి. గోపాలకృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి) : అధ్యక్షా ఇది సభ్యులు గాదె వెంకటరెడ్డి గారిపై జరిగిన దాడి కాదు. సమైక్యవాదుల మీద జరిగిన దాడి. ఈ విషయంలో అందర్నీ ఒక్కటిగానే భావిస్తున్నాం. మనం ఎక్కడికెళుతున్నాం?

MR.DEPUTY SPEAKER: Please ask your Members to resume their seats. ముందు వారందర్నీ కూర్చోమని చెప్పండి.

శ్రీ బి. గోపాలకృష్ణారెడ్డి: ఈ వ్యవహారం ఎక్కడ దాకా పోతుందంటే మీరు కూడా తెలంగాణా వాదులే అనే వరకు పోయే పరిస్థితి ఉంది. విలేకర్లని కూడా మీరు తెలంగాణావాదులా, సమైక్యాంధ్రవాదులా అని అడిగి తెలుసుకునే పరిస్థితి నెలకొని ఉంది. ఇది ఎక్కడ దాకా పోతుందో నాకర్థం కావడం లేదు. ఇది చివరికి చొక్కాలు చించుకొనే పరిస్థితికి వస్తుంది. ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకు దీన్ని ఒక ఉదాహరణగా భావించి మీరు గట్టిగా చర్యలు తీసుకోవాలి. చర్యలు తీసుకోకపోతే మాత్రం ఇబ్బంది ఔతుంది. ఈ పరిస్థితి రావడానికి కారణం కాంగ్రెస్ పార్టీ చేసిన పనే తప్ప మరొకటి కాదు. అందులో సందేహం లేదు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన కవలపిల్లల్లో ఒకరు వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి గారు. ఆయన పార్టీ సభ్యులు సమైక్యాంధ్రకు అనుకూలంగా ఓటు వేయాల్సి వస్తుందనే భయంతో సభ నుండి బయటకు వెళ్లారు.

(పోడియం వద్ద నున్న తెలుగుదేశం సభ్యులచే అంతరాయం)

MR. DEPUTY SPEAKER: Please resume your seats.

శ్రీ బి. గోపాలకృష్ణారెడ్డి : అధ్యక్షా కేంద్రమంత్రి చిదంబరం గారు, It is a demanded House అని చెప్పారు. ఈ రోజు అటు సమైక్యవాదులు కావచ్చు, విభజన వాదులు కావచ్చు.

సెపరేట్ అయ్యారు. శాసన సభకు బిల్లు వచ్చింది. ఈ బిల్లుకు ఎటువంటి వ్యాలిడిటీ లేదని చెబుతున్నారు.

( అంతరాయం)

MR. DEPUTY SPEAKER: Can you make a request and appeal to the members?

శ్రీ బి. గోపాలకృష్ణారెడ్డిః బిల్లుపైన డిస్కషన్ ఉంటుందే గాని, ఓటింగ్ ఉండదని చెప్పడం పొరపాటు. ఓటింగ్ పెట్టాల్సిన అవసరముంది.

శ్రీ డి. నరేంద్ర కుమార్ః విభజించి పాలించటమనేది తగదు సార్. (మైకు లేకుండా )

MR. DEPUTY SPEAKER: Please sit down… Rajendar Garu…

(తెలుగుదేశం పార్టీ సభ్యులచే అంతరాయం)

శ్రీ ఇ. రాజేందర్ః అధ్యక్షా, అనేక రకాల ఉల్లంఘనల తరువాతనే, ఈ పెద్దమనుషుల ఒప్పందాన్ని పదే పదే...

శ్రీ ధూళిపాళ్ల నరేందర్ కుమార్ (పొన్నూరు)ః (మైకు లేకుండా ) కచ్చితంగా మాకు మాట్లాడే హక్కు ఉంది. మా అభిప్రాయాలు చెప్పే హక్కుంది.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః సీనియర్ సభ్యులు చెప్పారు. రాజేందర్ గారూ...

(శ్రీ డి. నరేంద్ర కుమార్చే అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః రాజేందర్ గారూ.. దయచేసి జరిగిన సంఘటనలపైన, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండే విధంగా చెప్పాల్సిన రీతిలో మీరు చెబుతారని ఆశిస్తున్నాను.

(అంతరాయం)

శ్రీ ఇ. రాజేందర్ః అధ్యక్షా, అనేక రకాల పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. 1969 ఉద్యమం తరువాత, 1973 లో అరు సూత్రాల పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తరువాత, 1974 మే,3వ తేది నాడు 32 వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 371, 371(డి ) ని పొందుపర్చారు.

(పోడియం వద్ద తెలుగుదేశం సభ్యులు " స్పీకర్ గారి నిరంకుశ వైఖరి నశించాలి " అంటూ నినాదాలు చేయసాగారు )

శ్రీ ఇ. రాజేందర్ ః 1972 లోనే సుప్రీం కోర్టు ముల్కీ నిబంధనలకు సవరణ చేయాలని చెప్పి అనౌన్స్ చేసిన తరువాత, ఇలాంటి సవరణలు రావడమనేది నిజంగా ఆ రోజు తెలంగాణా

ప్రజానీకానికి అన్యాయం చేసినట్లుగా, దుర్మార్గం చేసినట్లుగా తెలంగాణ యావత్తు ప్రజానీకం భావించడం జరిగింది. దానికి చట్ట బద్దత కల్పిస్తూ, ఏ ఆరు సూత్రాల పథకాలైతే, ఏ పంచసూత్ర పథకాలైతే, ఏ ఆర్టికల్ 371, 371 (డి) ఇచ్చిందో, దానికి రాష్ట్రపతి ద్వారా ఉత్తుర్వులు కూడా ఇప్పించడం జరిగింది ఇదంతా కూడా గతంలో జరిగిన చరిత్ర అధ్యక్షా.

(ఈ దశలో పోడియం వద్దనున్న తెలుగుదేశం సభ్యులు వారి వారి స్థానాలకు తిరిగి వెళ్లారు)

శ్రీ ఇ. రాజేందర్ః 1985వ సంవత్సరంలో శ్రీ నందమూరి తారక రామారావు గారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ రోజు వారే స్వయంగా.. తెలంగాణఉద్యోగులు ఉద్యమం చేసినప్పుడు, అయ్యా ఎన్ని రక్షణలు ఉన్నప్పటికీ కూడా, ఆ రక్షణలు సాక్షిగా మాకు అనేక అన్యాయాలు జరుగుతున్నాయని ...

(తెలుగు దేశం పార్టీ సభ్యులచే సభకు అంతరాయం )

మిస్టర్ డెప్యూటి స్పీకర్ ః రాజేందర్ గారూ.. I am here to run the House. జరిగిన సంఘటనల పట్ల ఇరు ప్రాంతాల సభ్యులందరూ ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి మీరు మాట్లాడితే సభ స్వాగతిస్తుంది.

శ్రీ ఈటెల రాజేందర్ ః మా గురించి మీరు ఎన్నో సంవత్సరాలనుండి చూస్తున్నారు అధ్యక్షా

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ ః ఒక్క నిమిషం చెప్పనివ్వండి.. అలాగే, మేమంతా ఆశించేదేమంటే మీరందరూ అభిప్రాయాలు స్వేచ్ఛగా వ్యక్త పర్చడానికి కావల్సిన సమయాన్ని కేటాయించాలనే ఆలోచన చేస్తున్నాం. ఆ విధంగా మీరు కూడా సహకరిస్తే సంతోషం.

అలాగే, నరేందర్ గారూ.. మీరు ఒక పార్టీకి విప్ గా ఉన్నారు. సభ సజావుగా నడవడం కోసం సభ్యులు సహకరించే విధంగా సూచన చేస్తారని ఆశిస్తున్నాను. తోటి సభ్యులను రెచ్చగొట్టే విధంగా మీరు మాట్లాడకుండా సభనుద్దేశించి మాట్లాడండి.

శ్రీ డి. నరేంద్రకుమార్ః స్పీకర్ సార్, మిమ్మల్ని మొదటి నుంచీ కూడా కోరింది అందుకే. మేం కోరేదేమంటే – మీరు సభాపతి స్థానంలో ఉండి మేం అవకాశమివ్వమని కోరినప్పుడు, మీరు మా పార్టీ నుండే వేరొక సభ్యునికి మాట్లాడమని సూచించడం కరెక్ట్ కాదు అధ్యక్షా.

MR. DEPUTY SPEAKER : Let me clarify. One minute.

శ్రీ ధూళిపాళ్ల నరేందర్ కుమార్ః మా అప్పీలు వినండి సార్ ..

MR.DEPUTY SPEAKER: Let me clarify. మీరు చెప్పే దాంట్లో నాకే మీరు ఆపాదిస్తున్నారు. మీరు ఒక్కళ్లే అడిగితే ఇచ్చే వాడిని. అక్కడ చాలా మంది సభ్యులు అడుగుతున్నారు కాబట్టి, అడుగుతున్న వారికి ఎవరికో ఒకరికి ఇవ్వాలి కాబట్టి, సీనియర్ మెంబర్‌కి ఎవరికైనా అవకాశమిస్తే అప్పీల్ చేస్తారనే ఉద్దేశంతో గోపాలకృష్ణ రెడ్డి గారికి మాట్లాడేందుకు అవకాశం కల్పించాము.

శ్రీ ధూళిపాళ్ల నరేందర్ కుమార్ః స్పీకర్ సార్, అది మీ విజ్ఞతకు సంబంధించిన విషయం కాబట్టి, మీకే వదిలేస్తున్నాను. ఈటెల రాజేందర్ గారు మాట్లాడుతూ వారు ప్రారంభించిన స్పీచ్ చాలా విశాల హృదయమని, మాకందరికీ, లేకపోతే కొంతమందికి సంకుచిత మనస్తత్వాలున్నాయనో, స్వార్థప్రయోజనాల నో, రకరకాలుగా లేకుండా ఉండాలని చెప్పారు. కానీ, మాటల్లో ఆయన చెబుతున్నారు. వాళ్ల సభ్యుల యొక్క ప్రవర్తన తీరు ఏదైతే ఉందో దాన్ని సభ ఖండించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే వాళ్లు కావొచ్చు, రేపు ఇంకొకరు కావొచ్చు. ఈ సభ ఆవరణలో ఎన్నో సంఘటనలు జరిగాయి. ఎవరైతే సభ్యులు, అక్కడున్న వారి మనోభావాలకు వ్యతిరేకంగా మాట్లాడిన సందర్భాల్లో దాడులు జరిగిన సందర్భాలున్నాయనే విషయం మీకూ, మాకూ, సభలో ఉన్న అందరికీ తెలుసు.

అటువంటి సందర్భాలలో ఇది సామాన్యమైన అంశం కాదు. ఏవిధంగా వారి ప్రాంత ప్రజలకు మనోభావాలున్నాయో, కచ్చితంగా మాక్కూడా, మా ప్రాంత ప్రజలకు సంబంధించిన మనోభావాల్ని, మా ప్రాంత ప్రజల ఆకాంక్షల్ని కూడా సభలో చెప్పాల్సిన అవసరం గాని, సభలో వినిపించాల్సిన బాధ్యత గానీ మాపైన ఉంది. కచ్చితంగా వారు ఏవిధంగా ఈ రాష్ట్రాన్ని విడిపోవాలని కోరుకుంటున్నారో, అదే విధంగా ఈ రాష్ట్రం సమైక్యంగా ఎందుకు ఉండాలి, సమైక్యంగా ఉండాల్సిన అవసరం ఏమిటని వివరించాల్సిన బాధ్యత, హక్కులు మాకున్నాయి. ఈ రోజు వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు గారు ఆమరణ దీక్షను గాని, వారి మరణాన్ని కూడా వక్రీకరించే పరిస్థితిలో మాట్లాడారు. మేం మాట్లాడినప్పుడు ఏవిధంగా, ఏంటి అనేది..

మ. 12.20

వాళ్లు చెప్పిన ఇడ్లీ, సాంబారు ఉద్యమం ఎందుకొచ్చింది? దానికి ఎవరు కారకులు? ఇవన్నీ మేం మాట్లాడేటప్పుడు చెబుతాము. చరిత్రను, వాస్తవాలను ఏ విధంగా వక్రీకరిస్తున్నారో మాకు సమయం ఇచ్చినపుడు మేం మాట్లాడతాం. ఈ సభలో సభ్యులుగా ఉన్న శ్రీ జైపాల్‌రెడ్డిగారూ కూడా ఏం మాట్లాడారో చెబుతాం.

MR DEPUTY SPEAKER: You are responsible. Please make an appeal.

శ్రీ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ః మేం మీకు అపీల్ చేసేదొక్కటే. గతంలో సభ్యులమీద దాడి చేసిన సంఘటనలున్నాయి. ఇప్పుడు ఈ సభ సాక్షిగా కొంతమంది సభ్యులు వారి మనోభావాలు, అభిప్రాయాలు చెప్పే ప్రయత్నంలో కొంతమంది సభ్యులు సీనియర్ లెజిస్లేటర్లలాంటి వాళ్ల దగ్గరకెళ్లి చొక్కాలు పట్టుకోవడమో, దాడిచేసే ప్రయత్నం చేయటమో మంచిది కాదు. దీనిని సభ ఖండించాల్సిన అవసరముంది. మీరు సభ్యులకు రక్షణగా రావల్సిన అవసరముంది. ఇటువంటి క్లిష్టమైన పరిస్థితుల్లో మీరు మా హక్కులు కాపాడాల్సిన అవసరముందని తెలియజేస్తున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః రాజేందర్ గారూ మాట్లాడండి.

శ్రీ ఈటెల రాజేందర్ః అధ్యక్షా, పదే పదే సభను తప్పుదోవ పట్టిస్తున్నానని అంటున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములుగారు 1952వ సంవత్సరం అక్టోబరు 19వ తేదీ నుండి ఆమరణ దీక్ష చేశారు. డిసెంబరు 15వ తేదీనాడు చనిపోయారని చెప్పాను. ఆంధ్ర రాష్ట్రం 1953వ సంవత్సరం అక్టోబరు నెలలో ఏర్పడిందని చెప్పాను. అందులో తప్పేముందని అంటున్నాను. నేను మొదటే మనవి చేశాను, మీరు (తెలుగుదేశం పార్టీ సభ్యులనుద్దేశించి) గంట కాకపోతే ఐదు గంటలు మాట్లా డుకోండి, మేము అడ్డమొస్తే అడగండి. కానీ మాట్లాడుకునే సంప్రదాయానికి కూడా మీరు అడ్డుకునే ప్రయత్నం చేసి సభ్యుల హక్కులను మీరు కాలరాస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ యొక్క చరిత్ర గత పది సంవత్సరాలుగా మీకు తెలుసు. 1985వ సంవత్సరంలో స్వర్గీయ ఎన్.టి. రామారావుగారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. వారు “జయ భారత రెడ్డి” కమిటీ వేసి, తెలంగాణ ఉద్యోగులు, తెలంగాణ విద్యార్థి లోకం ఎందుకు ఆందోళన చేస్తున్నారో తెలుసుకోవాలని కమిటీ వేసి, సరిచేయాలని భావించారు. మరోసారి 1969వ సంవత్సరం నాటి ఉద్యమం వచ్చే ఆస్కారం ఉందని మొట్టమొదటిసారిగా ఆ మహనీయుడు 610 జీ.ఓ. ఇచ్చారు. అధ్యక్షా 610 జీ.ఓ. గురించి మీకు కూడా తెలుసు. ఈ 610 జీ.ఓ. ఇచ్చిన తేదీ నాటి నుంచి అమలుకాని సందర్భంలో, సమైక్య రాష్ట్రంలో అమలు జరగదు కాబట్టి మళ్లీ దానిమీద శ్రీ రేవూరి ప్రకాష్‌రెడ్డి గారి అధ్యక్షతన ఒక కమిటీ వేసారు. 2003వ సంవత్సరం మార్చి 21వ తేదీనాడు శ్రీ రేవూరి ప్రకాష్‌రెడ్డి కమిటీ రిపోర్టు కూడా ఇచ్చింది. దాని తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీ ఎం. సత్యన్నారాయణ రావు (MSR) గారి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం నియమించారు. దాని తర్వాత మళ్లీ 2005వ సంవత్సరం ఏప్రిల్ 12వ తేదీనాడు అధికారులతో కమిటీ కూడా వేశారు. అదేవిధంగా 2004వ సంవత్సరం సెప్టెంబరు 30వ తేదీన గిర్‌గ్లానీ గారు 750 పేజీలతో ఒక రిపోర్టు ఇచ్చారు. దాని తర్వాత మళ్లీ ఒక మంత్రివర్గ ఉప సంఘాన్ని వేశారు. ఇవాళ చివరకు ఉన్నవారు శ్రీ ఉత్తమకుమార్‌రెడ్డిగారు కావొచ్చు. ఎందుకు చెబుతున్నానంటే ఇదంతా మా ఆవేదన, దుఃఖం, ఈ సమైక్య రాష్ట్రంలో మీరిచ్చిన జీ.ఓ.లు కూడా చిత్తు కాగితాలు కంటే అధ్వానంగా తయారైందని చెప్ప డానికి మాత్రమే ఈ ప్రయత్నం తప్ప మరొకటి కాదు. జైపాల్‌రెడ్డి కమిటీ ఆరోజు ఏం తేల్చింది? 58,962 ఉద్యోగాలు అక్రమంగా నియమించిన విషయం వాస్తవం కాదా అని అడుగుతున్నాను. అంతేకాదు, మొన్న సకల జనుల సమ్మె జరుగుతున్న సందర్భంలో, ప్రభుత్వం సచివాలయంలో ఏం

ప్రకటించింది? 90 శాతం, 92 శాతం మంది హాజరయ్యారని ఈ ప్రభుత్వం ప్రకటించింది. ఆరోజే చెప్పాము అధ్యక్షా, నిజమే, సచివాలయంలో మాకు రావల్సిన ఫెయిర్ షేర్ 40 శాతం రాలేదు. దాన్ని అక్రమంగా ఆక్రమించుకున్నారు కాబట్టే ఈరోజు మీకు 90 శాతం మంది హాజరవుతున్నారని చెబుతున్నారు. ఆరోజు స్పష్టంగా చెప్పారు. అనేక ఉల్లంఘనలు జరిగిన మాట వాస్తవం. ఇవ్వాళ రాష్ట్రం వ్యాప్తంగా ఉన్న కార్పోరేషన్లలో, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్లలో మనం నిర్దేశించుకోకపోయినప్పటికి కూడా ఒక అంగీకారం మాత్రం కుదిరింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పోరేషన్లలోనూ, డిపార్ట్‌మెంట్లలోనూ తప్పకుండా జనాభా ప్రాతిపదికపైన ఫెయిర్ షేర్ ఉండాలని నిర్దేశించుకోవడం జరిగింది. ఇవన్నీ ఎక్కడా అమలు కాలేదు. అమలు కాకపోవడం వల్లనే ఇవ్వాళ ఉద్యమాలు వచ్చాయనే విషయం మనం మర్చిపోవద్దు. ఇదే సభలో స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చాలాసార్లు మేము డిమాండ్ చేశాం. ఈ సభ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర సమితి వందసార్లయినా 610 జీ.ఓ అమలుచేయమని కోరడం జరిగింది. ఈరోజు 610 జీ.ఓను అమలుచేయని ఈ సభ, 610 జీ.ఓను అమలుచేయని వీరు ఈ సమైక్య రాష్ట్రం కలిసి ఉండాలని కోరే నైతికత వీరికి ఎక్కడుందో ఒకసారి మీ అంతరాత్మను పరిశీలించుకోమని కోరుతున్నాను. తెలంగాణ ఉద్యమానికి ట్యాగ్‌లైన్, నియామకాలు, నీరు, నిధులే మా అజెండా. తెలంగాణ, హైదరాబాదు రాష్ట్రం, ఆంధ్ర రాష్ట్రంలో కలిసే నాటికే మాకు 12 లక్షల ఎకరాలకు నీరందించే చరిత్ర ఉంది. కాకతీయుల కాలం నాటి చెరువులు, అసఫ్‌జాహీలు, కుతుబ్‌షాహీలు తెలంగాణ ప్రాంతంలో కొన్ని వేలాది చెరువులు తవ్వి తెలంగాణ రైతాంగానికి, పంట పొలాలకు నీరందించినటువంటి గొప్ప ఘన కీర్తి తెలంగాణ గడ్డది అని మీకు తెలుసు. మీతో కలిసిన తర్వాత ఈ రాష్ట్రం సమున్నతంగా అభివృద్ధి చెందిందని భావిస్తున్నారు. అభివృద్ధి కాదు కదా ఇవాళ మా పంట పొలాలకు నీరు రాకుండా చేసి మా రైతుల ఆత్మహత్యలకు కారణమైన విషయం సత్యం కాదా అని నేడు ప్రశ్నిస్తున్నాను. ఇవాళ మనం పదే పదే అబద్ధాలను ప్రచారం చేసినంతమాత్రాన, మీరు ప్రవచించిన మాత్రాన అబద్ధాలు నిజం కావనే సత్యాన్ని గుర్తు పెట్టుకోమని మాత్రమే తమరికి విజ్ఞప్తి చేస్తున్నాను. రెండు జీవనదులు ఒకటి కృష్ణా, రెండు గోదావరి. ఒకటి తలీటుకు పారితే ఇంకోటి కాళ్లకట్టకు పారుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే రెండు జీవ నదులు పారే రాష్ట్రం ఈ దేశంలో ఎక్కడా లేదు. కృష్ణా నది 68.5 శాతం తెలంగాణ ప్రాంతంలో పారుతుంది. అదే విధంగా గోదావరి నది 79 శాతం పారుతుంది. కానీ ఈరోజు కృష్ణా జలాల్లో మా actual utilization 15.4 శాతం మాత్రమే. 34.7 శాతమని ఏదైతే చెబుతున్నారో అది ఎక్కడా అమలు కాలేదు. మేము వాడుకొంటున్నది కేవలం 15.4 శాతమే. అదేవిధంగా గోదావరి జలాల విషయంలో కూడా ఇవాళ మాకు 79 శాతం ఉంటే మేం పారించుకునేది కేవలం 15.7 శాతం. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ నాగార్జున సాగర్ నిర్మాణానికి శిలాఫలకం వేశారు, ప్రాజెక్టులు కట్టారు. ఆరోజు రైట్ బ్యాంక్ కెనాల్, లెఫ్ట్ కెనాల్, 132 టి.ఎం.సీ.ల నీళ్లను కేటాయించారు. కానీ ఇవాళ మీరు ఏ కె.ఎల్.రావ్ గారినైతే గొప్పగా కీర్తిస్తున్నారో వారిని మేం కీర్తించలేకపోతున్నాము. ఎందుకంటే కె.ఎల్.రావ్ తెలంగాణ పంట పొలాలకు నీళ్లు రాకుండా కాల్వలను మళ్లించిన చరిత్ర ఉంది కాబట్టి కె.ఎల్.రావ్‌ను మేం హర్షించం. ఇవాళ మేము గుండెమీద చెయ్యేసి మిమ్మల్ని లెక్కలను అడుగుతున్నాం. రైట్ బ్యాంక్ కెనాల్ కింద మేము నిర్దే

శించుకున్న 132 టి.ఎం.సీ.ల నీళ్లను ఎత్తుకుపోయి 15 లక్షల ఎకరాలకు నీళ్లు పారుతున్న మాట వాస్తవం కాదా? ఇవాళ నాగార్జునసాగర్ లెఫ్ట్ బ్యాంక్ కెనాల్‌లో మునిగిన పంట పొలాలు నల్గొండలో ఉంటే, త్రాగే నీళ్లకు నోచుకోలేక ఫ్లోరైడ్ బాధతో ఈ దేశంలో తల దించుకొనే పద్ధతిలో వేలాదిమంది నడుములు వంకరపోయి, కాళ్లు వంకరపోయి అనాధలుగా మిగిలిన జిల్లా ఈ నల్గొండ. స్పీకర్ గారు కూడా వెళ్లి చూసి వచ్చారు. అలాంటి జిల్లాకు లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ కింద మీరు నీరిచ్చిన చరిత్ర ఏమంటే దానిని ఖమ్మం దాటించుకుని నూజివీడు వరకు పొడిగించుకుని తొమ్మిది లక్షల ఎకరాలకు నీళ్లిస్తున్నట్టు మీ రికార్డ్స్‌లో ఉంది. ఏనాడూ కూడా నల్గొండ జిల్లాలోని పంట పొలాలకు, ఖమ్మం జిల్లాలోని పంట పొలాలకు తొమ్మిది లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్టు చరిత్రలో లేదు. అదే విధంగా ఇవాళ కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరఫున రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్.డి.ఎస్.) మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు వెళ్లాం. మాకు కేటాయించిన నీళ్ల విషయంలో 97 వేల ఎకరాలకు నీళ్లు రావాలి. చివరకు మీరు చెబుతున్నట్లుగా 82,500 ఎకరాలకైనా నీరు రావాలని చెప్పాం.

మ.12.30

అధ్యక్షా, ఏనాడూ కూడా దానికి ఆ నీళ్ళు రాలేదు. చివరికి సప్లమెంటేషన్ క్రింద నీళ్ళు ఇచ్చేందుకు తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రయత్నం చేసినా కూడా నీళ్ళు రాలేదు. తెలంగాణా రైతాంగానికి, మహబూబ్‌నగర్ జిల్లాకు కృష్ణా జలాలపై హక్కు ఉన్నప్పటికీ కూడా, ఆ పంట పొలాలకు నీళ్ళు ఇవ్వాల్సిన 'జూరాల ప్రాజెక్టు, కల్వకుర్తి, నెట్టెంపాడు' వంటి పథకాలున్నప్పటికీ కూడా, నీళ్ళివ్వక పోతే, లక్షలాది మంది మహబూబ్ నగర్ జిల్లా బిడ్డలు మొత్తం పొట్ట చేత పట్టుకొని, కన్న బిడ్డలనూ, కని, పెంచిన అమ్మా నాన్నలనూ వదిలి పెట్టి, కన్న గడ్డను వదిలి పెట్టి దేశ వ్యాప్తంగా కూలీ-నాలీ చేసుకున్నటువంటి చరిత్ర కాదంటారా. అధ్యక్షా, ఆనాడు ఆ పరిస్థితులు చూసి, ఆ జిల్లానే దత్తత తీసుకున్నటువంటి అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు గారు, చంద్రబాబు నాయుడు గారు ఈ విషయం మరచి పోవద్దు. వాళ్ళ పేరే పాలమూరు లేబర్. వాళ్ళ రక్త మాంసాలతోటి సంపదలు సృష్టించిన, ఈ దేశ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించిన ఆ మహబూబ్ నగర్ బిడ్డల పంట పొలాలకు నీళ్ళు రావు. అందుకే అక్కడ ఉన్నటువంటి ప్రాజెక్టులకు నీళ్ళు కేటాయించాల్సి ఉంది. ఆనాడు 2004లో టి.ఆర్.ఎస్.పార్టీ తరఫున అడిగాం 'అయ్యా, రెండు పంటలు పండించుకొని, మూడవ పంటకు నీళ్ళడిగే వాళ్ళకు నీళ్ళిచ్చే ప్రయత్నం చేయ్యొద్దు....'.

అధ్యక్షా, ఒక్క పంటకు కూడా నీళ్ళు నోచుకోలేక, బోర్లు వేసి బోర్లా పడ్డది మా తెలంగాణ. బావులు తవ్వి, బండ పడితే, బ్రతుకే బండబారిపోయిన తెలంగాణా మాది. నల్లగొండ జిల్లాలో 400ల ఫీట్లు, 500ల ఫీట్లు బోర్లు వేసి, ఆ బోర్ల అనుభవంతోటి ప్రపంచానికే బోర్లు వేసేటటువంటి జ్ఞానాన్ని నేర్పిందీ, ఆ అనుభవం నేర్పిందీ మా నల్లగొండ జిల్లా. ఇవాళ ఆఫ్రికాకు పోయినా... మా నల్లగొండ వాళ్ళే ఉంటారు, మరోచోటికి పోయినా.. మా నల్లగొండ వాళ్ళే ఉంటారు, దేశ వ్యాప్తంగా

ఎక్కడకు పోయినా మా నల్లగొండ వాళ్ళే ఉంటారు. ఈనాడు కరీంనగర్‌కు రండి, వరంగల్‌కు రండి, బావులు తవ్వే వడ్డెరలు నల్లగొండ వాసులై ఉంటారు. అంటే... నాగార్జున సాగర్ ఉన్నా... సాగు నీరుకు నోచుకోలేదు, నాగార్జున సాగర్ ఉన్నా... కనీసం త్రాగు నీటికి నోచుకోలేని చరిత్ర మా నల్లగొండ జిల్లాది. అందుకే మేము ఆనాడు 'అయ్యా, నడుములు వంకర పోయిన బిడ్డలున్న నల్లగొండ జిల్లాకి నీళ్ళిచ్చే ప్రయత్నం చేయండి, ఒక్క పంట కూడా పండకుండా, ఆత్మహత్యలు చేసుకుంటున్నటువంటి బిడ్డలున్న తెలంగాణాకు నీళ్ళివ్వమని' అడిగితే, 'జలయజ్ఞం' అని మొదలు పెట్టింది ఈ ప్రభుత్వమేగదా. మీరూ, మేమూ శాసన సభలో ఉన్నాం. ఆ జలయజ్ఞంలో ఏమి తవ్వుకున్నాం. మళ్ళీ మీరు కట్టుకున్నది 'పులిచింతల'నే కదా. మళ్ళీ మీరు తవ్వుకున్నది 'పోతిరెడ్డిపాడు'నే కదా.

తెలంగాణా ప్రాంతానికి ఉన్న ఏకైక జీవనది మీద ఉన్నటువంటి శ్రీరాం సాగర్ ప్రాజెక్టు. మా బ్రతుకు ప్రాజెక్టు అని చెప్పాం. మేము ఆ రోజు ప్రశ్నిస్తే 14లక్షల 40వేల ఎకరాలకు నీళ్ళిస్తున్నామని చెప్పి (ఆన్ రికార్డ్) శ్రీ పొన్నాల లక్ష్మయ్య గారు చెప్పారు. ఒకవేళ 14లక్షల 40వేల ఎకరాలకు గనుక నీళ్ళిచ్చి ఉండుంటే, ఇక్కడే ఉరేసుకుని చచ్చిపోతానని నేను ఆ రోజు ఛాలెంజ్ చేశాను. ఏ నాడూ నీళ్ళివ్వలేదు. నల్లగొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో శ్రీ రాజశేఖర రెడ్డి గారు నీళ్ళు విడుదలచేసి, ఖమ్మం జిల్లా వరకు నీళ్ళిస్తామని చెప్పిన చరిత్ర తప్ప, ఏనాడూ మీరు నీళ్ళిచ్చిన పాపాన పోలేదు. స్టేజ్-1 కే నీళ్ళు రావు. నాది కరీంనగర్ జిల్లా. నా కరీంనగర్ జిల్లా దాటి వరంగల్ జిల్లాకు ఇంతవరకు నీళ్ళు పోలేదు. వరంగల్ జిల్లా రైతాంగం అనేక సార్లు 'అయ్యా, మీరు టి.ఆర్.ఎస్. పార్టీ ఎం.ఎల్.ఏ.లు, మొత్తం తెలంగాణా పది జిల్లాల గురించి చూడాల్సిన మీరు, ఇవాళ వరంగల్ రైతాంగానికి సాగు నీళ్ళు కాదు కదా కనీసం వరంగల్ పట్టణానికి త్రాగు నీళ్ళైనా ఇస్తారా?' అని అడిగిన సందర్భాలున్నాయి.

గోదావరి నదిపై 1963లో మొదలైన శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు, 2013 నాటికి గడచిన 50 సంవత్సరాల చరిత్రలో నేటికి కూడా పూర్తి స్థాయిలో నీళ్ళు రాక, ఆ ఎస్.ఆర్.ఎస్.పి. కాలువల్లో పల్లేళ్ళు మొలిచాయి, జిల్లేళ్ళు మొలిచాయి, నేను చూపిస్తాను అధ్యక్షా, ఆ కాలువల్లో తుమ్మలు మొలిచాయి. 'ఇందుకేనా సమైక్య రాష్ట్రంలో కలిసుండాలని మీరు కోరేది? తెలంగాణా రైతాంగం కళ్ళల్లో మట్టి కొట్టడానికేనా మీరు కలిసుండాలని కోరేది?' అని తెలంగాణా రైతాంగం అడుగుతోంది. మీరు ఏం చేశారు? అదే గోదావరి నది మీద మళ్ళీ 'పోలవరం' కట్టుకునే ప్రయత్నం చేశారు. ఇవాళ 'కాంతాలపల్లి' ఉన్నప్పటికీ, 'టెయిల్ పాండ్' ఉన్నప్పటికీ, 'దుమ్ముగూడెం' ఉన్నప్పటికీ, ఇవాళ అంతకంటే పెద్ద ప్రాజెక్టులు గ్రావిటీ ద్వారా వచ్చేటువంటి ఆస్కారం ఉన్నప్పటికీ కూడా ఆ ప్రాజెక్టులు కట్టే ప్రయత్నం చేయలేదు. మాకు లిఫ్టులు, నీళ్ళ థెఫ్ట్‌లు ఆంధ్ర ప్రాంతానికి. సమైక్య రాష్ట్రంలో కలిసి ఉన్న పాపానికి, ఇవాళ మా నీళ్ళ వాటాని కోల్పోయింది మా తెలంగాణ. అందుకే ఇవాళ తెలంగాణా రైతాంగం అంతా కూడా, సమైక్య రాష్ట్రంలో పంట పొలాలకు నీళ్ళు రావని అర్థమైన తరువాతనే, తెలంగాణా ఉద్యమంలో జెండా పట్టిన విషయాన్ని మీరు మరచిపోవద్దు.

జలయజ్ఞంలో అధ్యక్షా, శ్రీ ఎన్.టి.రామారావు వచ్చిన తరువాత 'తెలుగు గంగ ప్రాజెక్టు' మొదలైంది. అది పూర్తి స్థాయిలో కట్టబడని..., 450 కి.మీ.ల కాలువలను త్రవ్వుకొని మద్రాసుకు నీళ్ళివ్వడానికి మీకు చేతులు వచ్చాయి. కానీ, సొంత రాష్ట్రంలో ఉన్న రైతాంగానికి సాగు నీళ్ళ కోసం, త్రాగు నీళ్ళ కోసం ఇవ్వడానికి మాత్రం మీకు చేతులు రాని మాట వాస్తవం కాదా అని అడుగుతున్నాను. ఇవాళ మీరు జలయజ్ఞంలో కట్టుకున్నది 'పులిచింతల'. జలయజ్ఞంలో పర్మిషన్ లేకపోయినప్పటికీ కూడా, ఆఘమేఘాల మీద కాలువలు మీరు త్రవ్వుకొని, గోదావరి నీటిని పూర్తిస్థాయిలో తరలించుకు పోయేటటువంటి కుట్ర, గోదావరి నీళ్ళని సీమాంధ్రకు తరలించుకు పోయేటువంటి కుట్ర, ఆ గోదావరి నది నీళ్ళని కృష్ణా నదికి తరలించుకు పోయేటువంటి దుర్మార్గమైన కుట్ర చేసిన మాట వాస్తవం కాదా.

దేనికైనా కొన్ని పద్ధతులుంటాయి. జలాల విషయంలో సి.డబ్ల్యు.సి. ఉంటుంది. ఒక నదిని నాలుగు దేశాలు పంచుకుంటున్నటువంటి చరిత్ర ఉంది. ఒక ప్రాజెక్టుని మూడు-మూడు రాష్ట్రాలు పంచుకుంటున్నటువంటి చరిత్ర ఉన్నది. ఇవాళ మనం చూస్తూ ఉన్నాం 'బాక్రానంగల్ ప్రాజెక్ట్'. పోతిరెడ్డిపాడు కాలువలో మీకు హక్కు లేదని మీరు ఏనాడైనా చెప్పారా? మీకు హక్కు లేదు. మీది 'పెన్నా' బేసిన్‌లో ఉన్న ప్రాంతం. మీకు ఈ కృష్ణా నదీ జలాల మీద కొద్ది ప్రాంతమైన కర్నూలు ప్రాంతానికి మాత్రమే ఎలిజిబిలిటీ ఉన్నది తప్ప, మిగతా ప్రాంతానికి ఎలిజిబిలిటీ లేకపోయినప్పటికీ, అ'పోతిరెడ్డిపాడు' కాలువ ద్వారా 44వేల క్యూసెక్కులు, వరద జలాల పేరిట, దానిని ఎఫ్.ఆర్.ఎల్.లెవల్ కంటే కూడా క్రిందికి దించి 225టి.ఎం.సి.ల నీళ్ళని, 45 రోజుల్లో తీసుకునిపోయే కుట్రకు తెరలేపారు. చివరికి మీరు మా చెరువులను ప్రక్కకు నెట్టి, మా కుంటలను ప్రక్కకు నెట్టి, మా మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులను కూడా ప్రక్కకు నెట్టి, మొత్తం నాశనం చేసి, తెలంగాణా రైతాంగాన్ని వ్యవసాయం చేయకుండా బిచ్చగాళ్ళగా మార్చి, ఇవాళ మీరు తెల్ల రేషన్ కార్డులిచ్చి బ్రతికిస్తున్న విషయం వాస్తవం కాదా అని అడుగుతున్నాను. అందుకనే ఇవాళ సమైక్య రాష్ట్రం అంటేనే మా నీళ్ళు కోల్పోవడమే కదా అని అడుగుతున్నారు అధ్యక్షా.

అధ్యక్షా, ఎలక్ట్రిసిటీ గురించి. ముఖ్యమంత్రి గారూ మీకు కరెంటు ఎలా వస్తోంది? 'సొమ్ము మాది-సోకు మీదా?' అని ఈ సభలో ప్రశ్నించాం. ఎక్కడ కరెంటు ఉత్పత్తి కేంద్రాలు వస్తాయి? కరెంటు ఉత్పత్తి కేంద్రాలు రెండు చోట్ల వస్తాయి. ఒకటి వనరులు లభ్యత ఉన్న దగ్గర, రెండు ఉపయోగం ఉన్న దగ్గర. 55శాతం కరెంటు ఉపయోగం తెలంగాణా ప్రాంతంలో ఉంటుందని మీరు చెప్పారు. కానీ, ఇవాళ 33శాతం కూడా ప్రొడక్షన్ లేదు. తెలంగాణా రాష్ట్ర సమితి, 'రామగుండం'లో లక్ష దీపాలతో ఊరేగింపు చేసి, శ్రీ రాజశేఖర రెడ్డి గారికి మెమోరెండం ఇచ్చింది. అధ్యక్షా, తట్టెడు బొగ్గు కూడా రాయలసీమలో దొరకదు. తట్టెడు బొగ్గు కూడా కోస్తా ప్రాంతంలో దొరకదు. బొగ్గు దొరికేది ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో. బొగ్గు దొరికేది వరంగల్‌లో, బొగ్గు దొరికేది కరీంనగర్‌లో, బొగ్గు దొరికేది ఆదిలాబాద్‌లో... కానీ, మా బొగ్గుతో మీరు సోకులు చేస్తున్నారు.

మీరు ఆనాడు రామగుండంలో, జెన్‌కో ఆధ్వర్యంలో కరెంటు ఉత్పత్తి చేసి వుంటే, ఈ కష్టాలు వచ్చేవికావని మీకు ఆ నాడు గుర్తు చేస్తే, మీరు ఎన్.టి.పి.సి.కి ఇచ్చారు. ఇవాళ 2600 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి చేస్తే, మీ తెలంగాణా ప్రాంతానికి వచ్చే వాటా కేవలం 840 మెగావాట్లు మాత్రమే అన్నారు. అయితే 'సింహాద్రి'లో ఎన్.టి.పి.సి. ఆధ్వర్యంలో మీరు కట్టుకున్న పవర్ పాయింట్ నూటికి నూరు శాతం ఆ ప్రాంతానికే ఉపయోగపడేట్టు మీరు పర్మిషన్లు తెచ్చిన మాట వాస్తవం కాదా అధ్యక్షా. రాయలసీమలో బొగ్గు లేకపోయినా, రాయలసీమలో నీళ్ళు లేకపోయినా ఆర్.టి.పి.పి. కట్టుకొని ఇవ్వాల్టికి కూడా 600 మెగా వాట్లకు విద్యుత్ కేంద్రాన్ని విస్తరించుకుంటున్నారు కదా. మా ప్రాంతంలో బొగ్గు దొరికేటువంటి వరంగల్ జిల్లాకు విద్యుత్ కేంద్రాన్ని ఇవ్వమని మేము అడిగాం, మా బొగ్గు దొరికే 'సత్తుపల్లి'కి అన్ని అనుమతులు ఉన్నప్పటికీ కూడా అక్కడ పెట్టకుండా, మీరు నిర్లక్ష్యం చేయలేదా?

మ.12.40

ఇవాళ 16,613 మెగావాట్లు అయితే, హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ తీసేస్తే కేవలం తెలంగాణ ప్రాంతానికి 3332 మెగావాట్లు మాత్రమే ఉంది. అంటే 20 శాతం కూడా లేదు. అందుకే తెలంగాణ రైతాంగం బోర్లు, బావులపై ఆధారపడ్డారు. కరెంటు లేకుంటే వారు సాగు చేయలేరు, వారి బ్రతుకు నడవదు. తెలంగాణ ప్రాంతంలో విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల కోసం అనేకసార్లు డిమాండ్ చేశాం. అయినా ఉత్పత్తి కేంద్రాలు పెట్టలేదు. లక్ష దీపాలతో ఊరేగింపు చేసి, బీపిఎల్ పవర్ హౌస్‌కు భూమి కేటాయించబడిందని, అన్ని అనుమతులు వచ్చాయని దయచేసి 1000 మెగావాట్లు కేటాయించాలని అడిగాం. సమైక్యవాదాన్ని కోరే నాయకుల్లారా, సమన్యాయం, సమధర్మం అని చెప్పే వారూ, అవన్నీ నిజమైతే 1400 మెగావాట్ల గ్యాస్ ఆధారిత పవర్ ప్లాంటు పెట్టాలని మీరు శంకర్‌పల్లిలో భూమి సేకరించినది వాస్తవము కాదా? నేదనూరులో 2100 మెగావాట్లతో గ్యాస్ ఆధారిత పవర్ ప్లాంటు వస్తుందని దివంగతనేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి, శ్రీ రోశయ్య శిలాఫలకాలు వేశారు. దానికి మేము పిండప్రదానం చేస్తాం. మీ సమన్యాయం, సమధర్మం ఎక్కడుంది? మాటల్లో మాత్రమే మీ సమన్యాయం, సమధర్మం. చేతల్లో తెలంగాణ కళ్లల్లో మట్టికొట్టడం. అందుకే తెలంగాణ ప్రాంత ప్రజలు ఈ సమైక్య రాష్ట్రంలో మాకు న్యాయం జరగడం లేదంటున్నారు.

విద్య గురించి చెప్పాలంటే, రాయలసీమలో 4 జిల్లాలు ఉంటే తిరుపతి, కర్నూలు, అనంతపూర్‌లలో మూడు వైద్య కళాశాలలున్నాయి. ఆ రోజు మేమడిగాం, తెలంగాణ విద్యార్థులకు మెడికల్ సీట్లు కావాలంటే ఈ రాష్ట్రంలో ఎక్కువ డబ్బు కట్టి చేరాలే తప్ప వేరే గత్యంతరం లేదు. సమైక్య రాష్ట్రంలో ఒక్క మెడికల్ కాలేజ్ కూడా పెట్టలేదు. ఉస్మానియా వైద్య కళాశాల నిజాములు పెట్టిన కళాశాల, గాంధీ వైద్య కళాశాల బూర్గుల రామకృష్ణా రావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పెట్టింది. కాకతీయ వైద్య కళాశాలను కొద్దిమంది సొసైటీ క్రింద ఏర్పాటు చేసుకుంటే దాన్ని ప్రభుత్వం స్వాధీనపరచుకుంది. 56 సంవత్సరాల చరిత్రలో ఈ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో ఒక్క వైద్య కళాశాల కూడా రాలేదు.

మా పిల్లలు డాక్టర్లు కావద్దా, మా పిల్లలకు ప్రభుత్వ వైద్య సీట్లు వద్దా! మేము ఏం పాపం చేశామని, ఆ రోజు ముఖ్యమంత్రి సమన్యాయం, సమధర్మమని కడపలో ఒక వైద్య కళాశాలను మంజూరు చేశారు. తెలంగాణ ప్రాంతం అదిలాబాదులో ఒక వైద్య కళాశాలను మంజూరు చేశారు. ఆ రోజే కడపలో రిమ్స్ ఇచ్చి రూ.310 కోట్లతో భవనాలు కట్టుకున్న సందర్భాన్ని ఇప్పటికీ మర్చిపోము. అదిలాబాదు వైద్య కళాశాలకు అప్పుడప్పుడు కొద్దికొద్దిగా నిధులు మంజూరు చేసి కడుతున్నారు. సమైక్య రాష్ట్రంలో 5 వైద్య కళాశాలలుంటే తెలంగాణలో 10 జిల్లాలు ఉంటే, నిజామాబాదులో ఇచ్చినప్పటికి కూడా తెలంగాణలో రెండు మాత్రమే ఇప్పుడొచ్చాయి. ఇవి కూడా డిమాండు చేస్తే వచ్చాయి. అప్పుడు ముఖ్యమంత్రి గారిని అడిగాము తెలంగాణ ప్రాంతం వెనుకబడలేదు, వెనుకబడే ప్రాంతం. అన్ని రకాల సిరిసంపదలున్నప్పటికి కూడా 'అల్లుడి నోట్లో శని ఉన్న' చందంగా సమైక్య రాష్ట్రంలో మేము ఉన్నందున ఆ రోజు మేము అడిగాం. అందుకే ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే మొట్టమొదట కావలసింది విద్య అని తెలంగాణ రాష్ట్ర సమితి కోరింది. మీకు నాలుగు జిల్లాలకు రెండు విశ్వవిద్యాలయాలు ఉంటే మాకు రెండే రెండు ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలున్నాయి. తెలంగాణ ప్రాంతంలో పది జిల్లాలున్నాయి, ఐదు విశ్వవిద్యాలయాలు మంజూరు చేయమంటే కడపలో యోగివేమన విశ్వవిద్యాలయం మంజూరయ్యింది. రూ.120 కోట్లతో కట్టుకొని, అన్ని కోర్సులు పెట్టారు. తెలంగాణ ప్రాంతంలో తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాదు జిల్లాలో డిచ్‌పల్లి మంజూరయ్యింది. కరీంనగర్‌లో శాతవాహన విశ్వవిద్యాలయానికి ఎస్.ఆర్.ఎస్.పి. కోసం కట్టబడ్డ కూలిపోయే క్వార్టర్లు కేటాయించి వాటిలో మా పిల్లలు తేళ్ళు, పాములతో సహవాసం చేస్తూ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని చెపితే రూ.12 కోట్లు మంజూరు చేసారు. ఇవాళ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రశ్నిస్తే నాలుగు విశ్వవిద్యాలయాలు వచ్చాయి. మహబుబ్‌నగర్ జిల్లాలో పాలమూరు విశ్వవిద్యాలయం, నల్గొండ జిల్లాలో మహాత్మాగాంధి విశ్వవిద్యాలయం, శాతవాహన విశ్వవిద్యాలయం మరియు తెలంగాణ విశ్వవిద్యాలయం. వీటిని ఎన్నో ప్రయత్నాలు చేస్తే గాని సాధించుకోలేదు. ఇప్పటికి కూడా తెలంగాణ పది జిల్లాలలో ఆరు విశ్వవిద్యాలయాలున్నాయి, ఇంకా నాలుగు రావాలి. పిల్లలు ఎంబిఏ, ఎంసీఏ, ఎంకాం చదవాలంటే ప్రతి సంవత్సరం రూ.70,000/-, రూ.1,00,000/- కావాలి. తల్లిదండ్రులు భూములు అమ్ముకొని లేదా తల్లి పుస్తెలమ్ముకొని చదివించుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఉంది. ఈ రోజు సమైక్య రాష్ట్రంలో తెలంగాణ పిల్లలకు విద్యను కూడా దూరం చేశారు. ఉద్యోగాల విషయంలోనైతే చెప్పనక్కర లేదు. పరిశ్రమల విషయంలో, ఒకనాడు నిజాం నవాబు నియంతృత్వం ఉంటే ఉండొచ్చు కాని ప్రజల క్షేమమే ధ్యేయంగా పనిచేశారు. డి.బి.ఆర్. మిల్స్, అంతర్గాల స్పిన్నింగ్ మిల్స్, సర్‌సిల్క్ కంపెనీ, రిపబ్లికన్ ఫోర్జ్ కంపెనీ, ఐడిపిఎల్ కంపెనీ, ప్రాగా టూల్స్, నిజాం షుగర్ ఫ్యాక్టరీ, అజాంజాహీ మిల్స్ మొదలైన వంద కంపెనీలు స్థాపించారు. మా ఊళ్లల్లో ఒక సామెత ఉంది, వాడు ఏమి చేస్తున్నాడు అంటే తాత, తండ్రి సంపాదించింది అమ్ముకొని షోకులు చేస్తున్నారంటారు. వీరంతా ఏమి చేశారంటే మా కంపెనీల, మా ఫ్యాక్టరీలను, భూములను అమ్ముకొని మీరు ఖర్చుపెట్టుకున్నారు. మెదక్ జిల్లా సిద్ధిపేట ఎంఎల్ఏ టీ. హరీశ్ రావు గారు, నేను వెళ్లి ముఖ్యమంత్రి గారిని డిమాండ్

చేశాం. అయ్యా, మీరు మా దగ్గర అమ్ముకున్న భూముల సొమ్ము నుండి కనీసం పది శాతమైనా మా ప్రాంతానికి ఖర్చుపెట్టండి. ఈ నిధులను ఆంధ్రాకు తీసుకొపోవద్దని డిమాండ్ చేశాం. నిజాం షుగర్ ఫ్యాక్టరీ అమ్ముకున్ననాడు ప్రతిపక్ష హోదాలో వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు ఉండి మా ప్రభుత్వం వస్తే దీన్ని తిరిగి తీసుకుంటామన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆనాడు మంత్రిగా ఉన్నటువంటి శ్రీ రత్నాకర రావు నాయకత్వంలో ఒక కమిటీ వేస్తే ఆ కమిటీ, ఇది అన్యాయం, అక్రమం దీన్ని తప్పకుండా తిరిగితీసుకోవాలి అని రిపోర్టు ఇచ్చినమాట వాస్తవం కాదా? ఈ రాష్ట్రానికే, దేశానికే ఒక గొప్ప ఫ్యాక్టరీ నిజాం షుగర్ ఫ్యాక్టరీ. చెరకు రైతాంగాన్ని ఆదుకొని అన్నం పెట్టిన కర్మాగారం ఇది. రైతాంగానికి మంచి రేటు అందించడంలో సహకరించిన కర్మాగారం ఈ నిజాం షుగర్ ఫ్యాక్టరీ. ఆ ఫ్యాక్టరీ అమ్ముకున్న తరువాత చెరకు రైతాంగం చెరకును కాలపెట్టుకొనే ధౌర్భాగ్యానికి కారకులెవరు? ఇప్పుడున్న ప్రభుత్వం ఆ ఫ్యాక్టరీని తిరిగి తీసుకుంటామంటుందని విన్నాం. తెలంగాణలో ఉన్న ఫ్యాక్టరీలను, కంపెనీలను అమ్ముకొని షోకులు చేసుకొనే చరిత్ర సమైక్య రాష్ట్రానిదని మర్చిపోరాదు. సింగరేణి బొగ్గు గనులను ఎప్పుడో అమ్ముకొనే వారు కానీ తెలంగాణ ఉద్యమం, తెలంగాణ కార్మిక వర్గం సంఘటితంగా ఉండబట్టే తెలంగాణలో సింగరేణి బొగ్గు గనులను కాపాడుకోగలిగామన్న విషయం మర్చిపోరాదు. ఇంతకు ముందు చెప్పినట్లు 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్, వట్టి మాటలు కటిపెట్టు, గట్టి మేలు తలబెట్టవోయ్' గట్టి మేలు తలపెట్టి ఉంటే ఈ రాష్ట్రంలో వేర్పాటు ఉద్యమాలు వచ్చేవా? దర్గాలకు సంబంధించిన వేల కోట్ల రూపాయల భూములు ఎక్కడున్నాయి? ఈ రోజు హైటెక్ సిటి ప్రక్కకు వెళితే లక్షల, కోట్ల రూపాయల విలువైన భూముల్ని అప్పనంగా అనేక ఐటీ కంపెనీలకు కట్టబెట్టిన ఘనత మీది కాదా? తెలంగాణ పిల్లలకు వేల, లక్షల ఉద్యోగాలొస్తాయని, ఈ రాష్ట్రం అభివృద్ధి కావాలంటే మారో మార్గం లేదని, పూర్తి స్థాయిలో మీరు దానం చేయడం వాస్తవం కాదా? పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ ఆధ్వర్యంలో టూర్‌కు వెళ్ళి మీరు కేటాయించిన భూములను పరిశీలిస్తే ఎక్కడ కూడా ఐటీ కంపెనీలు పెట్టలేదు. మీరు చెప్పినట్లుగా లక్షల ఉద్యోగాలు కాదు కదా వేల సంఖ్యలో ఉద్యోగాలు రాని మాట వాస్తవం. మీరు చేసింది 'అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లుగా' మా సొమ్ము మీరు దానం చేసే ప్రయత్నం చేశారు. ఇప్పటి వరకు చారిత్రాత్మక ప్రదేశాలను, పార్కులను, గొప్ప గొప్ప ప్రాంతాలను వదలి పెట్టకుండా మీరు అమ్ముకునే, ధారాదత్తం చేసి, పెద్ద పెద్ద కంపెనీలకు, ఆంధ్ర పారిశ్రామిక వర్గాలకు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు తప్ప ఏనాడూ తెలంగాణ పంటపొలాలను తెలంగాణ వారికి ఇవ్వాలనే స్పృహ మాత్రం లేదు. హైదరాబాదులోని వారాసిగూడ, నామాలగుండు, అడ్డగుట్టల్లో నివసించే కార్మిక వర్గానికి వంద గజాల స్థలం ఇవ్వడానికి చేతులు రావు కదా, మీకు పూల బొకేలు ఇచ్చిన వారి మీద, టైలు కట్టుకొని వచ్చిన వారి మీద, సూటు బూటు వేసుకున్న వారి మీదే ప్రేమ తప్ప, మీ ప్రేమ అడ్డగుట్ట మురికికూపాల్లో బ్రతికే పేద ప్రజల మీద లేదనడానికి సజీవ సాక్ష్యాలు వందల్లో ఉన్న మాట వాస్తవం కాదా?

**మ.12.50**

అధ్యక్షా, ఇవ్వాళ జుడిషియరీ విషయానికొస్తే ఈ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్టమొదట హైదరాబాదులో హైకోర్టు ఉండేది. ఆనాడు జూనియర్ సివిల్ జడ్జీలుగా వున్న వారు ఈనాడు

సీనియర్ సివిల్ జడ్జీలయ్యారంటే దానికి కారణం సమైక్య రాష్ట్రం అన్న విషయం మరచిపోకూడదు. జూనియర్ సివిల్ జడ్జీల విషయానికొస్తే మొత్తం 436 మంది అయితే అందులో ఆంధ్రకు 307 మంది వుంటే , తెలంగాణాకు 129 మంది మాత్రమే వున్నారు. అంటే మా వాటా 29 శాతం మాత్రమే అయితే వాళ్ల వాటా 71 శాతం వున్నది. సీనియర్ సివిల్ జడ్జీలు మొత్తం 176 మందికి గాను ఆంధ్రకు 139 మంది కాగా తెలంగాణాకు 36 మంది మాత్రమే వున్నారు. మా వాటా 21 శాతం వాళ్ల వాటా 79 శాతం . ఇవ్వాళ అడ్వకేట్లు పార్లమెంటు గోడలను ముట్టడిస్తామని చెప్పి ఉద్యమాలు చేస్తామని చెబుతున్నారంటే, ఉస్మానియా క్యాంపస్‌లో మా అడ్వకేట్లు జేఏసీ ఉద్యమాన్ని రగిలిస్తున్నారంటే, హైదరాబాదు నగరంలో మా అడ్వకేట్లు ఇవ్వాళ తెలంగాణా రాష్ట్రం ఏర్పాటయ్యేంత వరకు నిద్రపోకుండా వున్నామని చెబుతున్నారంటే దాని కారణం ఇవన్నీ అధ్యక్షా. మా జడ్జీల చేత మీరు ప్రమాణ స్వీకారం చేయించి మా ఆత్మగౌరవాన్ని మొట్టమొదట కించపరిచారు కాబట్టి, మా పోస్టులను మాకు రాకుండా మా కళ్లల్లో మట్టి కొడుతున్నారు కాబట్టే అని తెలియజేస్తున్నాను.

మేము ఆనాటి ముఖ్యమంత్రి గారినడిగాం..... అయ్యా రాజశేఖర రెడ్డి గారూ, 56 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో తెలంగాణా నుంచి ఒక్క అడ్వకేట్ జనరల్ కూడా లేరు కాబట్టి ఇవ్వండని అడిగితే వారిచ్చిన ఆన్సరేమంటే... అయ్యా అడ్వకేట్ జనరల్ పోస్ట్ అనేది చాలా ఉన్నతమైనది, చాలా గొప్పది, అన్నిటికంటే ముఖ్యంగా అది ప్రభుత్వానికి మిక్కిలి కాన్ఫిడెన్షియల్ పోస్ట్ అని చెప్పారు. చెప్పి చెప్పి చివరికి విసిగిపోయిన తరువాత చివరికి ఈ 56 సంవత్సరాల చరిత్రలో ఈ ముఖ్యమంత్రి గారి క్లాస్ మేట్ కనుక మా తెలంగాణాకు సంబంధించిన జగిత్యాల బిడ్డకు అడ్వకేట్ జనరల్ పోస్ట్ దక్కింది. 56 సంవత్సరాల చరిత్రలో మీరు ఒక్కనాడైనా మా తెలంగాణా వారికి అడ్వకేట్ జనరల్ పోస్ట్ ఇచ్చారా?

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డిః సార్, అడ్వకేట్ జనరల్ పోస్ట్ ఇవ్వలేదంటున్నారు. తెలంగాణా నుంచి నలుగురు ముఖ్యమంత్రులు అయ్యారు. వాళ్లెందుకు తెలంగాణా వారికి అడ్వకేట్ జనరల్ పోస్ట్ ఇవ్వలేదు? ఇంకొక విషయమేమంటే ప్రస్తుతమున్న అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి గారు నాతో చదువుకున్నారు తప్ప నా క్లాస్‌మేట్ కాదు. నాకంటే సీనియర్.

(తెలంగాణా రాష్ట్ర సమితి పార్టీ సభ్యులు శ్రీ టి.హరీశ్ రావు తదితరులచే అంతరాయం )

తెలంగాణా ముఖ్యమంత్రి ఈ దేశానికి ఐదేళ్లు ప్రధాన మంత్రిగా కూడా పని చేశారు. ఆ విషయం మరచిపోకండి. మీరు గెలిపించి పంపించే పరిస్థితి లేకున్నా మేమే ప్రధానమంత్రిగా గెలిపించి పంపించాం.

( ఆ సందర్భంలో తెలంగాణా రాష్ట్ర సమితి పార్టీ సభ్యులు శ్రీ టి.హరీశ్‌రావు, తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ జి.ముద్దుకృష్ణమ నాయుడు గారలు తమకు మాట్లాడడానికి అవకాశమివ్వాల్సిందిగా కోరుతూ అంత రాయం కల్పించసాగారు. )

(Interruptions from TDP Members)

Please sit down Muddukrishnama Naidu Garu.

MR.DEPUTY SPEAKER: Let us not deviate. Please co-operate with the Chair. I want to run the House. This is not the way.

(Interruptions from TDP Members)

We are deviating from the main subject.

శ్రీ ఎస్.చంద్రబాబు నాయుడు (కుప్పం): అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు పి.వి.నరసింహా రావు గారి విషయం తీసుకొచ్చారు కాబట్టి నేను ఇంటర్వీన్ కావలసి వచ్చింది. తెలుగుదేశం పార్టీగా మేము ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పో రాడుతున్నామని మీకు తెలుసు. అయితే ఒక తెలుగువాడు ప్రధానమంత్రి అవుతున్నాడన్న ఉద్దేశంతో నంద్యాలలో ఆయన ఎమ్‌పీగా పోటీ చేసినప్పుడు ఆయనకు పోటీగా అభ్యర్థిని కూడా నిలబెట్టని పార్టీ మా తెలుగు దేశం పార్టీ. అయితే మీరు కూడా ఒక విషయాన్ని ఆలోచించాలి. ఐదు సంవత్సరాలు ఆయన ప్రధాన మంత్రిగాపని చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కూడా పని చేశారు. ఎఐసిసిలో కూడా పని చేశారు. జీవితాంతం కాంగ్రెస్ పార్టీలో పని చేశారు. అంత చేసినా ఆయన చనిపోయిన తరువాత ఆయన మృత దేహాన్ని ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయానికి కూడా తీసుకెళ్లకుండా నేరుగా ఇక్కడికి తిరిగి పంపించారు. ఇంకా వినండి ... సందర్భం వచ్చింది కాబట్టి చెబుతున్నాను. ఈ రోజున ఆరు నెలలు లేదా సంవత్సరం పాటు ప్రధానమంత్రులుగా పని చేసిన వారికి కూడా ఢిల్లీలో ప్రత్యేక ఘాట్‌లు వుంటే ఐదు సంవత్సరాలు ప్రధాన మంత్రిగా పని చేసిన ఒక తెలుగు వాడికి అన్యాయం జరిగింది. దానిని నిరసించింది, ఖండించింది ఒక్క తెలుగు దేశం పార్టీ తప్ప ఈ హౌస్‌లో ఏ పార్టీ ఖండించలేదు. వీళ్లు ఇప్పుడు ఇట్లా మాట్లాడుతున్నారు. తెలుగు వారి గురించి, ఇంకో ప్రాంతం గురించి ....... ఆ విషయం ఎందుకు మాట్లాడలేదో ప్రజలు ఆలోచించాలి ..... మేం అది చేస్తాం, ఇది చేస్తాం అని కాకుండా వాస్తవాలు దృష్టిలో పెట్టుకుని మాట్లాడితే చాలా సబబుగా వుంటుంది. వారి ప్రభుత్వమే అధికారంలో వున్నప్పటికి అంత్యక్రియలు కూడా ఇక్కడ సరిగా చేయలేకపోయారు. దానిని తెలుగు వాడికి జరిగిన అన్యాయంగా మేం బాధపడుతున్నాము తప్ప ఇంకొకటి కాదని మీ దృష్టికి తీసుకొస్తున్నాను.

(తెలంగాణా రాష్ట్ర సమితి పార్టీ సభ్యులు శ్రీ టి.హరీశ్ రావు తదితరులచే అంతరాయం )

MR.DEPUTY SPEAKER: Do not deviate from the subject. Rajender Garu, please conclude. Let us not disturb the House.

శ్రీ ఈటెల రాజేందర్ః అధ్యక్షా, అశేష ప్రజానీకాన్ని మీరు గుర్తించకపోవడం దురదృష్టకం. అందుకే మేమంటున్నదేమంటే నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవ రెడ్డి గారి నుంచి నేటి ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి గారి వరకు చూస్తే జలగం వెంగళ రావు గారిని పక్కనపెట్టి తెలంగాణా వాళ్లు ముఖ్యమంత్రులుగా పని చేసింది ఇవ్వాళ ఆరు సంవత్సరాల మూడు నెలలు మాత్రమే. కావాలంటే లెక్కలు తీయమనండి. ఇవ్వాళ ఏ ఫైల్ కావాలన్నా ముఖ్యమంత్రి గారు అక్కడికే పోతున్నారు. చివరికి మీకు జరుగుతున్న న్యాయం కూడా అక్కడ నుంచే కదా? పివి. నరసింహా రావు గారు ఎన్ని సంవత్సరాలు పరిపాలించారు? చెన్నా రెడ్డి గారు మంచి పరిపాలనా దక్షులు, ఎంతో గొప్ప స్టేట్స్‌మన్ అని చెబుతారు కదా? ఆయనను ఎన్ని రోజులుంచారు? అంజయ్య గారిని ఎన్ని రోజులుంచారు? చదువు కోని వారినీ, చదువుకున్న వారినీ మీరు సక్రమంగా పని చేయించనివ్వలేకపోయారు. అందుకే మీరు ఏనాడు మా బ్రతుకులను బాగు చేసుకునే అవకాశం ఈ సమైక్య రాష్ట్రంలో మాకు కల్పించలేదు ఎందుకంటే మీరు ముఖ్య మంత్రులు కాబట్టి. 56 సంవత్సరాల తరువాత మా వాళ్లకు అడ్వకేట్ జనరల్ అయ్యే సందర్భం వచ్చింది.

మ. 1.00

ఇప్పటి వరకు హైకోర్టు జడ్జిలలో తెలంగాణా ప్రాంతానికి చెందిన వారు 40 మంది, ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు 160 మంది ఉన్నారు. జిల్లా జడ్జీలలో తెలంగాణా ప్రాంతం వారు ఆరుగురుంటే, 54 మంది ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారున్నారు. ఛైర్మన్స్, మెంబర్స్, రిజిస్ట్రార్స్‌లో అయితే లెక్కే లేదు. మీరు కూడా ఒక బంట్రోతు ఉద్యోగం కోసం ఉద్యమం చేశారని చెబుతున్నారు కదా. ఇంత దోచుకున్నా, ఉద్యమం చేయకుండా రాష్ట్రాన్ని విడగొట్టకుండా ఎలా ఉండాలి అధ్యక్షా? ఈ సభ సాక్షిగా మా ముఖ్యమంత్రిగారు కూడా అన్నారు. అన్నం దొరకక పోతే, ఉపాధి కల్పించకపోతే కన్నబిడ్డలను వదలి పెట్టి దేశం కాని దేశం దుబాయ్ వెళ్లి అక్కడ తెలంగాణా ప్రాంతం వారు చనిపోతే, చచ్చిన శవాలనైనా ఇవ్వండని టిఆర్ఎస్ పార్టీ కోరింది. వారికి ఇక్కడ ఉపాధి కల్పించలేకపోతున్నారు. బ్రతుకు దెరువు కోసం వెళ్లిన వారి కోసం కేరళ ప్రభుత్వం ఏ విధంగా కమిటీ వేసిందో, ఒక మంత్రిత్వ శాఖలో బాధ్యత ఇచ్చిందో , అటువంటి వారి కోసం కొన్ని డబ్బులు కేటాయించిందో అదే పద్ధతిలో ఇవ్వమని టిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది.

బీడీ కార్మికుల గురించి, ఆదిలాబాద్ అంటురోగాల గురించి టిఆర్ఎస్ పార్టీ ప్రశ్నించింది. చివరికి గత్యంతరం లేని పరిస్థితులలో కెసిఆర్‌గారు రాజీనామా చేసి, లాభం లేదని గ్రహించి తెలంగాణా రాష్ట్ర సమితిని ఏర్పాటు చేశారు. 1952 ఉద్యమం, 1969 ఉద్యమంలో అనుభవం . ఇవన్నీ చేసిన తరువాత కూడా నీళ్లు, నిధులు, నియామకాలు మరికొన్ని ట్యాగ్‌లని చెప్పి ఎడ్డి తెలంగాణా, గుడ్డి తెలంగాణా కాకుండా నైపుణ్యం సంతరించుకున్న వ్యూహాత్మకమైన తెలంగాణా కావాలని పార్టీ పెట్టుకోవడం జరిగింది. మనం ఈ ఉద్యమాన్ని కాపాడుకోవాలంటే గజకర్ణ, గోకర్ణ, టక్కు, టమార విద్యలు ప్రదర్శించే మీడియా ఉంటుందని, పార్టీలుంటాయని, వీటికి అందకుండా

కాపాడుకోవాలని కెసిఆర్‌గారు 2001 ఏప్రిల్ 27వ తేది నాడు టిఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేశారు. ఆయన నాయకత్వంలో కోదాడ నుండి ఆలేరు వరకు రైట్ కెనాల్ లిఫ్ట్ ప్రభుత్వం నిర్వహిస్తూంటే, లెఫ్ట్ కెనాల్ లిఫ్ట్ రైతులే ఎందుకు నిర్వహించుకోవాలి? సమైక్య రాష్ట్రంలో సమ న్యాయం ఉండాలంటే ఇక్కడ లిఫ్ట్ తెలంగాణా రైతాంగం నిర్వహించుకుంటుంది, అక్కడ లిఫ్ట్ ప్రభుత్వం ఎందుకు నిర్వహిస్తుందని ప్రశ్నించింది తెలంగాణా వారమే. ఆ రోజు మా పార్టీ గురించి రకరకాల మాటలు మాట్లాడినప్పటికీ తెలంగాణా అంతా మా పార్టీ విస్తరించింది.

డా. ఎన్. జనార్ధన్ రెడ్డిః (మైకు లేకుండా) అధ్యక్షా, అన్యాయం జరిగింది. ఎలా అన్యాయం జరిగిందో చెప్పనివ్వండి.

శ్రీ ఈటెల రాజేందర్ః నల్గొండ జిల్లాకు మన స్పీకర్‌గారు వెళ్లినప్పుడు వారి పరిస్థితులు చూసి ఇంత దారుణంగా ఉంటుందా దీనిని బాగు చేస్తానని వారు మాట ఇచ్చారు. దాని గురించి కూడా మేము ఉద్యమం చేశాము. నల్గొండ ఫ్లోరైడ్ గురించి ఉద్యమం చేశాము. జల సాధన ఉద్యమాలు చేశాము. ఈ భూమి ఈ చరిత్ర ఉన్నంత వరకు అనేక పాటలతో తెలంగాణా ప్రజానీకాన్ని ఎడ్యుకేట్ చేయడంలో , వారిని ఐక్యం చేయడంలో తెలంగాణా ఎందుకు కావాలో తెలియ చెప్పిన ఘనత కెసిఆర్ గారిదేనని చెప్పక తప్పదు.

2004లో టిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీతో జత కట్టింది. ఆ రోజు మా పార్టీ పుట్టక ముందు 2000 సంవత్సరంలో 41 మంది శాసనసభ్యులతో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డిగారు నాయకుడుగా ఉన్న సమయంలో సోనియాగాంధీగారికి ఉత్తరాలు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. 2004లో తెలంగాణా రాష్ట్ర సమితి తెలంగాణా కావాలంటే మేము ప్రకటించి ఉన్నాము, మా మ్యానిఫెస్టోలో పెట్టాము, మేము ఖచ్చితంగా ఇస్తామని చెప్పడం వల్ల కాంగ్రెస్ పార్టీతో, టిఆర్ఎస్ పార్టీ జత కట్టింది. ఆ విధంగా ఎన్నికలలో పోటీ చేసింది. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ, అక్కడ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వంలో మేము కూడా భాగస్వాములమయ్యాము. ఇక్కడ ఆరు మంత్రి పదవులు, కేంద్రంలో కెసిఆర్‌గారు, నరేంద్రగారు మంత్రులుగా ఉన్నారు. ఆనాడు కెసిఆర్‌గారికి షిప్పింగ్ పోర్ట్‌ఫోలియో ఇస్తే, డిఎమ్‌కె పార్టీ పేచి పెడితే, తాను ఢిల్లీకి వచ్చింది పోర్ట్‌ఫోలియో కోసం కాదని, తెలంగాణా కోసమని కెసిఆర్‌గారు చెప్పడం జరిగింది.

శ్రీ ఎమ్. నర్సింహులుః పోర్ట్ ఫోలియో తీసుకోవలసిన అవసరం ఎందుకు వచ్చింది?

శ్రీ ఈటెల రాజేందర్ః ఆ ఘనత టిఆర్ఎస్ పార్టీకి దక్కింది. సీట్ల కోసం కాదు, తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం, వారి బ్రతుకును బాగు చేసుకోవడం కోసమని చెప్పింది టిఆర్ఎస్ పార్టీ. ఆనాడు కెసిఆర్‌గారు ఎపి భవన్‌లో దిగ్విజయ్ సింగ్‌గారు రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా ఉన్న సమయంలో ఆయనకు టిఆర్ఎస్ పార్టీ కంప్లైంట్ చేసింది. మా పార్టీ సాక్షిగా మీరు పోలవరం, పోతిరెడ్డిపాడు,

పులిచింతల ప్రాజెక్టులు కట్టే ప్రయత్నం చేయవద్దని టిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఒకవేళ మేము మీతో కొనసాగాలంటే ఈ ప్రాజెక్టులు ఆపకపోతే మంత్రి పదవిని గడ్డి పరకలాగ వదలి వేస్తామని అల్టిమేటమ్ ఇచ్చాము.

శ్రీ ఎమ్. నర్సింహులుః తెలంగాణాలోని బాధల గురించి చెప్పండి. అది ఒక ఉద్యమం పార్టీలాగా చెప్పకండి. ౾౾ •పార్టీ మీది.

శ్రీ ఈటెల రాజేందర్ః గల్లా ఎగుర వేసుకొని చెబుతాము. దోపిడి పార్టీ, దొంగల పార్టీ మీదో, మాదో ప్రజలు తేల్చాలి. మీ చరిత్ర ఏమిటో, మా చరిత్ర ఏమిటో ప్రజా క్షేత్రంలో తేల్చుకోవాలి. ఖచ్చితంగా అక్కడే తేల్చుకుందాము. రేపు నిజంగా మా జెండా ఎగుర వేస్తామా, మీ జెండా ఎగుర వేస్తామా ఎన్నికలలో తేల్చుకుందాము.

మ.1.10

అధ్యక్షా, ఆరోజు తెలంగాణ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కెసిఆర్ యుపిఏ సర్కారు చేత తెలంగాణా రాష్ట్రం గురించి కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో పెట్టించారు. ఆ ఘనత టిఆర్ఎస్ పార్టీది. పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి చేసే ప్రసంగంలో భాగంగా ప్రత్యేక తెలంగాణా గురించి చెప్పించిన ఘనత కెసిఆర్‌ది, టిఆర్ఎస్ పార్టీది. ప్రధానమంత్రి గారు స్వయంగా ఆరోజు, యస్, మేము గతంలో ఎస్ఆర్‌సి అన్న మాట వాస్తవమే, ఈరోజు ఎస్ఆర్‌సితో సంబంధం లేదు, వేరే ప్రాంతాలతో సంబంధం లేదు తెలంగాణా రాష్ట్రం ఏర్పడవలసిందే అని ప్రకటించిన ఘనత మన్మోహన్‌సింగ్ గారిదేనని మనవిచేస్తున్నాను. ప్రణబ్‌ముఖర్జీ కమిటీ వేశారు. ఆ కమిటీ 8 వారాలలో నివేదికనిచ్చి తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేస్తుందని భావిస్తే, అది ఫుల్ ఫిల్ కాలేదు. ఆ రోజు జయశంకర్ గారు, 5 మంది పార్లమెంట్ సభ్యులు తొక్కని గడప లేదు, మొక్కని దేవుడు లేడు. అధ్యక్షా, ఇది జయశంకర్ గారు రాసిన బుక్. నేను దీనిని మీకు పంపిస్తున్నాను.

(ఈ సందర్భంగా సదరు బుక్‌ని గౌరవ ఉపసభాపతికి అందజేశారు)

(తెలుగుదేశం పార్టీ సభ్యులచే అంతరాయం)

ఎందుకు ఇంత కుళ్లు? మీ ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని ఛీ కొడుతున్నారని మీకు తెలుసు, రేపు ఆంధ్రా ప్రాంతంలో అడ్రెస్ ఉండదని మీకు తెలుసు. మీకు ఆ భయం ఉంది కాబట్టే ఇవన్నీ చెబుతున్నారు. ఈ దేశంలో 28 పార్టీల చేత లెక్కలిప్పించిన ఘనత టిఆర్ఎస్ పార్టీది. దేశంలో నలుగురు ప్రధానమంత్రులు దేవెగౌడ, వి.పి.సింగ్, ఐ.కె.గుజ్రాల్ కానివ్వండి అందరూ తెలంగాణా రాష్ట్రం ఏర్పడవలసిందే అని లేఖలిచ్చారు, తమరికి పంపిస్తాను. బిజెపి కూడా అనేకసార్లు సమైక్యవాదమే అంటున్న సిపిఐ పార్టీ కూడా, మేము గతంలో సమైక్యవాదమే అని చెప్పవచ్చుగాక,

---

• Expunged as ordered by the Chairs

కాని ప్రజాఉద్యమానికి స్పందిస్తామని చెప్పింది. బిజెపి కూడా వందల సార్లు చెప్పింది. తెలంగాణా సమస్యపై మాకు మరో ఆలోచన లేదని చెప్పింది. ఆ విధంగా అనేక పార్టీల ఆఫీసులకు వెళ్లి మద్దతు కూడగట్టిన ఘనత టిఆర్ఎస్ పార్టీది.

అధ్యక్షా, ఇది అప్రజాస్వామికమైన బిల్లు, రాజ్యాంగ విరుద్ధమైన బిల్లు అని అంటున్నారు. నేను చదువుకోలేదు. నాకు మా న్యాయనిపుణులు చెప్పింది విన్నాను. ఇలాంటి అహంకారపూరితమైన, సామ్రాజ్య కాంక్ష, దోపిడీకి అలవాటు పడ్డవారు ఉంటారు. మెజారిటీ సభ్యులు మైనారిటీ సభ్యులను అణచివేసే ప్రయత్నం చేస్తారు కాబట్టి, 1955 తరువాత రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే బాధ్యత సావరిన్ పవర్ ఆఫ్ పార్లమెంట్‌ది తప్ప రాష్ట్రాన్ని విభజించే అధికారం రాష్ట్రాలకు లేదని ఆ మహానుభావుడు చెప్పారు. ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగాన్ని దేశానికి అందించిన మహనీయుడు అంబేద్కర్. ఆర్టికల్ 3 ప్రకారం మాత్రమే రాష్ట్రాలు ఏర్పాటు చేయాలి. ఈ సభకి డివిజన్ కోరే అధికారం, ఓటింగ్ కోరే అధికారం లేదని, మీకు టైం ఉంటే మీ న్యాయనిపుణులతో చర్చించమని కోరుతున్నాను. మీకు ౠౠ• తప్ప ఏమీ తెలియదు. ౠౠ పరిపాలించుకోవాలి అనే భావన తప్ప మీలో నిజాయితీ, మానవత్వం లేదు. మా ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం ఒక్క క్షణం కూడా పాటుపడ్డ చరిత్ర మీకు లేదని తెలియజేస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారు, 2011 జూలై 1 వ తేదీన ఎలాంటి నిర్ణయం అధిష్టానం తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ ఏకతాటి పై నిలుస్తుంది, ఎటువంటి పరిణామమైనా ఎదుర్కొంటుదని మాట్లాడారు. 2011 ఆగష్టు 29వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రి డి.కె.అరుణ గారు ............................

(INTERRUPTIONS FROM MEMBERS BELONGING TO TELUGU DESAM PARTY)

MR. DEPUTY SPEAKER: You please address the Chair Rajender garu.

(INTERRUPTIONS)

Rajender Garu, you please conclude.

SRI P. ASHOK GAJAPATHI RAJU: Sir, Point of Order…………

MR. DEPUTY SPEAKER: Yes, Ashok Gajapathi Raju garu, what is your point of order?

SRI P. ASHOK GAJAPATHI RAJU: Sir , it is my duty as a Legislator to bring to your notice that we are working under the Constitution. Article 3 clearly reads as follows:

> " Formation of new States and alteration of areas, boundaries or names of existing states:
>
> Parliament may by law-

---

• Expunged as ordered by the Chair

a. form a new State by separation of territory from any State or by uniting two or more States or parts of the States or by uniting any territory to a part of any State;

b. increase the area of any State;

c. diminish the area of any State;

d. alter the boundaries of any State;

**e.** alter the name of any State:

Provided, that no Bill for the purpose shall be introduced in either House of Parliament except on the recommendation of the President and unless, where the proposal contained in the Bill affects the area…………" **<u>to lay stress, I will repeat it once again</u>:**

"……Where the proposal contained in the Bill affects the area, boundaries or name of any of the States, the Bill has been referred by the President to the Legislature of that State for expressing its views thereon within such period as may be specified in the reference or within such further period as the President may allow and the period so specific or allowed has expired.

Explanation .1 - In this Article,………. "

We do not have to go into Explanation part.

(INTERRUPTIONS)

But if you want, I will read that also… Sir, the views of the Legislature are expressed by either head count, hand count or voting. Nobody is objecting to express their views but, as a collective body, it is only head count or voting. Sir, the first Prime Minister of India, Sri Pandit Jawaharlal Nehru had also stated that though ultimately issues are decided by the count of heads or hands or voting, discussion is important. Sir, even Dr.B.R. Ambedkar had gone on record that those who are affected in Constituent Assembly ought to have a say. Here all the telugus are getting affected. Let us not support the Constitution of India. Let us uphold the federal principles of Constitution and let us assist the Parliament in performing its duties.

మ.1.20

శ్రీ ఈటెల రాజేందర్: అధ్యక్షా, నేను ముందే చెప్పాను. వారికి వచ్చినంత ఇంగ్లీష్ భాష నాకు రాదు. ఒకటి మాత్రం చెప్పదలచుకున్నాను. మీరెన్ని చేసినా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆగదు. అశోక్ గజపతిరాజు గారు చాలా పెద్దలు, బాగా అనుభవమున్నవారు. వారి రాజకీయానుభవం అంత లేదు నా వయసు. కానీ ఒక్కటి మాత్రం చెప్పదలచుకున్నాను. 2009 డిసెంబర్ 7వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య గారి నాయకత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తే తెలుగుదేశం పార్టీ బృందానికి నాయకత్వం వహించింది అశోక గజపతిరాజు గారు. ఆ రోజు ఏ చట్ట ప్రకారంగా, ఏమి ఆలోచించుకొని, ఏమి చర్చించుకొని, ఏమి నిర్ణయం తీసుకొన్నారో గానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు

గురించి సచివాలయంలో మీడియా సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ చేయవలసిందేనని గొప్ప మాట చెప్పారు. వారన్న మాటలు నా మదిలో చెరగిపోలేదు.

MR.DEPUTY SPEAKER: Please conclude.

శ్రీ ఈటెల రాజేందర్ః అధ్యక్షా, నన్ను మాట్లాడనివ్వండి.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ పి.అశోక గజపతి రాజుగారికి మాట్లాడే అవకాశమివ్వాలని కోరసాగారు)

ముఖ్యమంత్రి గారు 2011 ఆగస్టు 26వ తేదీనాడు మహబూబ్‌నగర్ జిల్లా మీటింగ్‌లో జిల్లా మంత్రి గారు అభివృద్ధి కోసం కోరితే..............

(అంతరాయం)

రెండు మూడు నెలలలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై నిర్ణయం తీసుకుంటుంది. అప్పటివరకు వేచి ఉండాలని ముఖ్యమంత్రిగారు కోరారు. 2012 జూలై 11వ తేదీన హైదరాబాద్‌లో మాట్లాడుతూ తెలంగాణపై ఇప్పటికే అన్ని పక్షాల అభిప్రాయం కేంద్ర నాయకత్వం తీసుకుంది. కేంద్రం నుంచి ఒక నిర్ణయం వెలువడాల్సి ఉంది. నేను ముఖ్యమంత్రి అయిన ప్రారంభంలోనే తెలంగాణపై తక్షణం నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని రెండుసార్లు కోరానని ముఖ్యమంత్రి గారు చెప్పారు. 2012 అక్టోబర్ 2వ తేదీన త్వరలోనే నిర్ణయం తీసుకోవాల్సిందిగా నేను పార్టీ అధిష్టానాన్ని కోరానని ముఖ్యమంత్రి గారు చెప్పారు. తెలంగాణపై అధిష్టానానికి నివేదికలు పంపలేదని, త్వరలోనే అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రిగారు చెప్పారు. అధ్యక్షా, చివరగా అదే ముఖ్యమంత్రి గారు కేంద్రం అభిప్రాయం చెప్పేవరకు వేచిచూడండని చెప్పారు.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ పి.అశోక గజపతి రాజుగారికి మాట్లాడే అవకాశమివ్వాలని కోరుతూ పోడియం వద్దకు వచ్చి సభకు అంతరాయం కలిగించసాగారు)

మేం కేంద్రం నిర్ణయానికి సహకరిస్తాం. రాష్ట్రానికి, దేశానికి ఏ విధంగా మేలు జరుగుతుందో ఆ విధంగా కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని, త్వరగా నిర్ణయం తీసుకోవాలని నేను కోరుతున్నానని ముఖ్యమంత్రిగారు చెప్పారు.

MR.DEPUTY SPEAKER: Mr.Ashok Gajapathi Raju garu, please call back your Members.

(Interruptions)

శ్రీ ఈటెల రాజేందర్ః అధ్యక్షా, తెలంగాణ ప్రాంతంలో జెండా పీకేసిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. వారేమన్నారంటే ఇచ్చే శక్తి లేదు, ఆపే శక్తి లేదు, తెలంగాణ సెంటిమెంటును

గౌరవిస్తున్నానని చెప్పారు. ప్రత్యేక తెలంగాణ ఇవ్వాల్సింది కేంద్రమే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రాన్ని విభజించడానికి కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే అధికారముంటుందని చెప్పారు.

(అంతరాయం)

అందరి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కేంద్రమే మంచి నిర్ణయం తీసుకోవాలని జగన్మోహన్ రెడ్డిగారు 2012 డిసెంబర్ 28వ తేదీన కేంద్ర హోంమంత్రికి ఇచ్చిన లేఖలో రాష్ట్రాలను కలిపి ఉంచాలన్నా, విడదీయాలన్నా ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు, రాష్ట్రంలోని పార్టీలకు లేదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం కేంద్రానికే ఉందని, రాష్ట్రంలో ఒక పార్టీగా ప్రజల మనోభావాలను గుర్తించాల్సిన, గౌరవించాల్సిన బాధ్యత ఉందని, వారి పార్టీ ప్లీనరీలో చెప్పినట్లుగా తెలంగాణ సెంటిమెంట్‌ను గౌరవిస్తున్నామని, తెలంగాణ ఉద్యమంకోసం ప్రాణాలు అర్పించినవారికి నా సలాములని జగన్మోహన్ రెడ్డిగారు చెప్పారు.

(తెలుగుదేశం సభ్యులు పోడియం వద్ద నిలబడి "We want justice, we want justice" అని నినాదాలు చేస్తూ సభకు అంతరాయం అంతరాయం కలిగించసాగారు)

MR.DEPUTY SPEAKER: Please sit down.

(Interruptions)

అధ్యక్షా, 2000వ సంవత్సరంలోనే కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు డా.రాజశేఖర్ రెడ్డిగారి నాయకత్వంలో సోనియా గాంధీ గారిని కలిసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి కోరారు. డా.రాజశేఖర్ రెడ్డిగారి ఆశయాలను కొనసాగిస్తామని చెప్పిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష నాయకులు శ్రీమతి విజయమ్మ గారు ఇలా అడగడం బాధాకరం.

(తెలుగుదేశం సభ్యులు పోడియం వద్ద నిలబడి "We want justice, we want justice" అని నినాదాలు చేస్తూ సభకు అంతరాయం అంతరాయం కలిగించసాగారు)

MR.DEPUTY SPEAKER: Please go back to your seats.

(Interruptions)

(తెలుగుదేశం పార్టీ సభ్యులు పోడియం వద్ద నిలబడి తమ పార్టీ సభ్యులు శ్రీ అశోక గజపతిరాజు గారికి మైక్ ఇవ్వాలని కోరుతూ సభకు అంతరాయం కలిగించసాగారు)

You are all responsible Members here. This is not the way to disturb the House. Please resume your seats.

(Interruptions)

Yes, Ashoka Gajapathi Raju garu....

(తెలుగుదేశం పార్టీ సభ్యులు పోడియం నుంచి తమ తమ సీట్లకు వెళ్లారు)

(తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

I only request the Hon'ble Members .......................

SRI P.ASHOK GAJAPATHI RAJU: Sir, my name was taken. So, I would like to clarify on the issue. I don't want to make any speech here. I have mentioned something on the Constitution, add to that Article 168, everything becomes clear beyond the pale of any argument.. Besides that, I fail to understand as to why my name has been dragged into this. Yes, the Chief Minister did convene a meeting and there was a notice that this meeting is convened due to Mr.K.Chandrasekhar Rao's fast. Sir, my Party deputed me for the meeting and Dr. Nagam Janardhan Reddy, one another champion of Telangana was there. As an opposition party, we are ready to discuss we will discuss whatever issue is brought before us. It is our duty as an opposition to discuss. If that is to be found fault with us, I don't think that any opposition can survive any where in the Country. It is the Federal spirit that has to be looked into. I have not raised any personal allegation against any one and I will never raise any personal allegation against any one in my personal capacity. But in the official capacity, yes, we have to perform. But that does not mean that I am going to support the Bill which has come without our consent. Why is that the Bill is referred to the Assembly first? It is referred to get our views. We have two Houses. Legislature view is the majority view here. This morning we had an agitation here also. I have requested the Hon'ble Speaker to clarify what he had clarified in the BAC. I don't know why he had shunned away from his responsibility. Sir, Please clarify, Put this Bill beyond the pale of discussion, it is in the interest of all Telugu speaking people irrespective from where they come from.

MR.DEPUTY SPEAKER: Mallesh Garu.

(తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు తమ శాసనసభాపక్ష నాయకులు శ్రీ ఈటెల రాజేందర్‌కు తమ ప్రసంగం పూర్తి చేసేందుకు అవకాశమివ్వాలని కోరసాగారు)

(డా.నాగం జనార్ధనరెడ్డి తన పేరును శ్రీ అశోక గజపతిరాజు గారు ప్రస్తావించినందున తనకు మైక్ ఇవ్వాలని కోరసాగారు)

శ్రీ ఈటెల రాజేందర్‌: అధ్యక్షా, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు 2008 మే 1వ తేదీన పిడుగురాళ్లలో జరిగిన తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి తెలుగుదేశం పార్టీ వ్యతిరేకం కాదు, నేనూ వ్యతిరేకం కాదు. ఆ ప్రాంత ప్రజల సెంటిమెంట్‌ను గౌరవిస్తామని, మేం నియమించిన కమిటీ నివేదిక రాగానే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ఆ కమిటీ కి దివంగత మాజీ పార్లమెంటు సభ్యులు, ఎర్రన్నాయుడు గారు అధ్యక్షులుగా ఉన్నారు. నాగం జనార్ధన్ రెడ్డి గారు కూడా ఆ కమిటీలో సభ్యులుగా ఉన్నట్లున్నారు. 2008 జూలై 21వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా "ఐజా" తెలంగాణా కోర్ కమిటీ రెండవ సమావేశంలో తెలంగాణాకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ వెళ్లడం లేదని చంద్రబాబు నాయుడు గారు చెప్పిన విషయాన్ని నేను గుర్తు చేస్తున్నాను.

2008, అక్టోబర్ 22 వ తేదీన ప్రణబ్ ముఖర్జీ కమిటీకి టిడిపి ఇచ్చిన లేఖను చదువుతున్నాను. ఆ లేఖ సారాంశం ఏమిటంటే "తెలంగాణాపై అభిప్రాయాలు వెల్లడిస్తూ గతంలో ఇచ్చిన లేఖకు కొనసాగింపుగా తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుపై అక్కడి వారి మనోభావాలు తెలుసుకోవడానికి పార్టీ సీనియర్ నేతలతో ఒక కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఆ కమిటీ సమర్పించిన నివేదికను పొలిట్‌బ్యూరోలో చర్చించాం. తెలంగాణాకు అనుకూలంగా పార్టీ నిర్ణయానికి వచ్చిందని మీకు తెలియజేస్తున్నాం, పొలిట్‌బ్యూరో తీర్మానం కాపీని దీనికి జత చేస్తున్నాం".

MR.DEPUTY SPEAKER: Please conclude. Otherwise I have to give the opportunity to other Member.

శ్రీ ఈటెల రాజేందర్: 2009, ఫిబ్రవరి 14వ తేదీన "రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర తీర్మానంపై శాసన సభలో అనుకూల బిల్లు పెడతాము" అని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారు చెప్పారు. 2009, ఏప్రిల్ 9వ తేదీన మహబూబ్‌నగర్ లో అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని చంద్రబాబు నాయుడు గార చెప్పడం జరిగింది. 2009 డిసెంబరు 8వ తేదీన చంద్రబాబు నాయుడు గారు శాసన సభలో మాట్లాడుతూ "మాపార్టీ తరఫున చాలా స్పష్టంగా చెప్పాం మీరు అన్నింటి కన్నా ముందుగా చర్చను తీసుకున్నా మేము చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం లేకపోతే ప్రభుత్వం తీర్మానం తీసుకుని వస్తే సహకరించడానికి సిద్ధంగా ఉన్నాం. ఈ సందర్భంగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న చంద్రశేఖర్ రావు గారు దీక్ష విరమించుకోవాలని మా పార్టీ తరఫున విన్నవించుకుంటున్నాము" అని చంద్రబాబు నాయుడు గారు ఇదే సభలో చెప్పారు.

అధ్యక్షా, డిసెంబర్, 10వ తేదీన చిదంబరం గారు ప్రకటన చేసిన తరువాత ఇంత పెద్ద నిర్ణయం తీసుకునే ముందు ఎవరితోనూ చర్చించకుండా, నచ్చజెప్పకుండా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయమని చంద్రబాబు నాయుడు గారు మాట్లాడటం జరిగింది. దాని గురించి నేను చెప్పాల్సిన అవసరం లేదు. నాకు తెలిసీ మ్యానిఫెస్టోలు ఇవేళ రాజకీయ పార్టీలకు అతి పవిత్రమైనవి. అవి ప్రజలకిచ్చిన హామీలు. 2009 ఎన్నికల మ్యానిఫెస్టోలో, అదే విధంగా ఇదే సభలో చంద్రబాబు

నాయుడు గారు అన్న మాట ఏమిటంటే "మా పార్టీ మీలాగా కుర్చీల కోసం, నోట్ల కోసం జై తెలంగాణా అనదు. మా పార్టీ ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే కట్టుబడి వుంటుంది. ఆ నిర్ణయాన్ని అమలు చేస్తాము" అని చెప్పిన పార్టీ తెలుగుదేశం పార్టీ. అందుకే అధ్యక్షా, నేను ఒక్కటే చెబుతున్నాను. ఇవేళ ఇన్ని రాజకీయ పార్టీలు.... చిరంజీవి గారి పార్టీ ఇక్కడ లేదు. కానీ వారి పార్టీ కూడా ఎన్నికల మ్యానిఫెస్టోలో, 2009 ఎన్నికల కన్నా ముందు సామాజిక తెలంగాణా అని ఒక మెట్టు ఎక్కిన పార్టీ చిరంజీవి గారి పార్టీ. నాకు తెలిసీ ఆ పార్టీల గుర్తు మీదనే ఆ పార్టీల మ్యానిఫెస్టో మీదనే, ఆ పార్టీల బీ ఫారమ్ మీదనే గెలిచిన శాసన సభ్యులు ఇక్కడున్నారని నేను భావిస్తున్నాను. నేను ఒక్కడే అడుగుతున్నాను, మీ పార్టీల మ్యానిఫెస్టోలు ఉండగా మీ పార్టీ ప్రకటన చేసిన తరువాత మీరు ఏనాడైనా ఈ ప్రకటన ఉంటే మేము బి.ఫారమ్ తీసుకోము, ఈ ప్రకటన ఉంటే మేము పోటీ చేయమని ఒక్క సభ్యుడైనా ఈ సభలో అన్నారా? అలా అనని మీకు పార్టీని ధిక్కరించే నైతికత ఎక్కడదని అడుగుతున్నాను. మీకు ఆ నైతికత ఉందా? మీరు ఎవర్ని ప్రశ్నించారు? మీరు ఏ ఆలోచనతో, ఏ పద్ధతులతో, ఏ విధులతో – రేపు రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే వచ్చే repercussions ఏమిటో, రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే ఆ ప్రాంత ప్రజానీకాన్ని ఎట్లా సముదాయించాలో అర్థం కాక తీసుకున్న నిర్ణయాలా? మీరు ఎన్ని అడ్డదారులైనా తొక్కి వచ్చి అవకాశవాదంతో తెలంగాణా నిర్ణయాన్ని తీసుకున్నారా? లేదా నిజంగానే తెలంగాణా కోసం నిర్ణయం తీసుకుని వుంటే ఈ సభకు వచ్చిన ఈ బిల్లు మీద మీ వ్యూస్ గతంలో ఇచ్చిన లేఖలకు కట్టుబడి, గతంలో రాసుకున్న మ్యానిఫెస్టోలకు కట్టుబడి, గతంలో ప్రజాక్షేత్రంలో మాట్లాడిన మాటలకు కట్టుబడి వుండి ఈ బిల్లు మీద మీ వ్యూస్ అనుకూలంగా పంపమని మాత్రమే నేను కోరుతున్నాను.

అధ్యక్షా, చివరగా ఈ బిల్లు ప్రతులు కాలబెట్టారు. ఈ బిల్లు ప్రతులు చింపేసారు. 57 సంవత్సరాలు కలిసి వున్నాం, ఇప్పుడు కూడా విడిపోయి అన్నదమ్ముల్లా కలిసివుందామని మేమంటుంటే ఇంకా ఇలాంటి వెకిలిచేష్టల ద్వారా మా గుండెల మీద గుద్దుతారా అని ప్రశ్నిస్తున్నాను. బిల్లును తొక్కడమా మీ సంస్కారం, చించడమా మీ సంస్కారం? ఈ బిల్లు ప్రతులకు మా అమరవీరుల రక్తముంది. ఈ బిల్లు ప్రతులకు మా అమరవీరులను కన్న తల్లిదండ్రుల ఆక్రందన వుంది. వాళ్ల కన్నీళ్లు వున్నాయి. ఈ బిల్లు మామూలు బిల్లు కాదు. 60 సంవత్సరాలుగా రాష్ట్రం రావాలని, ఆ రాష్ట్రంలో మాకు ఉద్యోగాలు రావాలని దుబాయ్ బతుకులు పోవాలని, ముంబాయి బతుకులు పోవాలని ఒక్క మాటలో చెప్పాలంటే ఆకలి కేకలు లేని, ఆత్మహత్యలు లేని సుసంపన్నమైన రాష్ట్రాన్ని చూడాలని మా ప్రజలంతా ఏకతాటి మీద పార్టీలను పక్కనబెట్టి, జెండాలను పక్కన బెట్టి తెలంగాణా బిడ్డలుగా ఒక్కటై కొట్లాడారు. దాని కోసం వెయ్యి మంది బిడ్డలను పోగొట్టుకున్నాం.

ఏ.శ్రీకాంతాచారి నవంబరు, 29వ తేదీన ఎల్.బి.నగర్ చౌరాస్తాలో పెట్రోల్ పోసుకుని మంటల్లో మాడిపోతూ కూడా అమ్మా అనలేదు. 'జై తెలంగాణ' అన్నాడు. ఇక్కడి అమరత్వం ఢిల్లీ సర్కార్‌కి తెలియడం లేదు, ఇక్కడి అమరత్వం దేశానికి తెలియాలని మీడియాకు, సోనియా గాంధీ

గారికి యాదిరెడ్డి ఏమని ఉత్తరం రాసాడో తెలుసా అధ్యక్షా? ఏ రంగారెడ్డి జిల్లాలో తెలంగాణా ఉద్యమం లేదని చెబుతున్నారో కూతవేటు దూరంలో వున్న మంగళవరం ప్రాంతానికి చెందిన యాదిరెడ్డి పార్లమెంటు పక్కన చెట్టుకు ఉరేసుకుని ఈ దేశంలో వున్న మీడియాకు, ఈ దేశంలో ఉన్న ప్రముఖులకు ఉత్తరం రాసాడు. ఆ ఉత్తర సారాంశం ఏమిటంటే "దేశంలో ఉన్న మేధావుల్లారా! దేశంలో వున్న పాలకుల్లారా! మా తెలంగాణలో ఉన్న ఆక్రోశాన్ని, ఆవేదనను పట్టించుకోండి. తెలంగాణ బిల్లును పార్లమెంటులో పెట్టండి" అని ఉత్తరం రాసాడు. మేము ఆయన డెడ్‌బాడీ కోసం వెళ్లాము. ఈ బిడ్డ అనాధ బిడ్డ కాదు, ఈ బిడ్డ తెలంగాణ ప్రజల బిడ్డ, ఈ బిడ్డ కోసం నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలు కన్నీరు కారుస్తున్నారని మేము ఆ బిడ్డ శవం కావాలని వెళితే ఆ బిడ్డడి శవాన్ని అనాధ శవంగా డిక్లేర్ చేసి శ్మశానవాటికకు తరలించారు. ఆ సందర్భంలో ఏమి జరిగిందో మీరు చూసారు.

అధ్యక్షా, ఎంత మంది బిడ్డలు.... మనకు శరీరంలో ఎక్కడన్నా కాలితే అమ్మా అంటాము. అలాంటిది వేణుగోపాల్ రెడ్డి లాంటి విద్యార్థులు తెలంగాణ రావాలని మంటల్లో మాడిపోయారు. ఉరికొచ్చే ట్రెయిన్ల కింద పడి అమ్మా అనలేదు, నాన్న లేదు. ఉరికొచ్చే ట్రెయిన్ల కింద కూడా జై తెలంగాణ అంటూ ముక్కలు ముక్కలై పోయారు. శ్రీకాంత్, ఎం.టెక్ ప్రధాన మంత్రి గారికి ఉత్తరం రాసాడు. మీ యూట్యూబ్‌లో వుంటుంది. బొగ్గుగని కార్మికుడి బిడ్డ అయినటువంటి శ్రీకాంత్ ఎంటెక్ చదివినప్పటికీ తెలంగాణ రావాలి, నా చావు తరువాతనైనా పాలకుల్లో కనువిప్పు కలగాలి, కుర్చీల కోసం, ఓట్ల కోసం డ్రామాలాడే పాలకుల్లారా! ప్రజల ఆక్రందనను వినండని రాసిపెటిన ఉత్తరాలు చదివాము. ఎన్ని చెప్పుకోవాలి. ఇదే సమైక్యవాదులను నాడు మానుకోటలో ప్రశ్నించినందుకు 17 మంది బిడ్డల మీద తూటాలు పేలితే రక్తం మడుగుల్లో కూడా జైతెలంగాణ అన్న చరిత్ర చూసాము. అధ్యక్షా, ఇంత గొప్ప చరిత్ర ఉంది. కేసిఆర్ గారు తెలంగాణ వచ్చుడో, నేను చచ్చుడో అని పిలుపునిచ్చి ఆమరణ నిరాహార దీక్ష చేసి ఇవాళ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే అంత పెద్ద తెలంగాణ త్యాగాల చరిత్రను, ఆ బిల్లును, ఆ బతుకు పోరాటాన్ని కించపరిచే ప్రయత్నం చేస్తే మంచిది కాదని నేను చెప్పదలచుకున్నాను.

మ.1.40

నేను అడుగుతున్నాను. చివరిగా ఈ బిల్లులో మాకు నచ్చని కొన్ని అంశాలున్నాయి. ఇప్పటికే స్పీకర్ గారికి 10 విషయాల మీద లేఖ ఇచ్చాము. ఇవాళ తెలంగాణా ప్రాంతాన్ని ఎడారిగా మార్చొద్దు. 56 ఏళ్లుగా దగాపడ్డది తెలంగాణా ప్రాంతం. ఉద్యోగాలు కోల్పోయింది తెలంగాణా. నీళ్లని కోల్పోయింది తెలంగాణా. ఇవాళ కేంద్రం ఆలోచించాల్సింది అటువంటి తెలంగాణా కోసం. ఇవాళ రెండు పంటలు పండించుకోవడం కోసం కాదు ఆలోచించాల్సింది. ఉద్యోగాలు కొల్లగొట్టడం కోసం కాదు ఆలోచించాల్సింది.

అధ్యక్షా, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని టిఆర్ఎస్ పార్టీ ఇవాళ మా అభిప్రాయంగా చెబుతోంది. అంతేకాదు. ఏ గడ్డ మీద పుట్టిన ఉద్యోగులు ఆ గడ్డ మీదే పెన్షన్ తీసుకోవాలి. ఏ గడ్డ మీద పుట్టి ఉద్యోగమిచ్చారో, ఆ గడ్డ మీదే పని చేసే పరిస్థితి రావాలి. ఇవాళ పెన్షన్ల విషయం కావొచ్చు, ఉద్యోగుల విషయం కావొచ్చు, కరెంటు విషయంలో కావొచ్చు. రాష్ట్రం ఏర్పడిన వెంటనే ఒక హైకోర్టు కూడా ఏర్పాటు కావాలని కోరుతూ, ఇలాంటి పది ప్రతిపాదనలపై మేం ఎటువంటి అభిప్రాయాలనైతే చెబుతున్నామో, మా అభిప్రాయాలను కేంద్రానికి పంపాలని మేం విజ్ఞప్తి చేస్తున్నాము.

ఇవాళ అన్ని పార్టీల పెద్దలకి విజ్ఞప్తి చేస్తున్నాను. మా ఆత్మగౌరవంతో, మా కన్నీళ్లతో, మా బ్రతుకులతో చెలగాటమాడే ప్రయత్నం చేయకండని మీకు వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మల్లాంటి ఈ శాసన సభ, పార్లమెంటులు అలాంటి సంకుచితమైన భావనలకు వేదిక కాకూడదని నేను కోరుతున్నాను. దయచేసి, వైఎస్సార్ పార్టీ కావొచ్చు, తెలుగు దేశం పార్టీ కావొచ్చు, కాంగ్రెస్ పార్టీ కావొచ్చు, లేదా అంతరించిపోయినటువంటి చిరంజీవి గారి పార్టీ కావొచ్చు, సీపీఐ పార్టీ, బిజెపి పార్టీ, ఎంఐఎం పార్టీ కూడా అభిప్రాయం చెప్పింది. చివరికి సీపీఎం పార్టీ కూడా 'మా భుజాలపై తుపాకీ పెట్టి కాల్చొద్దు, మీరు తెలంగాణా రాష్ట్రం ఇస్తామంటే మాకు అభ్యంతరం లేదు' అని చెప్పింది. కాబట్టి, ఏకగ్రీవంగా అన్ని పార్టీలు కూడా ఈ రాష్ట్ర శాసన సభ వేదికగా ఖచ్చితంగా తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు మద్దతిస్తామని చెప్పి మీ విజ్ఞత, మీ నిజాయితీ ప్రదర్శించుకోవాలని కోరుతున్నాను. ఖచ్చితంగా ఈ దేశ చరిత్రలో, పార్లమెంటులో తెలంగాణా బిల్లు అత్యధిక పార్లమెంటు సభ్యుల చేత ఆమోదం పొంది, తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు కావడానికి ఆస్కారమున్న బిల్లని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అందుకే దయచేసి తాత్సారం చేయకుండా, నాన్చకుండా, మీనమేషాలు లెక్కపెట్టకుండా విజ్ఞత ప్రదర్శించి, తెలంగాణా ప్రజల పక్షాన మాకిచ్చిన హామీని నిలబెట్టుకోమని డిమాండ్ చేస్తూ, ఇవాళ మీరు నాకీ సమయం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను. జై తెలంగాణా.. తెలంగాణా అమరవీరులకు జోహార్లు.

(ఈ దశలో జై తెలంగాణా.. జై తెలంగాణా అంటూ టి.ఆర్.ఎస్. పార్టీ సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని నినాదాలు చేశారు. )

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః గుండా మల్లేష్ గారూ..

డా. నాగం జనార్ధనరెడ్డిః సార్, చిన్న సబ్మిషన్ సార్..

శ్రీ జి. మల్లేష్ (బెల్లంపల్లి)ః నాగం జనార్ధన రెడ్డన్నా ఆగన్నా... నేను మాట్లాడేటప్పుడేనా నువ్వు అడ్డుపడటం!

డా. నాగం జనార్థనరెడ్డిః ఏం నన్ను మాట్లాడనియ్యరా?

శ్రీ జి. మల్లేష్ః నువ్వు మాట్లాడొచ్చు. అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో, ఆంధ్రప్రదేశ్ శాసన సభ చరిత్రలో ఒక ప్రధానమైన ఘట్టంలో మనమున్నాము. సుదీర్ఘకాలంగా, ప్రజల్లో అనేక రకాలుగా చర్చించ బడుతున్నటువంటి తెలంగాణా బిల్లు పైన ఈ రోజు చర్చ జరుగుతోంది. ప్లీజ్ డిస్టర్బ్ చేయకండి..

(ఈ సందర్భంలో టి.ఆర్.ఎస్. పార్టీకి చెందిన కొందరు సభ్యులు తమ స్థానాలను విడిచి ముందుకు వచ్చి, తమ పార్టీ శాసన సభాపక్ష నేత శ్రీ ఇ. రాజేందర్ గారి ప్రసంగం పట్ల అభినందించసాగారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః ప్లీజ్ సిట్ డౌన్.... ప్లీజ్ సిట్ డౌన్....

శ్రీ జి. మల్లేష్ః అధ్యక్షా, ఇక్కడ చర్చ జరుగుతోంది. ఈ చర్చల్లో సమైక్య వాదాన్ని వినిపించే మిత్రులున్నారు. ప్రత్యేక తెలంగాణా కావాలనే ప్రజల వాంఛ కోసం నిలబడే శక్తులు కూడా ఉన్నాయి. భిన్నాభిప్రాయాలు సహజమైనవి. ఎవరి అభిప్రాయాలు వారు చెప్పొచ్చు. ఈ సందర్భంగా, ఈ శాసన సభలో తెలంగాణా బిల్లుపైన మాట్లాడే అవకాశం నాకు రావడం, తెలంగాణా ఏర్పడే సందర్భంలో నేను కూడా ఈ శాసన సభలో ఉండటం నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది. అధ్యక్షా, నేను తమ ద్వారా మనవి చేసేదేమంటే – పీడిత ప్రజానీకం విముక్తిని కోరుకుంటున్నారు. సామాన్య ప్రజలు స్వేచ్ఛను కోరుకుంటున్నారు. తెలంగాణా ప్రజలు తెలంగాణను కోరుకుంటున్నారు.

అధ్యక్షా, మనం ఈ ప్రపంచ పరిణామ క్రమంలో అనేకమైన ఘట్టాలను చూసిన అనుభవాలు ఉన్న వాళ్లంగా మనమిక్కడ ఉన్నాము. చాలా మంది మేధావులు కూడా ఈ సభలో ఉన్నారు. శ్వేత జాతి అహంకారానికి వ్యతిరేకంగా నెల్సన్ మండేలా గారు 27 సంవత్సరాలు జైల్లో నిర్బంధించబడ్డారు. అలాంటి వారి త్యాగాల ద్వారా ఆ దేశాలు విముక్తి చెందాయి. ఇవాళ మన తెలంగాణాకు సంబంధించినటువంటి అంశాలు కొన్ని క్రోఢీకరించడం అవసరం. సాక్షాత్తూ మన భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ గారు చిన్న రాష్ట్రాలుండటం వల్ల దేశం పురోగతి చెందుతుందని, చిన్న రాష్ట్రాల వల్ల ప్రజల్లో పురోగతి సాధ్యమౌతుందని వ్రాయడం జరిగింది. అందులో భాగంగా తెలంగాణా చిన్న రాష్ట్రం ఏర్పాటు చేసినా అభ్యంతరం లేదని వ్యాఖ్యానం వచ్చింది. అంతేకాదు. తమరికి ఒక విషయం చెబుతున్నాను. అంబేద్కర్ గారు తెలంగాణా ఏర్పాటును గురించి మాత్రమే కాదు. ఆయన ఇంకో అడుగు ముందుకేసి దక్షిణ భారత దేశంలో కూడలి స్థలములో ఉండేటటువంటి హైదరాబాదును దేశానికి రెండవ రాజధానిగా ఏర్పాటు చేయాలని, హంగులుండేటటువంటి ప్రాంతం హైదరాబాదని స్వయానా తన స్టాటిస్టికల్ రిపోర్టులో చెప్పారనే

విషయాన్ని పత్రికలు కూడా వ్యాఖ్యానించాయి. ఇలాంటి చరిత్ర కలిగినటువంటి ఈ అంశంపైన చర్చ జరుగుతోంది.

ఇవాళ కొందరేం చెబుతున్నారంటే – రాజ్యాంగంలోని ఆర్టికల్ 37 డి ప్రకారం బిల్లు చెల్లదు, ఇది వీగిపోతుందని అంటున్నారు. అధ్యక్షా, ఇది సాధ్యమా? ఇది ఇక్కడ మాట్లాడే అంశమా? ఈ అంశాన్ని రాజ్యాంగబద్ధమైన పార్లమెంటు చూసుకుంటుంది. సుప్రీంకోర్టులో కూడా పిటీషన్ వేయబడింది. అక్కడ దాని విషయం తేలుస్తారు. ఇక్కడ కేవలం మన అభిప్రాయం చెప్పడమే తప్ప, మరొకటి కాదనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరమున్నది.

అధ్యక్షా, అదే రకంగా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం ఇది కుదరనే కుదరదని కొంత మంది అంటున్నారు. కొంత మంది వ్యాఖ్యానాలు చేస్తున్నారు. అది కూడా రాజ్యాంగమే చూసుకుంటుంది. మనం దానిపైన చర్చల్లోకి పోవాల్సిన అవసరం లేదు. ఇవాళ మరి కొద్దిమంది తెలంగాణాను అసంబద్ధంగా విడగొట్టాలని చూస్తున్నారు. ఇది న్యాయం కాదు. మేం ఇప్పుడు ప్రయత్నం చేసినందుకే ఈ బిల్లు వచ్చిందంటున్నారు. అధ్యక్షా, నేను ఒక విషయం చెబుతాను. హైదరాబాదు ప్రాంతాన్ని, హైదరాబాదు సంస్థానాన్ని, తెలంగాణా ప్రాంతాన్ని, మరికొన్ని ఇతర రాష్ట్రాల్లో ఉండే ప్రాంతాలను కలుపుకుని హైదరాబాదు కేంద్రంగా 400 సంవత్సరాల పాటు నైజాం పరిపాలన జరిగింది. నైజాం రాష్ట్రమున్నది. అసలు ఆ మాటకే వస్తే, అసలు దేశమే ఉన్నదనే విషయాన్ని ఈ సందర్భంగా చెబుతున్నాను. రాష్ట్రం కాదు. ఒక దేశంగా పరిపాలన చేయబడ్డటువంటి కేంద్రమిది. కానీ, చారిత్రక..

(ఈ సందర్భంలో శ్రీ జి. మల్లేష్ గారు నీళ్లు త్రాగుతూ కనిపించారు)

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డిః ఆయనను నీళ్లు త్రాగనివ్వండి. (మైకు లేదు)

శ్రీ జి. మల్లేష్ః మీక్కూడా నీళ్లు తాపిస్తాను.

(ఈ సందర్భంలో శాసన సభా వ్యవహారాల శాఖామాత్యులు డా.ఎస్.శైలజానాథ్ మాట్లాడేందుకు తమ స్థానం వద్ద నిలబడ్డారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః లెజిస్లేటివ్ ఎఫైర్స్ మినిస్టర్ గారూ..

డా.ఎస్.శైలజానాథ్ః అధ్యక్షా, ధన్యవాదాలు. ఇవాళేమిటో అన్నీ చరిత్రను వక్రీకరించి మాట్లాడే మాటలు వినే దౌర్భాగ్యం కలిగింది.

శ్రీ టి. హరీష్‌రావుః ఇది అన్యాయం సార్. ఏమిటి సార్ ఇది? వారిని చరిత్రను తెలుసుకోమనండి సార్... (మైకు లేదు)

డా.ఎస్.శైలజానాథ్ః అధ్యక్షా, అసలు హైదరాబాదు సంస్థానమనేది ఒక రాజ్యం. హైదరాబాదు సంస్థానం యొక్క చరిత్రలోకి పోవాలనుకుంటే చాలా వందల ఏళ్లు వెనక్కి వెళ్లాల్సి వస్తుంది. వామపక్ష నాయకులు వారు. బహుశా వారికి తెలియకుండా ఉండుంటుందని నేను భావించడం లేదు. ఈ మధ్య కాలంలో అత్యంత సెక్యులర్ ప్రభువు నిజాం ప్రభువని కీర్తిస్తూ వెలసిన పోస్టర్‌ను హైదరాబాదులో చూశాను. ఆ రోజు నాకెందుకో బాధ వేసింది. వామపక్ష, విద్యార్థి ఉద్యమాల్లో పని చేసిన వాడిగా .. దీంట్లో విషయమేమిటంటే మల్లేష్‌గారు ఈ రోజున..

శ్రీ టి. హరీష్ రావుః స్పీకర్ సార్, వేరే మెంబర్ మాట్లాడుతున్నప్పుడు, మధ్యలో ఆయనకు మైకు ఎందుకిచ్చారు? (మైకు లేదు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః హరీష్ రావు గారూ.. ప్లీజ్ సిట్ డౌన్..

డా.ఎస్.శైలజానాథ్ః అధ్యక్షా, నాకిప్పటికీ గుర్తుంది. నిజాం సంస్థానంలో..

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః సభ్యులు చెప్పిన దాని మీద what is your objection?

డా.ఎస్.శైలజానాథ్ః అదే అధ్యక్షా..

శ్రీ టి. హరీష్‌రావుః వారు క్లారిఫికేషన్ అడుగుతున్నారా?

DR. S. SAILAJANATH: I am not asking clarification. అధ్యక్షా, నిజాం సంస్థానమనబడే ఆనాటి రాజ్యంలో సాధారణమైన ప్రజలు గాని, పని చేసే వాళ్లు గాని, దళితులు గానీ అందరూ కూడా చాలా కష్టాలు పడుతున్నారని, ఆనాటి ఆంధ్ర మహాసభ నాయకత్వంలో కమ్యూనిస్టులుగా ఉన్న వీళ్లందరూ కూడా ప్రజారాజ్యమనే నినాదం క్రింద, విశాలాంధ్ర పేరుతో పోరాటం సాగించిన సంగతి, వేలాది మంది ఆ రోజున ప్రాణాలు కోల్పోయిన సంగతి ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకోమనండి.

మ.1.50

ఈ రోజుకు కూడా సదరు పార్టీ యొక్క పేపరు విశాలాంధ్ర అనే సంగతిని గుర్తు చేసుకుంటూ దయచేసి రాజకీయ అవసరాల రీత్యా మీలో మార్పులు రావొచ్చు, కానీ చారిత్రక అంశాలను వక్రీకరించే ప్రయత్నం చేయవద్దని మాకు ఎంతో గౌరవం కలిగిన వామపక్షాలకు మనవి

చేస్తున్నాము. రాజకీయంగా నాలుగు సీట్ల కోసం ప్రయత్నం చేస్తే చేయొచ్చుగాక, చరిత్రను వక్రీకరించొద్దు. తెలంగాణా సాయుధ పోరాట అమర వీరుల త్యాగాలను కించపరచవద్దని నా కోరిక.

శ్రీ గుండ మల్లేష్ : అధ్యక్షా నూతనంగా శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా నియమించబడిన శైలజానాథ్ గారు ఏదైతే మాట్లాడారో, చారిత్రక విషయాలు వారికి తెలుసు మాకు తెలుసు ఇక్కడ ఉన్న వారందరికీ తెలుసు. ప్రధానంగా మనం, మీ అభిప్రాయాలు కరుడుగట్టిన సమైక్యతా వాదం – మా అభిప్రాయాలు మేము సమైక్యతా వాదులుగా ఉండి సమైక్యతా వాదం నుంచి దుర్మార్గం వల్ల ఎందుకు బయటకు వచ్చామో మీ బట్టలిప్పి బయట పెడతామనే విషయాన్ని చెబుతున్నాను.

(అంతరాయం)

తెలంగాణ ప్రజల సుదీర్ఘ పోరాటం వల్ల సుమారుగా 1200 మంది యువజన విద్యార్థుల ప్రాణ త్యాగాల వల్ల తెలంగాణా ప్రజలు సాగించిన వీరోచితమైన ప్రజాస్వామ్యకమైన ఉద్యమం వల్ల ఈరోజు ఈ బిల్లు తీసుకురాబడింది. బిల్లు కంటే ముందు, నేను మనవి చేసేదేమంటే, దాదాపు ఇక్కడ ఉండే అన్ని పక్షాలు ఏదో ఒక రూపంలో ఒకసారి కాకుంటే మరొకసారి మేము తెలంగాణాకు అనుకూలమే అని మా సిపిఎం సోదరులు కూడా చెప్పారు. చెప్పని వారు ఎవ్వరూ లేరు. కాంగ్రెస్ చెప్పింది. టిడిపి చెప్పింది. అన్ని పార్టీలకు సంబంధించిన వారు ఏదో ఒక రూపంలో చెప్పిన తర్వాత రోశయ్య గారి సమక్షంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో నిర్ణయమైన తర్వాత, సుదీర్ఘమైన కాలం తర్వాత, పోరాటాల తర్వాత ఢిల్లీకి పోయింది. ఆలస్యమైనప్పటికీ తెలంగాణా ప్రజలకు అన్యాయం జరగకుండా ఒక మంచి బిల్లును రూపొందించడం జరిగింది. ఈ బిల్లును రూపొందించిన కేంద్ర ప్రభుత్వానికి, డా.మన్మోహన్ సింగ్ గారికి, శ్రీమతి సోనియా గాంధీ గారికి, పార్లమెంటు సిపిఐ పక్ష నాయకులు గురుదాస్ గుప్తా గారికి, బీజేపీ నాయకురాలు శ్రీమతి సుష్మాస్వరాజ్ గారికి, దీనికి సహకరించిన అన్ని పార్టీల నాయకులకు నేను హృదయపూర్వకమైన అభినందనలను తెలియజేస్తున్నాను.

మంచిని మంచని, చెడును చెడని అనవలసిన అవసరం ఉన్నది. అంతా భూతద్దంలో చూసి మాట్లాడాల్సిన అవసరం లేదు. ఏమైనా ఈ బిల్లు మన ముందుకు వచ్చింది. ఇది రాజ్యాంగ రీత్యా వచ్చిన బిల్లు. ఇది ఆషామాషి బిల్లు కాదు. ఇదేదో పనికిరాని చెత్త కాగితం కాదు. ఈరోజు మనం రాజ్యాంగరిత్యా ఎన్నికైన శాసనసభ సభ్యులం. ఈరోజు మనం శాసన సభ సభ్యులుగానో, మంత్రులుగానో ముఖ్యమంత్రులుగానో ప్రమాణ స్వీకారం చేసినప్పుడు మనం ఏమన్నాము? భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటాము. సమవిధానాన్ని కాపాడతాము. కుల మత ప్రాంతాలకు అతీతంగా అందరికీ అనుకూలంగా ఉంటాము. నీతి నిజాయితీలను నిలబెడతాము, భారత స్వాతంత్ర్య సార్వ భౌమాధికారాలను కాపాడతామని చెప్పాము.

రాజ్యాంగ రీత్యా ఏర్పడిన కేంద్ర ప్రభుత్వం, తెలంగాణా ఏర్పాటుకు సంబంధించిన ఈ బిల్లును తయారు చేసింది. దాని పైన భారత రాష్ట్రపతి ముద్ర కూడా పడింది. ముద్ర పడిన తర్వాత. అధ్యక్ష తమరికి తెలుసు, ఆ బిల్లు స్పెషల్ ఫ్లైట్‌లో గంటన్నర సమయంలో ఢిల్లీ నుంచి సెక్రటేరియట్‌కు వచ్చింది. అది ఎడ్ల బండిలో రావాల్సినంత అవసరం లేదు. ఈ బిల్లు సెక్రటేరియట్ నుండి శాసన సభకు రావడానికి మూడు రోజులు పట్టింది. అందులో ఉన్న అంతర్యమేమిటో అర్థం కాలేదు. తమరికి మనవి చేశాం. మీరు చాలా నిష్పక్షపాతంగా ఉన్నారు. మీకు కూడా నేను అభినందనలను తెలియజేస్తున్నాను. కానీ కొన్ని దుష్టశక్తులు అక్కడ ఏవో ఆటంకాలను కల్పించడం వలన జరిగిన ఆలస్యం తప్ప మరొకటి కాదు.

ఇక నేను మనవి చేసేదేమంటే, అందరు కూడా తెలంగాణా బిల్లుకు అనుకూలమే అని చెప్పడం జరిగింది. అందరూ బ్రాహ్మణ వంశీయులే కానీ బుట్టలో ఉన్న రొయ్యలు మాత్రం మాయమైయ్యాయి అనే విధంగా ఉద్యమం జరుగుతోంది. ఈ పరిస్థితికి కారణమేమంటే, ఈ రోజు సీట్లు ఓట్లు నోట్లకు సంబంధించి అడ్డు పడిన కారణం తప్ప మరొకటి కనిపించడంలేదు. తెలంగాణ ప్రజల ఉద్యమం చాలా పెద్ద ఎత్తున జరిగింది. చరిత్ర నిర్మాతలు ప్రజలే. ప్రజల పాత్ర లేనిదే ఏ ఉద్యమం ముందుకు పోయేది లేదు. చరిత్ర నిర్మాతలైన ప్రజలకు నేను రెడ్ సెల్యూట్ చెబుతున్నాను. అదే విధంగా సీమాంధ్ర ప్రాంత ప్రజలకు కూడా. సీమాంధ్ర ప్రజలు భావోద్రేకాలకు లోనయ్యారు. ఈ గవర్నమెంటులో అభద్రతా భావన ఉన్నది అనే భావన వారికి ఏర్పడింది. మాకు రక్షణ ఉంటుందో లేదో అనే భావన ఏర్పడింది. మా జలాల సమస్య ఏమవుతుందో అనే భయం ఉన్నది. హైదరాబాద్ పోవడానికి మాకు అవకాశం ఉంటుందో లేదో అనే భయం ఉన్నది. ఇలాంటి భయాలు సీమాంధ్ర ప్రాంత ప్రజల్లో చోటు చేసుకున్నాయి. కానీ ప్రజలకు నాయకత్వం వహించే పార్టీలుగా మన మీద బాధ్యత ఉన్నది. ప్రజలకు వాస్తవాలను చెప్పవలసిన అవసరం ఉన్నది. నిజాలను చెప్పి మనం ప్రజలను ఒప్పించాల్సిన అవసరం ఉన్నది.

మనం చెబుతున్నది ఏమిటి? ఒక పార్టీ అక్కడ సీమాంధ్రలో మొదలు పెట్టారు. సమైక్యాంధ్ర ఉద్యమానికి నేనే ఛాంపియన్‌ని అవుతాననే ఉద్దేశంతో – సమైక్య శంఖారావం అనే పేరుతో శంఖాన్ని పూరించింది. వాళ్లెక్కడ ముందుకు పోతారో అని భయంతో వాళ్లను చూసి మరొక పార్టీ వెంబడించింది. వాళ్లను చూసి మేమెక్కడ వెనుకబడిపోతామో అని, ఓట్లు సీట్లకు దూరమవుతామేమో అనే భయంతో మరొక పార్టీ వెంబడించింది. ఇది వాస్తవం సార్. ముమ్మాటికి ఇదే తప్ప ఇందులో మరొకటి లేదు.

నేను ఈ మధ్య ఆంధ్ర ప్రాంతానికి రెండు మూడు పర్యాయాలు వెళ్లొచ్చాను. అక్కడి ప్రజలెవ్వరూ నన్ను ఇబ్బంది పెట్టలేదు. పైగా అక్కడ తెలంగాణా అంశం గురించి కూడా నేను మాట్లాడొచ్చాను. ఎక్కడా ఏమి ఆటంకమనేది లేదు. నేను కొద్ది మంది సామాన్య ప్రజలను కూడా అడిగాను. తెలంగాణా అయితే ఏమిటి ఆంధ్ర అయితే ఏమిటి, మేము కష్టాలు పడకుండా ఇక్కడ

ప్రభుత్వం ఉన్నా, అక్కడ ప్రభుత్వం ఉన్నా ఒరగబెట్టేది ఏమి లేదు. చాలా రోజుల నుండి తెలంగాణా వాళ్లు అడుగుతున్నారు. ఇస్తే అభ్యంతరం లేదనే వాదన సామాన్య ప్రజల నుండి వినబడుతోంది. కానీ అసలు కథ అంతా సీట్లు ఓట్లు నోట్లకు సంబంధించిన రాజకీయాల వల్ల వచ్చేటువంటి సమస్య తప్ప, దీనిలో మరొక సమస్య లేనేలేదు. దీనికి అంకురార్పణ చేసింది వైఎస్ఆర్సిపి పార్టీ అనే విషయాన్ని ఈ సందర్భంగా చెబుతున్నాను. వైఎస్ఆర్సిపి పార్టీకి సంబంధించిన జగన్ గారు జైల్లో ఉండి ఆడించిన నాటకాన్ని, బయట వీధి నాటకం ఆడి, కొద్దిమంది రక్తి కట్టించారు. వాళ్లను చూసి మా టిడిపి సోదరులు కూడా వెంబడిస్తున్నారు.

నేడు ఇంత మంచి బిల్లు తెచ్చారు. ఇది చాలా మంచి బిల్లు. నాకైతే జ్ఞాపకం ఉంది. అప్పుడు కిరణ్‌కుమార్ రెడ్డి గారు ఈ సభలోనే ఉన్నారు. మీకు తెలుసు సార్ మీ అధ్యక్షతనే అసెంబ్లీలో మీటింగ్ జరిగింది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు బిల్లు పెట్టండి. మాకు ఓట్లు తక్కువ ఉన్నాయి. మేము 119 మంది సభ్యులం ఉన్నాము. అయినా పర్వాలేదు. ఈ 119 మంది స్ట్రెంగ్త్, ఈ సంఖ్య ఢిల్లీకి పోతే సరిపోతుందని చెప్పాము. అసలు ఇక్కడ బిల్లు పెట్టడానికే వీలు లేదు. దాని పైన చర్చించడానికి వీలు లేదు. కేంద్రం ఏ నిర్ణయం చేస్తుందో అదిష్టాన వర్గం ఏ నిర్ణయం చేస్తుందో ఆ నిర్ణయాన్ని శిరసావహిస్తాం. దానిని అమలు జరుపుతాం. దానికి కట్టుబడి ఉంటామని చెప్పారు. ముఖ్యమంత్రి గారితో మొదలుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులంతా చెప్పారు సార్.

మ.2.00

అధ్యక్షా, ఇది పెద్దలకు న్యాయమా అని నేను అడుగుతున్నాను.

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి (ముఖ్యమంత్రి)ః అధ్యక్షా, ఇంతకుముందు రాజేందర్ గారు కూడా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పిన మాట వాస్తవమే. But, this is between High Command and me. మీ గురించి మాట్లాడలేదు. అది నాకు మా హై కమాండ్‌కున్న సంబంధం అన్న సంగతి గుర్తుపెట్టుకోండి. మా హై కమాండ్ తీసుకున్న నిర్ణయానికి నేను వ్యతిరేకంగా మాట్లాడుతున్నాను. ఈ సభలో నేను మాట్లాడినప్పుడు ఎందుకు సమైక్యాంధ్ర కోసం పోరాడుతున్నానో స్పష్టంగా తెలియజేస్తాను.

శ్రీ గుండ మల్లేష్ః అధ్యక్షా, ముఖ్యమంత్రి గారంటే నాకు ప్రత్యేక గౌరవమున్నప్పటికీ ఒక్క తెలంగాణ విషయంలోనే నాకెందుకో కోపం వచ్చింది. వారెప్పుడూ చిరు నవ్వుతో ఉంటారు. ఎప్పుడూ ఏదో ఒకటి చేయాలనే తపనతో ఉంటారు. కానీ తెలంగాణ అంశం వారికి తలనొప్పిగా మారింది. ఏది ఏమైనప్పటికీ అది వారి పార్టీ అంతర్గత వ్యవహారం. ముఖ్యమంత్రి గారు కేవలం సీమాంధ్ర ప్రాంతానికి ముఖ్యమంత్రి కాదు ఈ రాష్ట్రం మొత్తానికి ముఖ్యమంత్రి. వారు హైదరాబాదులో విద్యనభ్యసించారు, హైదరాబాదులో క్రికెట్ ఆడుకున్నారు కాబట్టి వారంటే ఇంకా అమితమైన గౌరవం నాకున్నది. వారు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం చాలా గర్వకారణం.

తెలంగాణ అంశం గురించి ప్రజలలో కూడా విభజన అభిప్రాయం వచ్చింది. వాస్తవాలకు అనుకూలంగా మాట్లాడుకొని నిర్ణయం తీసుకోవలసిన అవసరమున్నది. చరిత్రలో తెలంగాణకు జరిగిన అన్యాయం అంతా, ఇంతా కాదు. తెలంగాణ ప్రాంతం అయ్యా బాంచన్ దొరో, నీ కాళ్లు మొక్కుతాను దొరో అనే ప్రాంతం. జాగీర్దార్లు, జమీందార్ల పెత్తనం తెలంగాణలో ఎక్కువ. రజాకార్ల దౌర్జన్యం ఎక్కువ. ప్రజలకు పౌరహక్కులు, మానవ హక్కులు లేవు. స్త్రీల ప్రాణ, మానాలకు రక్షణ లేని నికృష్టమైన రోజులలో దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాటం వచ్చింది. ఈ విషయం విద్యావంతులు, మేధావులందరికీ తెలుసు. 15 ఆగస్టు, 1947 సంవత్సరంలో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ 15 ఆగస్టు, 1947 సంవత్సరంలో తెలంగాణకు స్వాతంత్ర్యం రాలేదు. నైజాం నవాబులు ఏం చెప్పారంటే నేను ఈ భారతదేశంలో విలీనం కాను, నేను ఈ స్వాతంత్ర్యాన్ని అంగీకరించను, రాజరిక వ్యవస్థ ధోరణితోనే తెలంగాణ ప్రాంతంలో ఇష్టానుసారంగా పరిపాలన చేస్తామని చెప్పారు. అవి చీకటి రోజులు, భయంకరమైన రోజులు. అటువంటి అరాచకాన్ని సహించలేని పరిస్థితి వచ్చింది.

అప్పుడు తెలంగాణలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ పేరుతో, భారత కమ్యూనిస్టు పార్టీ పేరుతో పెద్ద ఉద్యమమే జరిగింది. భారతదేశంలోని ఏ ప్రాంతంలోనూ జరగని పోరాటం తెలంగాణలో జరిగింది. తెలంగాణలో బాంచన్ అన్న ప్రజలే బందూకులు పట్టారు. నైజాం రజాకారులను, దొరల గుండాలను తరిమి తరిమి కొట్టారు. 4,500 మంది కమ్యూనిస్టులు, తెలంగాణ ఉద్యమకారులు ప్రాణాలను బలిదానం చేశారు. తర్వాత కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకున్నది. తెలంగాణకు సెప్టెంబర్ 17, 1948న స్వాతంత్ర్యం వచ్చింది. ఈ రకంగా తెలంగాణ విమోచనం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వంటి సమస్యలు వచ్చిన తర్వాత పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వర్‌రావు, ఆదినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, డా.రాజ్ బహదూర్, ఆరుట్ల కమలాదేవి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి వంటి ఎందరో ఉద్యమనేతలు ఆనాడు తెలంగాణలో ఖ్యాతి గడించినవారు. వారు సంకుచిత మనస్తత్వం కలిగిన వారు కారు. స్వార్థమంటే తెలియని వారు. వారి ధ్యేయం తెలంగాణ కాదు ఆంధ్ర కాదు ప్రజల సంక్షేమమే ధ్యేయమనే నినాదంతో ఈ రాష్ట్రంలో విశేషమైన కృషి చేసిన నాయకత్వం సి.పి.ఐ నాయకత్వం. ఆ మహానుభావులు అప్పుడే తెలంగాణ గురించి ఆలోచన చేసుంటే అప్పుడే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేది. కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాలు ఏర్పడలేదా? భాషా ప్రయుక్త రాష్ట్రాలు అనే నినాదం వచ్చిన తర్వాత తెలుగు మాట్లాడే ప్రజలకందరికీ ఒకే రాష్ట్రం ఉండాలనే నినాదం వచ్చిన తర్వాత దానికి అనుగుణంగా నిర్ణయం తీసుకున్నారు.

విశాలాంధ్రలో ప్రజారాజ్యం కావాలని, ప్రజలరాజ్యం ఏర్పాటుచేయాలని, విశాలాంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని సి.పి.ఐ. నినాదమిచ్చింది. మా పత్రికకు విశాలాంధ్ర అని పేరు పెట్టాం. కుట్రలతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారాజ్యం లేదు. స్వార్థపరుల హితం జరిగినందున ఈ సమస్యలొచ్చాయి. 2000 సంవత్సరంలోనే మేం ఈ విషయాన్ని పసిగట్టాం. అప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు గారు ఉన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలన్నింటినీ మా పార్టీ రాష్ట్ర కమిటీలో చర్చించాం. తెలంగాణకు సంబంధించిన అన్ని విషయాలలో ఏ ప్రభుత్వమున్నప్పటికీ సరైన న్యాయం జరగడంలేదు. ఉద్యోగాలలో, నీటి వనరులలో, ఖనిజసంపదలో దగా జరిగింది. అదే విధంగా అనేక రంగాలలో అభివృద్ధికి సంబంధించిన నిధుల మళ్లింపు వంటివి జరుగుతున్న నేపథ్యంలో కనీసం ఒక ప్రయత్నం చేద్దాం. 2002 సంవత్సరంలో ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఒత్తిడి చేసే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేశాము.

ఈ నేపథ్యంలోనే కె. చంద్రశేఖరరావు గారు ఇదే అదునుగా పరిస్థితులను గమనించి తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమం వారికొక బ్రహ్మాండమైన అవకాశం దొరికింది. కె. చంద్రశేఖర్‌రావు గారు తెలంగాణకు జీవం పోసే వ్యక్తిగా తయారయ్యారు. దీనిని తప్పుపట్టవలసిన అవసరం లేదు. తెలంగాణవాదం వారు ఉద్యమంలోకి రాకముందు కూడా ఉన్నది. తెలంగాణవాదానికి బలం చేకూర్చినవారయ్యారు తప్ప వారు తెలంగాణవాదాన్ని సృష్టించిన వారు మాత్రం కాదు. ఆ వాదాన్ని అంతం చేసే శక్తి కూడా వారికి లేదు. తెలంగాణ వాదానికి జీవం పోసే క్రమంలో ఉద్యమం ఇన్ని మలుపులు తిరిగింది. తెలంగాణ బిల్లు ఆకస్మికంగా తెచ్చారనడం వాస్తవం కాదు. ఇది సుధీర్ఘమైన చర్చోపచర్చల తర్వాతే బిల్లు తెచ్చారు.

భారత తొలి ప్రధానమంత్రి గారు చెప్పిన విషయాన్ని ఇందాక మా మిత్రుడు రాజేందర్ గారు చెప్పారు. వారు నిజామాబాద్‌కు వచ్చినప్పుడు కొద్దిమంది తెలంగాణవాదులు మేం వారితో వేగలేం, మా రాష్ట్రం మాకే కావాలంటే అదేం పెద్ద సమస్య కాదయ్యా. భార్యాభర్తలకు ఈ మధ్యనే పెళ్లి అయింది. మూడు సార్లు తలాక్, తలాక్, తలాక్ అంటే సంసారం విడిపోతుంది. ఎప్పుడో ఒకసారి మీరు విడిపోతారని జవహర్‌లాల్ నెహ్రూ గారు చెప్పారు. తలాక్, తలాక్, తలాక్ అని మూడు సార్లు కాదు ముప్పై లక్షల సార్లు అన్నా కూడా ఈ స్థితికి రావడం జరిగింది.

శ్రీ గాలి ముద్దుకృష్ణమనాయుడు (మైకు లేకుండా): మూడు సార్లు అంటేనే చెల్లుబాటు అవుతుంది. ముప్పై లక్షల సార్లు అంటే చెల్లుబాటు కాదు.

మ. 2.10

శ్రీ గుండ మల్లేష్: అధ్యక్షా, మూడు పర్యాయాలు కాదు, ముప్పై లక్షల పర్యాయాలు "తలక్, తలక్, తలక్" అన్నప్పటికీ ఈ దుర్మార్గపు వ్యవస్థలో అది సాధ్యం కాలేదు. అందుకు గాను

వ్యక్తిగతంగా నేను ఎవరిపైనో బురదజల్లే ప్రయత్నం చేసి మళ్లీ ఇరకాటంలోకి వెళ్లదల్చుకోలేదు. వాదోపవాదాలతో సమస్య పరిష్కారం కాదు. సమస్య పరిష్కారం కోసం మాట్లాడాలే తప్ప విమర్శ కోసం విమర్శ కాకూడదు, పరిష్కారం కోసం విమర్శ ఉండాలనే భావనతో నేను విషయాలను ప్రస్తావించదలచాను.

అధ్యక్షా, ఇవాళ కొంత మంది పార్టీ సభ్యులు సభలో సమైక్య తీర్మానం చేస్తేనే, విభజన బిల్లుపైన మాట్లాడుతాం, లేకుంటే వాకౌట్ చేస్తామనే రీతిలో పోడియం వద్దే బైటాయిస్తామనే విధంగా చెప్పడం జరిగింది. మేం మా గొంతులు చిల్లుపడేదాక గత నాలుగున్నర సంవత్సరాలుగా తెలంగాణ అంశానికి సంబంధించిన తీర్మానాన్ని సభలో చేసి కేంద్రానికి పంపమని కోరడం జరిగింది. అది సాధ్యం కాదు, ఆ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదనే విధంగా గౌరవ ముఖ్యమంత్రి గారు చెబుతూ కాలం వెళ్లబుచ్చారు. తీరా ఇప్పుడు చట్ట సభల ముందుకు విభజన బిల్లు అభిప్రాయం నిమిత్తం చర్చకు వచ్చిన తరువాత నాలుగు రోజుల్లో సమైక్య తీర్మానం చేయడం సాధ్యమయ్యే పనేనా? ఇది ఏ రకంగా చూసినా సాధ్యపడే అంశం కాదు. ప్రస్తుతం ఎవరైనా సమైక్య తీర్మానం కోసం సభలో పట్టుపడుతున్నారంటే అది కేవలం ఓట్లు, సీట్ల కోసమేనని అందరూ భావించాల్సి వస్తుంది. సమైక్య నినాదం కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించిన వ్యవహారం. మరొకటి కాదు. ఈ విషయం రాజకీయ పార్టీలకు మరియు రాష్ట్ర ప్రజలకు కూడా తెలుసు. పరిస్థితి అందరికీ అర్ధమైపోయింది. ఒక రాజకీయ పార్టీని చూసి మరొక రాజకీయ పార్టీ పోటాపోటీగా సమైక్య తీర్మానం వాదాన్ని వినిపిస్తున్నాయి లేకుంటే వెనుకబడిపోతామనే భావన తప్ప మరొకటి కాదు. అదే విధంగా తెలంగాణకు సంబంధించిన విషయంలో ఇవాళ ముల్కి రూల్స్ మూలపడిపోయినాయి. ఫజల్ అలీ కమీషన్ పత్తా లేకుండా పోయింది. మన ముందే వచ్చినప్పటి అనేక 610 జి.వో.కు, బ్రహ్మానందరెడ్డి జి.వో.కు, ఎన్.టి.రామారావు జి.వో.కు అర్ధం లేకుండా, అడ్రస్ లేకుండా పోయింది. ఇవన్నీ ఎవరు చేస్తున్నారు? అదే విధంగా ఆరు సూత్రాల పథకం, గిర్‌గ్లాని కమీషన్ వంటివి కూడా కనుమరుగైంది, నేను చిన్నప్పుడు ఒక సామెతను వినేవాడిని. "పిల్లిని గదిలో తలుపు పెట్టి కొడితే అది పులై ఎదురు తిరిగి దాడి చేసి కొట్టిన వాడి పైన పడి గొంతు పట్టేస్తుందట". అదే రీతిగా ఇప్పుడు తెలంగాణ ప్రజలపై అనేక పర్యాయాలు పాలకులు తలపైన కొట్టి కొట్టగా ఆ కొట్టడానికి విసిగి వేసారి పోయిన తెలంగాణ ప్రజల తిరుగుబాటే ఈ తెలంగాణ ఉద్యమం. అర్థవంతమైన తెలంగాణ ప్రజల ఆకాంక్షే ఇది. తెలంగాణ ప్రజల ఘోషే ప్రస్తుత ఈ పరిస్థితి తప్ప మరొకటి కాదు. అందువల్ల తెలంగాణకు సంబంధించిన విషయంలో అన్ని పక్షాల వారికి చేతులు జోడించి అర్థిస్తున్నాను. జరిగిందల్లా ఒక పీడ కలగా మరచిపోండి. కోర్కెలెన్ని ఉన్నప్పటికీ అన్నింటిని మర్చిపోండి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అందరు సహకరించి. ఏర్పాటుకు ముందుకు రండి. అందరు భాగస్వాములు కండి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా సభలో ఏకగ్రీవ తీర్మానం చేయండి. అదే విధంగా సీమాంధ్ర ప్రాంతానికి సంబంధించి ఏమేమి ప్రధాన సమస్యలున్నాయో ఆ సమస్యల పరిష్కారానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దాం. ఇవాళ మన ముందుకు 45 పేజీల ముసాయిదా బిల్లు చర్చ నిమిత్తం, అభిప్రాయం నిమిత్తం వచ్చింది. ఆ బిల్లు కూడా అనేక

రకాలుగా పరిశోధనలు చేసిన తరువాత వచ్చిన బిల్లే. మీ కంటే, మా కంటే, ఎక్స్‌పర్ట్స్, న్యాయ కోవిధులు కూర్చొని తయారు చేసినటువంటి బిల్లు. ఆ బిల్లు పైన మనం ఏవైనా సూచనలు, సలహాలివ్వవచ్చు. మనకు బిల్లుపైన అమెండ్‌మెంట్స్ ఇచ్చే అవకాశం, హక్కు, అధికారం లేదు. సవరణలు ఇవ్వాలనేటటువంటి విషయం బిల్లులో ఎక్కడ పొందుపర్చబడలేదు. కేవలం సిఫారసులు, సలహాలు మాత్రమే చేయమని బిల్లులో చెప్పబడింది. అభిప్రాయాలు తెలుపమనే విషయం మాత్రమే బిల్లులో ఉంది. సభలోని మనమంతా కూడా ఒకే అభిప్రాయంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన విభజన ముసాయిదా బిల్లును ఏకగ్రీవంతో ఆమోదం తెలిపి కేంద్రానికి పంపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అదే విధంగా సీమాంధ్రకు సంబంధించిన సమస్యల పరిష్కారం విషయంలో కూడా అందరం ఒకే త్రాటిపైన నడవాల్సిన అవసరముంది. కేవలం సీమాంధ్ర ప్రాంత సమస్యలే కాదు. మేం ఒక జాతీయ పార్టీలో ఉంటూ చెబుతున్నాం. ప్రజలందరి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మన మీద ఉంది. కమ్యూనిస్టు నాయకులుగా మేం చెబుతున్నదేమిటంటే సీమాంధ్ర ప్రాంత ప్రజలకు సంబంధించిన న్యాయపరమైన సమస్యల పరిష్కారం విషయంలో కూడా వారికి అండగా నిలబడతాం. అందరం కలిసికట్టుగా నిలబడి ఏ ప్రాంతానికి అన్యాయం జరగకుండా పోరాడుదాం. కాబట్టి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకోవాల్సిన పరిస్థితి కలగకూడదు. కడుపు కాలినోడికి ఆకలి విలువ తెలుస్తుంది. కడుపు నిండినోడికి ఏమి తెలియదు. అందువల్ల ఓట్లు, సీట్లు, నోట్ల కోసం ఆరాటపడే శక్తులకు ఈ విషయాలు తెలియవు. అందువల్ల అటువంటి శక్తులను దృష్టిలో పెట్టుకోవాల్సినటువంటి అవసరం లేదు. రాజకీయాల్లో మనం ఇవాళ ఉంటాం రేపు పోతాం. ప్రస్తుతం ఎన్నికల నగారా కూడా మ్రోగుతోంది. ఎన్నికల అనంతరం ఈ సభలోకి ఎవరు వస్తారో, ఎవరు రారో కూడా తెలియదు. ఏ పరిస్థితి ఏర్పడుతుందో తెలియనటువంటి వాతావరణం కనబడుతోంది. అయినప్పటికీ ఇవాళ రెండు రాష్ట్రాలుగా విడిపోవడం వల్ల ఆ ప్రాంతం, ఈ ప్రాంతం అనే తేడా లేకుండా ఇరు ప్రాంతాల్లో అభివృద్ధికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. రెండు ప్రాంతాల్లో అపారమైన వనరులున్నాయి. ఇరు ప్రాంతాల్లో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అంతే గానీ తెలంగాణ ప్రాంతం అభివృద్ధి చెందదు, పాలకులు లేరు, వాళ్లతో ఏది కాదు, చేత కాదు, అధికారం మాకిచ్చి చూడండి అనే మాటలు మాట్లాడితే అందుకు అంగీకరించేది లేదు. ఇవాళ రాజ్యాధికారం కోసం, తెలంగాణ ప్రజల మనోవాంఛ, సుదీర్ఘమైన పోరాటం, ఇది ఎవరో ఒకరిద్దరి పోరాటం వల్ల కాదు, ఈ పోరాటాన్ని అందరూ గౌరవించవల్సిన అవసరముంది. అందువల్ల తెలంగాణ విభజనకు సంబంధించిన ముసాయిదా బిల్లుకు ఏకగ్రీవంగా అందరు ఆమోదం తెలియజేయాలని కోరుతున్నాను.

అధ్యక్షా, ప్రధానంగా తమరి ద్వారా కొన్ని సూచనలు కూడా నేను చేయదలిచాను. ఇవాళ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే హైదరాబాద్‌ను పది సంవత్సరాలు ఉమ్మడి రాజధానిగా ఉండాలనేటటువంటి ప్రతిపాదన ఒకటి వచ్చింది. నేను చెప్పేదేమిటంటే, మనకు కేంద్ర ప్రభుత్వం ఉంది. కేంద్రంలో శక్తివంతమైన ప్రభుత్వం ఉంది. కేంద్ర ప్రభుత్వం కొత్త రాజధాని ఏర్పాటుకు, రాష్ట్ర శాసనసభకు, కొత్త సచివాలయం ఏర్పాటు చేయడానికి పూనుకుంటే, చిత్తశుద్ధితో ప్రయత్నం

చేసినట్లైతే కేవలం నాలుగైదు సంవత్సరాల కాలంలోనే వాటిని ఏర్పాటుచేయవచ్చు. వాటి ఏర్పాటుకు దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం లేదు. అంతవరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నా పర్వాలేదు. ఆ విషయం పైన దృష్టి సారించాల్సిన అవసరముంది. కేంద్ర ప్రభుత్వం ఐదు లక్షల కోట్ల రూపాయలు కొత్త రాజధాని ఏర్పాటుకు నిధులు కేటాయించి ప్రతి సంవత్సరం ఒక లక్ష కోట్ల రూపాయల చొప్పున కొత్త రాజధానికి కేటాయించినట్లైతే సమస్య త్వరగానే తీరుతుంది. పరిష్కారం కొంత వరకు సులభతరం అవుతుంది. అదే విధంగా నదీ జలాల పరిష్కారం విషయంలో ఇటు కొత్తగా ఏర్పడబోయే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అటు సీమాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఇరువురు సభ్యులుగా ఉండి ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసి ఆ ట్రిబ్యునల్ ఆధ్వర్యంలో నీళ్ల పంపకానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించవచ్చు. అన్ని అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిశీలన క్రింద ఉంటాయి కాబట్టి ఎవరూ బయపడాల్సిన అవసరముండదు.

అదే విధంగా ఇవాళ తెలంగాణ ప్రాంతంలో మెడికల్ కాలేజీలు, విశ్వవిద్యాలయాలు లేవు. జిల్లాకు ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందుకు అనుగుణంగా ప్రతి జిల్లాకు ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. విశ్వవిద్యాలయాలను తెలంగాణ జిల్లాల్లో, రాయలసీమ జిల్లాల్లో అదే విధంగా ఆంధ్ర జిల్లాల్లో ఏర్పాటు చేయండి. మాకేమి అభ్యంతరం లేదు. ఆ విధంగా ప్రతి జిల్లాకు ఒక విశ్వవిద్యాలయం చొప్పున ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అదే విధంగా ఈనాడు గిరిజన ప్రాంతాలకు సంబంధించిన సమస్యలున్నాయి. అది కూడా గణనీయమైన సమస్యే. ఆదివాసుల ఏ ప్రాంతంలో ఉన్నా వారి కోసం ప్రభుత్వం రక్షణ కల్పించాల్సిన అవసరముంది. మన రాష్ట్రంలో సింగరేణి బొగ్గు గనులు నాలుగు జిల్లాల్లో ఉన్నాయి. సింగరేణి బొగ్గు గనులు క్రింద ఉన్నవే గాకుండా మరి కొన్ని అండర్ గ్రౌండ్ మైన్స్‌ను ప్రభుత్వం నెలకోల్పినట్లైతే నాలుగు జిల్లాల్లోని చదువుకున్న వేలాది యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ఇవాళ రాష్ట్ర సచివాలయంలో గానీ, ప్రైవేట్ కార్పోరేట్ సంస్థల్లో గానీ, ప్రభుత్వ రంగ సంస్థల్లో గానీ తెలంగాణ ప్రాంత ఉద్యోగులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. ఆ విషయం పైన మాట్లాడాలంటే నాకు చాలా బాధకల్గుతోంది. సూక్ష్మ ప్రణాళికతో గౌరవ ముఖ్యమంత్రి గారైన శ్రీ ఎస్. కిరణ్ కుమార్ రెడ్డి గారు సమాచారాన్ని తెప్పించి చూసినట్లైతే వాస్తవం తెలుస్తుందనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను. ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు గారికి కూడా మొదట్లో తెలియలేదు. చెప్పే వరకు తెలియలేదు. వారికి తెలిసి అర్థమైన తరువాతే 610 జి.వో. విడుదల చేయడం జరిగింది. బ్రహ్మానంద రెడ్డి గారు కూడా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. మళ్లీ ఉద్యమం జరిగింది. బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలనే ఉద్యమం జరిగింది. అదే విధంగా తెలంగాణ సమస్య పరిష్కారానికి అఖిల పక్ష సమావేశం జరపాలనే నిర్ణయం జరిగింది. రౌండ్ టేబుల్ సమావేశం జరిపి ఆ అంశంపైన తుది నిర్ణయం తీసుకోవాలనే విషయంలో పెద్ద ఉద్యమం జరిగిన తరువాత నిరుద్యోగ సమస్య ఇంత పెద్దగా ఉందని గుర్తించి శ్రీ బ్రహ్మానందరెడ్డిలో

కదలిక వచ్చి విచారణ జరపగా, తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన ఉద్యోగాల్లో ఇతర ప్రాంతాలకు సంబంధించిన ఉద్యోగులు ఉండటం సమంజసం కాదని భావించారు.

మిస్టర్ స్పీకర్: మల్లేష్ గారు దయచేసి కూర్చోండి. గౌరవ ముఖ్యమంత్రి గారు మాట్లాడతారు.

మ.**2.20**

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి : మల్లేష్ గారు నేను తెలంగాణా వాసినా, సీమాంధ్రా వాసినా? నేను ఇక్కడ పుట్టాను, ఇక్కడ చదువుకున్నాను, ఇక్కడే క్రికెట్ ఆడాను, ఇక్కడే ఉన్నాను. నా వయస్సు యాభై మూడు సంవత్సరాలు. నేను తెలంగాణా వాసినా, సీమాంధ్ర వాసినా ?

శ్రీ టి.హరీష్ రావు(మైకు లేకుండా): సార్, ముఖ్యమంత్రి గారి డౌటును క్లారిఫై చేస్తాను.

మిస్టర్ స్పీకర్ : మీరు కూర్చోండి You will also get an opportunity.

శ్రీ జి.మల్లేష్: సార్, ముఖ్యమంత్రిగారు నన్ను అడిగారు, నేను సమాధానం చెబుతాను.

MR.SPEAKER: Harish Garu, I would like to facilitate a detailed discussion on the subject. I will give you an opportunity. So, please sit down. ముఖ్యమంత్రి గారు కాబట్టి మాట్లాడటానికి అవకాశం ఇచ్చాము. మీకు మాట్లాడే అవకాశం ఇస్తాను. దయచేసి కూర్చోండి.

శ్రీ టి.హరీష్ రావు(మైకు లేకుండా): సార్, ముఖ్యమంత్రి గారి అనుమానాన్ని నివృత్తి చేస్తాను.

మిస్టర్ స్పీకర్ : ఆయనకు అనుమానం రాలేదు. ఆయన మల్లేష్ గారిని అడిగారు వారు వివరణ ఇస్తారు.

శ్రీ జి.మల్లేష్: నేను వివరిస్తాను సార్, ముఖ్య మంత్రిగారు మంచి వారు యువకులు .

( ఈ దశలో సభలోని సభ్యుల నుండి నవ్వులు )

శ్రీ జి.మల్లేష్: ఆయన మనస్సును బట్టి ఆయన తెలంగాణ అనేది వారి మనస్సులో ఉంది. కానీ పార్టీ స్థానాలు ఆంధ్రలో కూడా రావాలనేది ఆయన ఉద్దేశ్యం, మళ్లీ పార్టీ గెలిచేలా ఉండాలనేది వారి ఉద్దేశ్యం సార్ వారిని తప్పు పట్టేందుకు లేదు.

( ఈ దశలో సభలోని సభ్యుల నుండి నవ్వులు )

MR.SPEAKER : Please don't distrub. మల్లేష్‌గారూ, మీరు మాట్లాడండి.

శ్రీ జి.మల్లేష్‌ః ముఖ్య మంత్రి గారి ఇష్టం సార్ ఎక్కడైనా వారుండనియండి.

శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి: నేను ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నాననే విషయాన్ని సభలో నేను మాట్లాడాల్సిన సందర్భంలో వివరిస్తాను. '' సమైక్యాంధ్ర నా నినాదం కాదు నా విధానం'' అని నేను మొన్న కూడా చెప్పాను. ఎందుకు ఆ విధానం తీసుకున్నాను అనేది నేను మాట్లాడే సమయంలో వివరిస్తాను. నేను నిలబడాలంటే తెలంగాణాలో సీటు వస్తుంది. సీటు గురించి ఓటు గురించి, రాజకీయాలు గురించి, రాజకీయాల్లో కొనసాగేందుకు నేను నిర్ణయాలు తీసుకోలేదు. ఈ రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల భవిష్యత్తు, తెలంగాణ ప్రజలతోపాటు రాష్ట్ర భవిష్యత్తు కోసమే నేను తీసుకున్న నిర్ణయమనేది నేను సభలో మాట్లాడే సమయంలో స్పష్టంగా వివరిస్తాను.

(ఈ దశలో తెలంగాణ రాష్ట్రసమితి సభ్యులు శ్రీ టి.హరీష్‌రావు గారి నుండి అంతరాయం )

MR.SPEAKER ః I will not allow. Harish Rao garu, you have to facilitate the discussion to take place. అందరికి మాట్లాడే అవకాశం ఇవ్వాలనే ఈ ప్రయత్నం ..

శ్రీ గుండా మల్లేష్ ః సార్ ఎలాగూ ముఖ్య మంత్రిగారు మాట్లాడుతారు వారికి ఎక్కడ మనస్సున్నదో ఆ ప్రాంతం గురించి మనస్ఫూర్తిగా మాట్లాడుతారు. మనసులో దాచుకొనే భయస్తుడేమీ కాదు. ఆయన డైనమిక్ గానే చెబుతారు.

మిస్టర్ స్పీకర్ః వదిలేయండి.

శ్రీ గుండా మల్లేష్ః ఈ రోజు తెలంగాణకు సంబంధించినటువంటి విషయాల్లో కరీంనగర్ జిల్లాలో గ్యాస్ ఆధారిత ప్రాజెక్టు ఒక దానికి భూమి పూజ చేయబడింది. అదే విధంగా రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి లో కూడా భూమి పూజ చేయబడింది. వీటికి సంబంధించిన పనుల విషయంలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. అటువంటి వాటన్నింటిపై మేము ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. వరంగల్ జిల్లా ఖాజీపేటలో రైలు పెట్టెల కర్మాగారం పెట్టాలనే ప్రతిపాదనలో జాప్యం జరుగుతోంది. ఈ రోజు రాష్ట్రంలో విపరీతమైన వనరులున్నప్పటికీ వాటిని ఉపయోగించుకోలేని పరిస్థితుల్లో పాలక పక్షం ఉంది. తెలంగాణలో వెనుకబాటుతనం ఉంది. వనరులను వినియోగించాలంటే, స్వయం పాలన లేకుండా పరాయి పరిపాలనలో ఉన్నామన్న భావన ప్రజలలో ఉన్నందున అభివృద్ధి లేని వాతావరణాన్ని ఏర్పాటు చేయవల్సిన అవసరం ఉంది. ప్రధానంగా తెలంగాణ ప్రాంతంలో ఐటీ పార్క్, పరిశ్రమల పార్క్‌ను, ప్యారామెడికల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది.

బయ్యారం గనులకు సంబంధించిన విషయం తమరికీ, ముఖ్యమంత్రిగారికీ అందరికీ తెలుసు. ఈ గనుల వ్యవహారం శాసనసభలో మా పార్టీ లేవనెత్తింది. అనిల్‌రెడ్డి అనేటువంటి వ్యక్తి చట్ట విరుద్ధంగా, గిరిజన ప్రాంతాలకు సంబంధించినటువంటి బయ్యారం గనులను అత్తగారిసొమ్మును మామ గారు ముఖ్యమంత్రి హోదాలో అల్లుడుకు ధారాదత్తం చేసిన ఘటన చారిత్రాత్మమైనది. గతంలో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో జరిగిన ఘటన ఇది. ఆ విషయాన్ని శాసనసభలో సిపిఐ లేవనెత్తగా పెద్ద ఎత్తున ఆందోళన జరిగితేనే ప్రభుత్వం గుర్తించింది. పార్లమెంట్‌లొ కూడా గురుదాస్ గుప్త గారు లేవనెత్తగా అక్కడున్న ఇతర పార్టీలు సహకరించాయి. అనంతరం పార్లమెంట్ నుండి డైరెక్షన్స్ రాగా మన మాజీ ముఖ్యమంత్రి రోశయ్య గారు ఆ డైరెక్షన్స్ మేరకు క్యాన్సిల్ చేశారు. బయ్యారం దగ్గర ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ జిల్లాలో కొన్ని చోట్ల రోడ్లు సరిగా లేవు. ఆంధ్రా ప్రాంతంలోనూ, రాయలసీమ ప్రాంతంలోనూ, కొన్నిచోట్ల వెనుకబడ్డ ప్రాంతాలున్నాయి. అటువంటి ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఇటువంటి అభివృద్ధి పనులను చేపట్టాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం పై ఉంది. ఈరోజు ప్రధానంగా తమరిద్వారా ఈ ప్రభుత్వానికి మనవి చేయునది ఏమనగా కృష్ణా జలాలపై ట్రైబ్యునల్‌కు సంబంధించిన విషయాన్ని సీరియస్‌గా తీసుకొవాల్సిన అవసరం ఉంది. ట్రైబ్యునల్‌కు కొత్త ఛైర్మన్‌ను నియమించాల్సిన అవసరం ఉంది. దీనిపై ముఖ్యమంత్రిగారు కూడా చొరవ తీసుకున్నారు అది మధ్యలో ఆగిపోడానికి వీలులేదు. మన రాష్ట్ర భవిష్యత్తు ప్రయోజనాల దృష్ట్యా ఇప్పటికే బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును వెనుకకు నెట్టాల్సిన అవసరం ఉంది.

తెలంగాణకు గుండెకాయ అయినటువంటి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులు పూర్తికావాలంటే మన ప్రభుత్వంతోనే కాదు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించేందుకు గాను ఈ బిల్లు ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాల్సిన అవసరం ఉంది. అదే విధంగా శ్రీ హరికోట అంతరిక్ష పరిశోధనా కేంద్రానికి సంబంధించిన విషయాలు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దుగరాజుపట్నం ఓడరేవు ప్రాంతానికి సంబంధించిన సమస్యకూడా ఒక ముఖ్యమైన సమస్యగా మన ముందుకొస్తున్నందున వాటిని కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. పోలవరం ప్రాజెక్ట్ భూనిర్వాసితులకు సంబంధిచిన సమస్య కూడా మనముందున్నది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖమ్మం జిల్లా ప్రజలకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. కల్వకుర్తి, నెట్టెంపాడు, ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్‌లు కానీ, రాయలసీమ ప్రాంతంలోని గాలేరు, నగరి, హంద్రీనీవా ప్రాజెక్ట్‌లకు సంబంధించిన విషయంగానీ, నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరివాహక ప్రాంతం గురించి ఈటెల రాజేందర్‌గారు చెప్పినట్లు ఎడారిగా మారే ప్రమాదం ఉన్నందున దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇటువంటి అనేక మైన సమస్యలను మీ ద్వారా అందజేసేందుకు లిఖితపూర్వకంగా మాపార్టీ తరఫున సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. తమద్వారా మనవి చేసేదేమనగా బిల్లు వచ్చినందుకు, దాన్ని సభలో ప్రవేశపెట్టి బిల్లుపై చర్చ ప్రారంభించినందుకు చాలా సంతోషం. తమద్వారా అన్నీ పక్షాల నాయకులకు మనవి చేసేదేమనగా చారిత్రాత్మక మైన తెలంగాణ

ఏర్పాటుకు సమస్యకు ఎవరూ అడ్డు తగలకుండా సహకరించాల్సిందిగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

MR.SPEAKER: Now, the House is adjourned to meet again at 9.00 AM on Friday, the 17th of January, 2014.

**(The House then Adjourned. at 2.29 PM, to meet again at 9.00 AM on Friday the 17th of January, 2014.)**